మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 19 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 284 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

ఆమె వయస్సు 30.. ఆయన వయస్సు 75

వారి ప్రేమ వివాహానికి నిశ్చితార్థం

2

తెలంగాణ వైభవాన్ని చాటిన సద్దుల బతుకమ్మ



ట్యాంక్ బండ్‌పై

1000 మంది మహిళలతో వేడుకలు

700 బతుకమ్మలతో హుస్సేన్‌సాగర్ తీరాన ఆడిపాడిన అతివలు

తీరొక్క పూలతో పూలవనాన్ని తలపించిన ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు

వేడుకలకు హాజరైన గవర్నర్ శుక్లా దంపతులు

పాల్గొన్న మంత్రులు జూపల్లి, సీతక్క

ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ, రష్మిక

హైదరాబాద్, అక్టోబర్ 18 (మనం బ్యూరో): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఘనంగా జరిగాయి. సుమారు 1000 మంది మహిళలు అందంగా అలంకరించిన బతుకమ్మలను చేతబట్టి నిర్వహించిన భారీ ఊరేగింపు వేడుకలకు ...మిగతా 2లో

పోయి'రా' బతుకమ్మ.. పోయి రావమ్మా!

బతుకమ్మ ఆటపాటలతో పులకించిన తెలంగాణ

సద్దుల బతుకమ్మతో సంబురాలకు వీడ్కోలు

ఆడబిడ్డల ఆనందాలు.. రంగు పూల సొబగులు.. తళుకులీనిన రాష్ట్రం

3

సిరీస్ గెలుచుకున్న టీమిండియా

రెండో టీ20 మహిళా క్రికెట్‌లో జింబాబ్వే చిత్తు

ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే విజయాన్ని డిక్లేర్ చేసుకున్న భారత్ టీమ్

2

మాజీ ముఖ్యమంత్రి అంజయ్య

జీవితం అందరికీ ఆదర్శప్రాయం

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 18 (మనం బ్యూరో): కార్మికుడి నుండి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన అంజయ్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం ఉమ్మడి ఏపీ మాజీ సీఎం అంజయ్య వర్ధంతి సందర్భంగా లుంబిని పార్క్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సామాన్య కార్మికుడిగా తన జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వంటి అత్యున్నత పదవిని చేపట్టిన ఘనత అంజయ్యకే దక్కుతుందన్నారు. సామాన్య ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ నిరంతరం ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా అంజయ్య గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ మనసు చూరగొన్న నాయకుడిగా అంజయ్య నిలిచారనీ, పేదల పెన్నిధిగా పేరు పొందిన ఆయన ప్రజల ...మిగతా 2లో

ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ ఘటన..

బాధితులకు సీఎం రేవంత్ భరోసా

హైదరాబాద్, అక్టోబర్ 18: నాదర్‌గుల్ లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు బాధితులను మెరుగైన చికిత్స కోసం యశోద ఆస్పత్రికి తరలించారు. కాగా.. హైదరాబాద్ శివారులోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన డాండియా వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకున్న విషయం పాఠకులకు విదితమే. విద్యుత్ దీపాలతో అలంకరించిన భారీ ఆర్చ్ ఒక్కసారిగా కూలిపోవడంతో ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థిని నారాయణదాసు సోనా (18) మృతి చెందగా.. మరో 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. మృతురాలి సోదరి మీనా కూడా ఈ ఘటనలో గాయపడినట్లు సమాచారం.

ప్రారంభమైన దర్యాప్తు..

ప్రమాద నేపథ్యంలో ఎంవీఎస్ఆర్ కాలేజీ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి.. ఘటనాస్థలికి ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు విధించారు. వేడుకల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఈవెంట్ మేనేజ్మెంట్కు అప్పగించినట్లు తెలుస్తోంది. భారీ ఆర్చ్ ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు పాటించారా, ...మిగతా 2లో

నేడు ఫ్యూచర్ సిటీలో సీఎం రేవంత్ పర్యటన

ఇబ్రహీంపట్నంలో పోలీస్ కమిషనరేట్ ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 18, (మనం బ్యూరో): సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఫ్యూచర్ సిటీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 3-30 గంటలకు ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 5-30 గంటలకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శించనున్న ముఖ్యమంత్రి సాయంత్రం 6 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

టైగర్ ప్రూఫ్ కారుపై కాల్పులు

తప్పించుకున్న సినీ హీరో

ముంబై, అక్టోబర్ 18: ముంబైలోని రద్దీ ప్రాంతమైన జుహులో బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌ను టార్గెట్‌గా చేసుకుని దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం రాత్రి 7:30 ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారులో ప్రయాణిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మోటార్ ట్యాక్సీపైవచ్చిన ముగ్గురు దుండగులు ఆయన వాహనంపైకి 5 రౌండ్లకు పైగా కాల్పులు జరిపారు. ఈ ఊహించని పరిణామానికి కారులో ఉన్నవారు అప్రమత్తమవడంతో ...మిగతా 2లో

యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

నోటిఫికేషన్ జారీకి క్లియరెన్స్ ఇచ్చిన సర్కార్

హైదరాబాద్, అక్టోబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం పండుగల వేళ శుభవార్త తెలిపింది. 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ అనుమతి ఇచ్చింది. తొలి విడతలో ప్రత్యక్ష నియామకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలో అత్యధికంగా 252 పోస్టులను భర్తీచేయనుంది. అలాగే, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీల్లో చెరో 49 పోస్టులు, పాలమూరు యూనివర్సిటీలో 45 పోస్టులు, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీల్లో చెరో 16 పోస్టులు, తెలంగాణ యూనివర్సిటీలో రెండు పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నియామక ప్రకటనల జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను

తోసిపుచ్చిన గోదావరి బోర్డు

- అనుమతులు పొందిన ప్రాజెక్టులపై పునఃసమీక్షించే అధికారం లేదని స్పష్టీకరణ
- 30న జరగనున్న బోర్డు సమావేశం
- నిధులు, టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుపై చర్చ

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తోసిపుచ్చింది. ఇప్పటికే అన్ని అనుమతులు ...మిగతా 2లో

ఆర్టీసీ ఉద్యోగులకు పండుగ అడ్వాన్స్

హైదరాబాద్, అక్టోబర్ 18: ఆర్టీసీ ఉద్యోగులకు పండుగ అడ్వాన్సు చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది. 2026 సంవత్సరానికి అర్హులైన హిందూ, క్రైస్తవ మతాలకు చెందిన క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులకు ఈ అడ్వాన్సు అందించనున్నారు. ఈ మేరకు సంస్థ చైర్మన్, ఎండీ నాగిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన ఉద్యోగులకు నిర్దేశిత రేట్ల ప్రకారం అనుబంధ వేతన బిల్లు ద్వారా వెంటనే అడ్వాన్సు చెల్లించాలని ఆదేశించారు. ఈ మొత్తాన్ని పది సమాన వాయిదాల్లో ఉద్యోగుల వేతనాల నుంచి తిరిగి వసూలు చేయనున్నారు.

ఫ్రాన్స్‌లో ఆందోళనలకు

టుక్‌డే..టుక్‌డే వలస వాదులే కారణం

ఆ దేశం పరిస్థితులపైనా ట్రంప్ అదే వైఖరి

న్యూయార్క్, అక్టోబర్ 18: ఫ్రాన్స్ లో కొనసాగుతున్న ఆందోళనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింసాత్మక ఘటనలతో ఆ దేశం భగ్గుమంటోందన్నారు. పూర్తిగా భిన్నమైన ప్రపంచం నుంచి వచ్చి, ద్వేషంతో ఉన్న వలసదారులే వీటికి కారణమని ఆరోపించారు. ఒకప్పుడు గొప్పగా వెలుగొందిన దేశాన్ని ముక్కలు ముక్కలుగా చేస్తున్నారని మండిపడ్డారు. మరీ ఆలస్యం కాకముందే దేశ సరిహద్దులను మూసివేసి నియంత్రణలోకి తెచ్చుకోవాలని ఆ దేశ నాయకత్వానికి సూచించారు. ఈ ...మిగతా 2లో

మరోసారి 2 భగ్గుమన్న ఫ్రాన్స్!

భూతాపంతో పెరగనున్న ఏసీ కాలుష్యం

050 నాటికి 0.03-0.07 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల వెల్లడి

పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను పెంచడం ఒక పరిష్కారం

రూఫ్‌టాప్ సోలార్ విద్యుతు వినియోగాన్ని పెంచాలె

హైదరాబాద్, అక్టోబర్ 18: 'భూతాపంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇంధన పొదుపు సామర్థ్యంతో కూడిన ఏసీల వినియోగంపై దృష్టి పెట్టాలి. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలైన రూఫ్‌టాప్ సోలార్, పవన విద్యుత్తు వ్యవస్థలను గణనీయమైన వేగంతో పెంచాల్సిన అవసరముంది' అని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ నివేదిక అభిప్రాయపడింది. భవన లోపలి ఉష్ణోగ్రతలు తగ్గించేలా బిల్డింగ్ కోడ్ అమలు చేయాలని సూచించింది. 'ఏసీలు-భూతాపం పెరగకుండా చర్యలు' అనే అంశంపై నివేదిక విడుదల చేసింది.

ఏసీతో కరెంట్ వినియోగం 36 శాతం పెరుగుదల..

ఒక ఇంట్లో ఏసీ ఉంటే.. ఆ ఇంటి విద్యుత్తు వినియోగం ...మిగతా 2లో

విదేశీ సంస్థలకు రహస్య సమాచారం..

పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి భార్య

ఢిల్లీ, అక్టోబర్ 18: విదేశీ గూఢచర్య సంస్థలకు దేశ రక్షణకు సంబంధించిన సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలతో.. ఆర్మీ అధికారి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపే సున్నితమైన పత్రాలు, ఫోటోలు, ఎలక్ట్రానిక్ డేటాను రహస్యంగా సేకరించడం, బదిలీ చేయడం వంటి విషయాల్లో విదేశీ ఏజెంట్లకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం అందినట్లు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. పరిశోధన సంబంధిత కార్యకలాపాలను ఆర్మీ అధికారి పర్యవేక్షించేవారు. ఆయన భార్యకు కొన్ని నెలల క్రితం.. సోషల్ మీడియాలో పలువురు వ్యక్తులు పరిచయం అయ్యారు. వారు తమను తాము విద్యావేత్తలుగా చెప్పుకున్నారు. వ్యాసాలను ప్రచురిస్తామని నమ్మించి రక్షణ అంశాలపై వ్యాసాలు రాయించారు. ఎటువంటి అనుమానం రాకుండా ఉండేందుకు మొదట పర్యావరణం, భౌగోళిక రాజకీయాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రాయిస్తూ.. ...మిగతా 2లో

టుక్ డే టుక్ డే వలస వాదులే కారణం

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ట్రూత్ సోషల్లో పోస్టు పెట్టారు.

మరోసారి భగ్గుమన్నఫ్రాన్స్!

ఫ్రాన్స్ అల్లర్లపై ట్రంప్ స్పందించడం ఇదే తొలిసారి కాదు. ఇటీవల ఓ సందర్భంగా ఆందోళనలను ప్రస్తావిస్తూ.. వ్యంగ్యంగా మాట్లాడారు. అదో అందమైన దేశమని, అక్కడ ఎలాంటి ఆందోళనలు, ఉద్యమాలు ఉండవని ఎద్దేవా చేశారు. విప్లవాలకు ఆదో మంచి ప్రదేశమని, అక్కడకు వెళ్లి ఆందోళనల్లో పాల్గొందామని హాస్యంగా చెప్పారు. మరోవైపు, ఆ దేశంలో అశాంతికి వలసలే కారణమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా పరోక్షంగా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

మరోసారి భగ్గుమన్నఫ్రాన్స్!

ప్యారిస్, అక్టోబర్ 18: ఫ్రాన్స్ విద్యారంగంలో సంస్కరణలు కోరుతూ కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు రోజు రోజుకు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ క్రమంలో అనేక నగరాల్లో మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పారిస్ సిటీ సెంటర్కు సమీపంలో ఆందోళనకారులు ఓ కారుతో పాటు దుకాణానికి నిప్పుపెట్టారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఫ్రాన్స్ లో మూడో అతిపెద్ద నగరమైన లియోన్లోనూ అల్లర్లు చెలరేగాయి. ఓ టూరిస్టు ఆఫీస్కు నిప్పుపెట్టారు. మార్సెయిల్ నగరంలోనూ ఓ పోలీస్ స్టేషన్తోపాటు పలు దుకాణాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఈ ఆందోళనలకు కార్మిక సంఘాలు కూడా మద్దతిచ్చినట్లు సమాచారం. హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్న పోలీసులు.. దేశవ్యాప్తంగా 166 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు, ఉపాధ్యాయ సిబ్బంది కొరత, విద్యారంగానికి నిధుల లేమి, పాఠశాల భవనాల దుస్థితికి వ్యతిరేకంగా ఫ్రాన్స్ లో కొన్ని రోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయి. వీటితోపాటు యూనివర్సిటీల్లో ప్రవేశాల వ్యవస్థ కూడా సంక్లిష్టంగా ఉందంటూ విద్యార్థులు కూడా ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో ఆందోళనకారులు ఇటీవల దేశంలో వందలాది పాఠశాలలకు నిప్పంటించిన విషయం తెలిసిందే.

పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి భార్య

(మొదటి పేజీ తరువాయి)

క్రమంగా రక్షణ రంగానికి సంబంధించిన విషయాల వైపు మళ్లించారు. ఈ విషయం తెలియని మహిళ వారిని నిజమైన విద్యావేత్తలుగా నమ్మి.. వారి ఉచ్చులో పడిపోయింది. రక్షణ, ఆయుధ వ్యవస్థలపై వ్యాసాలతో పాటు కీలక సైనిక స్థావరాల ఫొటోలు, వీడియోలు వాటిలో పొందుపరిచింది. రక్షణ రంగానికి సంబంధించిన వివరాలను కూడా ఆమె వారికి చేరవేసిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

భూతాపంతో పెరగనున్న ఏసీ కాలుష్యం

(మొదటి పేజీ తరువాయి)

36 శాతం పెరుగుతుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న ఏసీల ఇంధన పొదుపు సామర్థ్యం తక్కువగా ఉంది. 2033 నాటికి కొత్తగా అమ్మే ఏసీలు ఉత్తమ మోడళ్లు, అత్యుత్తమ ఇంధన పొదుపు పనితీరు నిబంధనలు అమలు చేస్తే, 2035 నాటికి ఏసీల విద్యుత్తు వినియోగాన్ని ఏడాదికి దాదాపు 86 టెరావాట్ గంటల వరకు తగ్గించవచ్చు. ఇది దేశ విద్యుత్తు వినియోగంలో 4 శాతానికి సమానం. దేశంలో 2020లో ఏసీల వాడకం 9 శాతం ఉంది. ప్రస్తుతం 15శాతం కుటుంబాలు వినియోగిస్తున్నాయి. ఏటా ఉష్ణోగ్రతలు, వడగాలుల తీవ్రత పెరగడంతో 2050 నాటికి ఇది 33 శాతానికి చేరుతుందని అంచనా. ఏసీ డిమాండును తట్టుకుని భూతాపాన్ని అదుపులో పెట్టాలంటే.. సోలార్, విండ్ లాంటి పునరుత్పాదక ఇంధన వనరులను, వినియోగాన్ని భారీగా పెంచాలి.

హైడ్రో ఫ్లోరో కార్బన్లతో ఎక్కువ భూతాపం..

విద్యుత్తు వినియోగం కన్నా.. ఏసీల ఉద్గారాలు వాతావరణాన్ని మరింత ప్రభావితం చేస్తాయి. ఏసీల్లో శీతలీకరణ పదార్థాలుగా వాడే హైడ్రో ఫ్లోరో కార్బన్లు (హెచ్ఎఫ్ సీ)... కార్బన్ డయాక్సైడ్ కన్నా ఎక్కువ భూతాపం కలిగిస్తాయి. ఏసీల్లో ఉపయోగించే హెచ్ఎఫ్సీ ఆర్-410ఏ.. కార్బన్ డయాక్సైడ్ కన్నా 2,088 రెట్లు ఎక్కువ భూతాపం కలిగించే సామర్థ్యం (జీఎంపీ) ఉంది. 2050నాటికి ఏసీల వినియోగం కారణంగా సగటు ఉష్ణోగ్రత 0.03 - 0.07 డిగ్రీలకు పెరిగే ప్రమాదముంది. భూతాపం 3 డిగ్రీలు పెరిగితే దేశ తలసరి జీడీపీలో 32 శాతం కోల్పోతుందని ఆందోళన వ్యక్తంచేసింది.

క్లీన్ ఎనర్జీగా మారాల్సిందే...

భారత్ క్లీన్ ఎనర్జీ దిశగా వేగంగా మారాలి. లేదంటే ఏసీ ఉద్గారాలు పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఇంధన పొదుపు సామర్థ్యం కలిగిన ఏసీలు వినియోగించాలి. మెరుగైన మోడళ్లను ప్రోత్సహించాలి. పునరుత్పాదక ఇంధన వనరుల వ్యవస్థలు భారీగా ఏర్పాటు చేస్తే పవర్ గ్రిడ్ పై ఒత్తిడి తగ్గుతుంది. ఇండ్లల్లో ఉష్ణోగ్రతలు తగ్గించేలా భవన నిర్మాణ డిజైన్లు రూపొందిస్తే ఏసీ వినియోగాన్ని తగ్గించవచ్చునంటూ ఆ నివేదిక తెలిపింది.

టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

టైగర్ ష్రాఫ్ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ఈ కాల్పుల ఘటనలో టైగర్ ష్రాఫ్ కారు డ్రైవర్తో పాటు మరో ఆటోరిక్షా డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు.

విచారణకు ఆదేశించిన సీఎం ఫడ్నవీస్...

ఈ ఘటనపై జుహు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన ముంబై పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రముఖ నటుడు జాకీ ష్రాఫ్ కుమారుడైన టైగర్ ష్రాఫ్ పై జరిగిన ఈ దాడి ముంబై నగరంలో కలకలం రేపింది. మరోవైపు, తామే ఈ కాల్పులు జరిపినట్లుగా గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.గ్యాంగ్ స్టర్ అనిల్ పండిట్ సోషల్ మీడియాలో ఈ మేరకు పోస్ట్ పెట్టాడు. ఈ కాల్పుల ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సీఎం ఫడ్నవీస్ దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

ట్యాంక్‌బండ్‌పై 1000 మంది మహిళలతో వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువత, సందర్శకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ట్యాంక్‌బండ్ పండుగ వాతావరణంతో కళకళలాడింది. వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా తెలంగాణ టూరిజం, సాంస్కృతిక శాఖ, శిల్పారామం, టీజీఆర్టీసీ భాగస్వామ్యంతో రూపొందించిన ప్రత్యేక తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శకటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ శకటం సందర్శకులను ఆకట్టుకుంది.

బతుకమ్మ పండుగ స్ఫూర్తితో జలవనరుల పరిరక్షణకు కృషి చేయాలి

గవర్నర్ శుక్లా పిలుపు..

ఈ సందర్భంగా గవర్నర్ శుక్లా మాట్లాడుతూ బతుకమ్మ పండుగ స్ఫూర్తితో ప్రకృతి, జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అనీ, ప్రకృతి పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్తు లభిస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా ఈ విశిష్ట సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్న అతివల సృజనాత్మకత, అంకితభావం అభినందనీయమన్నారు. ఎల్ నినో వంటి ప్రతికూల వాతావరణ పరిణామాల నేపథ్యంలో ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకత మరింత పెరిగిందని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదు కావడం, భవిష్యత్తులో నీటి సంక్షోభంపై హెచ్చరికగా భావించాలన్నారు. నీటి ఎద్దడి తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే పొదుపును అలవాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, చెరువులను పరిరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటి చర్యలకు ప్రాధాన్యమివ్వాలని ఈ సందర్భంగా శుక్లా సూచించారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక..: మంత్రి జూపల్లి

బతుకమ్మ పండుగ మన రాష్ట్ర పండుగ...తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు,ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రంగు రంగుల పూలను పేర్చి పూలనే దేవతగా కొలిచే గొప్ప పండుగ బతుకమ్మ అనీ, ఈ పండుగ ద్వారా మహిళలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. బతుకమ్మ పాటలు, పూల అలంకరణలు, జానపద కళారూపాలతో తెలంగాణ సంప్రదాయాల వైభవం ప్రతిబింబిస్తోందన్నారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా హిందీ పాటలతో పాటు పంజాబీ పాటలు విశేషంగా వినిపించేవనీ, ఇప్పుడు మన తెలంగాణ జానపద గేయాలు కూడా అదే విధంగా విస్తృత ప్రజాదరణ పొందుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

చెరువులు, చేన్లను పరిరక్షించుకోవాలనే సంకేతానికి నిదర్శనం : మంత్రి సీతక్క

చెరువులు, చేన్లను పరిరక్షించుకోవాలనే సంకేతానికి బతుకమ్మ పండుగ నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బతుకమ్మ ఆరోగ్యాన్ని, ఆనందాన్నిచ్చే పండుగనీ, ఈ సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఆడబిడ్డను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే సీఎం రేవంత్ లక్ష్యమనీ, ప్రతి మహిళను బతుకమ్మ లాగా గౌరవిద్దామని పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ, రష్మిక...

ట్యాంక్‌బండ్‌పై జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైన స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా రష్మిక బతుకమ్మ ఆడి సందడి చేశారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను వేలాది మంది మహిళలతో కలసి ఆడటం సంతోషాన్నిచ్చిందన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ బతుకమ్మను చూస్తే చాలా ముద్దుగా అనిపిస్తుందనీ ఇంట్లో వాళ్లు బతుకమ్మను చేస్తుంటారని గుర్తు చేసుకున్నాడు. పెళ్లి తరువాత రష్మికతో కలిసి తెలంగాణలో జరిగే అతిపెద్ద బతుకమ్మ వేడుకలో పాల్గొనాలని ముందే అనుకున్నాననీ, అనుకున్నట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించడం సంతోషాన్నిచ్చిందన్నారు.

ఇంట్లో ఏసీ ఉన్నంత మాత్రాన.. పింఛన్ ఇవ్వనంటారా?

కేరళం మంత్రి కీలక ప్రతిపాదన

తిరువనంతపురం, అక్టోబర్ 18:పింఛన్ల అర్హత నిబంధనలపై కేరళం స్థానిక స్వపరిపాలనశాఖ మంత్రి కె.ఎం.షాజీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంట్లో ఏసీ ఉన్నంత మాత్రాన పింఛన్కు అనర్హులుగా ప్రకటించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'ఏసీ అనేది ప్రతి సందర్భంలో విలాసవంతమైన వస్తువు కాదు. ప్రస్తుతం అదొక ప్రాథమిక అవసరంగా మారింది. ప్రత్యేక వైద్య పరిస్థితుల కారణంగా ఏసీ లేకుండా ఉండలేని రోగులు చాలా మంది ఉన్నారు. కాబట్టి.. ఒక వ్యక్తికి పింఛన్ పొందే అర్హత ఉందో లేదో నిర్ణయించేందుకు ఇంట్లో ఏసీ ఉండటం అనేది ప్రాతిపదిక కాకూడదు' అని పేర్కొన్నారు.కేరళంలో ప్రభుత్వ సంక్షేమ పింఛన్ అర్హత మార్గదర్శకాల ప్రకారం.. ఇంట్లో ఏసీ ఉన్నవారు పెన్షన్ పొందేందుకు అనర్హులు. దాన్ని తొలగించాలనేది అందరి అభిప్రాయమనిమంత్రి తెలిపారు. అందుకే ఈ నిబంధనను తొలగించాలని కోరుతూ ఆర్థిక శాఖకు లేఖ రాసినట్లు వెల్లడించారు.

పవర్ గ్రిడ్‌కు డేటా సెంటర్ల ముప్పు

గ్రిడ్-ఇండియా హెచ్చరిక

ఢిల్లీ, అక్టోబర్ 18: దేశంలో వేగంగా విస్తరిస్తున్న డేటా సెంటర్లు జాతీయ విద్యుత్ గ్రిడ్ కు కొత్త చిక్కులను తెచ్చిపెడుతున్నాయని జాతీయ గ్రిడ్ ఆపరేటర్ గ్రిడ్-ఇండియా హెచ్చరించింది. విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపాలు లేదా వోల్టేజ్ తగ్గినప్పుడు, డేటా సెంటర్లు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా గ్రిడ్ నుండి డిస్కనెక్ట్ అయి, వెంటనే తమ సొంత బ్యాటరీలు లేదా జనరేటర్లకు మళ్లుతాయి. గ్రిడ్ భాషలో 'సైలెంట్ ఎగ్జిట్'గా పిలిచే ఈ ప్రక్రియ వల్ల, ఏకంగా 1 నుండి 3 గిగావాట్ల వరకు భారీ విద్యుత్ డిమాండ్ క్షణాల వ్యవధిలో గ్రిడ్ నుంచి మాయమవుతుంది. ఇది ఒక చిన్న రాష్ట్రం మొత్తానికి అవసరమైన కరెంటుతో సమానమైన సరఫరా-డిమాండ్ వ్యత్యాసాన్ని సృష్టించి గ్రిడ్ వ్యవస్థ అస్థిరపడే ప్రమాదముంది. ప్రస్తుతం 2 గిగావాట్ల కంటే తక్కువగా ఉన్న భారత డేటా సెంటర్ల సామర్థ్యం 2030 నాటికి 24-26 గిగావాట్లకు చేరుకుంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనా వేస్తున్న నేపథ్యంలో.. అమెరికాలోని వర్జీనియాలో 3.8 గిగావాట్ల లోడ్ కోత వల్ల ఏర్పడిన గ్రిడ్ సంక్షోభం భారత్లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రిడ్-ఇండియా సీఎండీ సమీర్ చంద్ర సక్సేనా సూచించారు. దీన్ని నివారించేందుకు సౌర, పవన విద్యుత్ ఎక్కువగా లభించే గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో వీటిని ఏర్పాటు చేయడం, విద్యుత్ను ఆదా చేసే ఆధునిక కూలింగ్ పద్ధతులను పాటించడం ఎంతో అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశ్నించే నోళ్లను మూయించేందుకే పోలీసు దౌర్జన్యం

పోలీసుల దౌర్జన్యం అన్నిహద్దులూ దాటి పోయిందన్నరాహుల్ గాంధీ

ఢిల్లీ, అక్టోబర్ 18: తమను ఎవరూ ప్రశ్నించే ధైర్యం చేయకుండా ప్రజల నోళ్లను మూయించే కుట్రలో భాగంగానే విద్యార్థులు, మహిళలపై ఢిల్లీ పోలీసులు ఇటీవలి ప్రదర్శనల్లో తీవ్ర అణచివేతకు పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. పోలీసు దౌర్జన్యం సిగ్గుపడాల్సిన రీతిలో అన్ని హద్దులూ దాటిపోయిందని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యం కోసం గళం విప్పిన విద్యార్థులు, మహిళలకు వ్యతిరేకంగా ఢిల్లీ పోలీసుల దౌర్జన్యం హద్దు మీరిపోయింది. ఇందులో భాగంగా ఢిల్లీ పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడటం, వస్త్రాలు లాగడం, వంటి సిగ్గుమాలిన పనులు చేశారు' అని ఆయన అన్నారు.

ఇదంతా ప్రజా గళాన్ని మూయించే కుట్రలో భాగం. ఎవరూ ప్రశ్నించే సాహసం చేయకుండా నిరోధించాలనే కుట్రలో భాగంగా నిరసనకారుల్లో భయాన్ని నింపుతూ వారిని తీవ్రంగా అవమానించడమే ఈ దమననీతి ఆంతర్యం' అని ఆయన అన్నారు. 'అధికారం చేజారిన మరుక్షణం తమ ఇష్టారాజ్యం అంతమైపోతుందని మోడీ-షాలకు తెలుసు. ఆ భయంతోనే పోలీసుల సాయంతో దేశంలోని మహిళలపై, యువజనులపై హింస, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు' అని ఆయన అన్నారు. ఇటీవలి నిరసన ప్రదర్శనల్లో పోలీసుల చేతిలో తీవ్ర దౌర్జన్యానికి గురైన కొందరు యువకులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన పది నిమిషాల వీడియోను కూడా ఆయన తన పోస్టుకు జతచేశారు.

ఆమె వయస్సు 30.. ఆయన వయస్సు 75

వారి ప్రేమ వివాహానికి నిశ్చితార్థం..

హైదరాబాద్, అక్టోబర్ 18: సుమారు 30 ఏళ్ల వయస్సున్న యువతి, 75 ఏళ్ల వృద్ధుడ్ని ప్రేమించింది. ఆయనను పెళ్లి చేసుకోవాలని ఆమె నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగింది. వయస్సులో 45 ఏళ్ల వ్యత్యాసం ఉన్నప్పటికీ ఆ వృద్ధుడికితో వివాహానికి తనకు ఎలాంటి అభ్యంతరం, సమస్య లేదని ఆ మహిళ స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్ లోని ఔరైయా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 30 ఏళ్ల రీనా, సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్గా పాపులర్ అయ్యింది. ఏడాది కిందట 75 ఏళ్ల రామ్ సాగర్ తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇది వారిద్దరి మధ్య ప్రేమగా మారింది. దీంతో పెళ్లి చేసుకోవాలని వారు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇటీవల వీరిద్దరికి ఘనంగా నిశ్చితార్థం జరిగింది. దసరా నవరాత్రుల తర్వాత వారి పెళ్లి కోసం ఏర్పాట్లు కూడా కొనసాగుతున్నాయి.

కాగా, 75 ఏళ్ల వృద్ధుడైన రామ్ సాగర్ను తాను పెళ్లి చేసుకోబోతున్నట్లు రీనా ధృవీకరించింది. తమ ఇద్దరి మధ్య 45 ఏళ్ల వయస్సు వ్యత్యాసం ఉన్నప్పటికీ అది ఏమాత్రం సమస్య కాదని ఆమె స్పష్టం చేసింది. తన నిర్ణయం పట్ల తాను సంతోషంగా ఉన్నట్లు తెలిపింది. తమ మధ్య ఉన్న వయస్సు అంతరం తమ బంధానికి ఎటువంటి అడ్డంకి కాదని ఆమె చెప్పడం విశేషం.

మీకు నా అశీస్సులు

పార్టీ నేతలకు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, మనం ప్రతినిధి: తమ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కే. చంద్రశేఖర రావుని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎర్రవెల్లి నివాసంలో ఆదివారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వారిరువురికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని కేసీఆర్ ఈ సందర్భంగా వారిని ఆశీర్వదించారు.

సిరీస్ గెలుచుకున్న టీమిండియా

- రెండో టీ20 మహిళా క్రికెట్లో జింబాబ్వే చిత్తు
- ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే విజయాన్ని డిక్లేర్ చేసుకున్న భారత్ టీమ్

రాయ్ పూర్, అక్టోబర్ 18: రాయ్ పూర్లో జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో భారత మహిళా జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు టీ20ల సిరీస్ ను మరొక మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకుంది. 103 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 8.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ షఫాలీ వర్మ(55; 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో చెలరేగింది. కెప్టెన్ స్మృతి మంధాన(47; 25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించింది. అనుష్క శర్మ(1) నాటౌట్గా నిలిచింది. జింబాబ్వే బౌలర్లలో బిజా మాత్రమే వికెట్ తీయగలిగింది.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన జింబాబ్వే.. నిర్ణీత 20 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. తిరుపనో(34) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ రాణించలేకపోయారు. భారత బౌలర్లలో నికీ ప్రసాద్ 2, క్రాంతి గౌడ్, శ్రీచరణి, దీప్తి శర్మ, నందనీ శర్మ తలొక వికెట్ పడగొట్టారు. కాగా ఈ సిరీస్ లో నామమాత్రపు మూడో టీ20 మంగళవారం జరగనుంది.

తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చిన గోదావరి బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

పొందిన ప్రాజెక్టుల గురించి మళ్లీ చర్చించే అధికారం తమకు లేదని బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ అభ్యంతరాలను పక్కన పెడుతూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ)ల నుంచి అనుమతులు పొందిన ప్రాజెక్టులను పునఃసమీక్షించలేమని గోదావరి బోర్డు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను బోర్డు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు, ఈ నెల 30వ తేదీన జరగనున్న బోర్డు సమావేశానికి సంబంధించిన అజెండాను ఉభయ రాష్ట్రాలకు పంపింది. గత 17వ సమావేశపు మినిట్స్ను ఆమోదించడం, బోర్డు నిర్వహణకు తెలుగు రాష్ట్రాలు నిధులు కేటాయించడం, ప్రాజెక్టుల వద్ద నీటి లభ్యతను కొలిచేందుకు టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు వంటి కీలక అంశాలను అజెండాలో చేర్చారు. వీటితో పాటు ఏపీలోని ప్రాజెక్టుల మదింపు పురోగతిపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు. అయితే, తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏపీ అభ్యంతరాలకు అజెండాలో చోటు కల్పించకపోవడం గమనార్హం.

బాధితులకు సీఎం రేవంత్ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

తగిన అనుమతులు తీసుకున్నారా అనే కోణంలో ఆదిభట్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఈవెంట్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం, యాజమాన్యం మరియు నిర్వాహకుల నిర్లక్ష్యంపై విచారణ కొనసాగుతోంది.

కోల్‌కతా దుర్గా మండపం తొక్కిసలాట

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం

కోల్‌కతా, అక్టోబర్ 18: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చోర్‌బగాన్ సర్బజనీన్ దుర్గా మండపం వద్ద శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన 19 కుటుంబాల్లో విషాదం నింపిన విషయం పాఠకులకు విదితమే. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు 25 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా ఘటనపై దర్యాప్తునకు సిట్ను ఏర్పాటు చేసింది. బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దుర్గాపూజ నిర్వాహకులు, ప్రైవేట్ భద్రతా సిబ్బంది, విధుల్లో ఉన్న సిబ్బందిని పోలీసులు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఈ ఘటన అత్యంత విషాదకరమని పేర్కొన్న ఆయన, గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందించడం ప్రస్తుతం ప్రభుత్వ యంత్రాంగం ముందున్న తక్షణ కర్తవ్యమని తెలిపారు. పూజా నిర్వాహకులు లౌడ్‌స్పీకర్ ద్వారా చేసిన ప్రకటన కారణంగా సందర్శకులు ఒక్కసారిగా ముందుకు దూసుకురావడంతో తొక్కిసలాట జరిగి ఉండవచ్చని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయని ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు.

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిర్వాహక కమిటీ సభ్యులతో సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నిర్లక్ష్యం వల్ల నిర్వహణ చర్యల్లో లోపాలు చోటు చేసుకొన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై దర్యాప్తునకు కలకత్తా హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బందాన్ని , ఫ్యాక్ట్-ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సిట్‌లో ఎస్‌టీఎఫ్, సీఐడీ సహా ఇతర దర్యాప్తు సంస్థల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

మరోవైపు ప్రస్తుతం కోల్‌కతాలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఆయన ముఖ్యమంత్రి, ఇతర ఉన్నతాధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి పాల్గొనాల్సిన కార్యక్రమాలతో సహా అన్ని అధికారిక కార్యక్రమాలను వాయిదా వేసినట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు. కోల్‌కతాతో పాటు పశ్చిమ బెంగాల్‌లోని ఇతర ప్రాంతాల్లోనూ భారీ, ఆకర్షణీయమైన థీమ్‌లతో దుర్గాపూజ మండపాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు పోటీ పడుతున్న నేపథ్యంలో, తగినంత వెలుతురు, రద్దీని నియంత్రించేందుకు సరిపడా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండేలా చూసుకోవాలని ముఖ్యమంత్రి దుర్గాపూజ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేకించి భారీ థీమ్‌లతో కూడిన వేడుకలను నిర్వహించే వారు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అలంకరణలు, ఆకర్షణీయమైన థీమ్‌ల కంటే మనుషుల ప్రాణాలే ముఖ్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జనసమూహం అధికంగా చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

మాజీ ముఖ్యమంత్రి అంజయ్య జీవితం అందరికీ ఆదర్శప్రాయం

పోయి'రా' బతుకమ్మ.. పోయి రావమ్మా!

బతుకమ్మ ఆటపాటలతో పులకించిన తెలంగాణ

సద్దుల బతుకమ్మతో సంబురాలకు వీడ్కోలు

ఆడబిడ్డల ఆనందాలు.. రంగు పూల సొబగులు.. తళుకులీనిన రాష్ట్రం

హైదరాబాద్ అక్టోబర్ 18(మనం న్యూస్): తెలంగాణ జీవన సౌందర్యానికి ప్రతీకైన బతుకమ్మ వేడుకలు తంగేడు పూల పరిమళాలు, తల్లుల ఆప్యాయతల సద్దులు, ఊరూవాడా మార్మోగిన బతుకమ్మ పాటలతో తెలంగాణ నేడు పూర్తిగా పులకించిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్ని తాకిన ఉత్సాహంతో, ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులపాటు జరుపుకున్న బతుకమ్మ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా పరిపూర్ణమయ్యాయి. ప్రకృతిని దేవుడిగా భావించి, పూలను పూజించి కొలిచే ఈ అపురూప వేడుక తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, రాష్ట్ర ఆత్మగౌరవానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. వారం రోజుల పాటు తొమ్మిది రూపాల అమ్మవారలను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించిన తెలుగు లోగిళ్లు, చివరి రోజైన 'సద్దుల బతుకమ్మ'తో ఆ పండుగను నేత్రపర్వంగా ముగించాయి. పల్లెపల్లెనా, పట్టణవాడల కూడళ్లలోనూ ఉత్సాహంగా సాగిన ఈ సంబురాలు ప్రతి ఒక్కరిని మంత్రముగ్ధులను చేశాయి.

ప్రకృతితో మమేకం..

ప్రకృతి ప్రసాదించిన రకరకాల రంగురంగుల పూలైన తంగేడు, గునుగు, బంతి, చేమంతి పూలను సుందరంగా పేర్చి, వాటి మధ్యలో గౌరమ్మను కొలువుదీర్చి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ పండుగలో అత్యంత ప్రత్యేకమైన 'సద్దులు' అనగా సప్పిడి పప్పు అన్నం, పెరుగు అన్నం, చింతపండు పులిహోర, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం వంటి వైవిధ్యమైన ప్రసాదాలను అమ్మవారికి నివేదించి, ఆ తరువాత బంధుమిత్రులతో ఆప్యాయంగా పంచుకున్నారు. ఇరుగుపొరుగు వారందరూ ఒకచోట చేరి నైవేద్యాలు ఆస్వాదిస్తూ పంచుకునే ఈ అపురూప వేడుక సమాజంలో ఐక్యతను, సాన్నిహిత్యాన్ని, మానవ సంబంధాలను మరింత బలపరుస్తోంది. ప్రతి ఇంటా నవ్వులు పూయిస్తూ సాగిన ఈ నైవేద్యాల సమర్పణ సంప్రదాయం తెలంగాణ ప్రజల సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పింది.

పండుగ శోభ..

పల్లెటూర్లలో ఊరి చివర చెరువుల కట్టలు, కోనేరుల వద్ద సాగిన బతుకమ్మ ఆటపాటలు ఒక సుందర దృశ్యమైతే.. పట్టణాల్లోని కూడళ్లు, అపార్ట్మెంట్లు, కాలనీల్లో మహిళలంతా సామూహికంగా ఒకచోట చేరి చేసిన సంబరాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. 'ఉయ్యాల.. ఉయ్యాల' అంటూ సాగే మధురమైన బతుకమ్మ పాటలతో, డప్పు చప్పుళ్లు, కోలాటాల నడుమ తెలంగాణ సాంస్కృతిక వైభవం నూతన ఉత్సాహంతో ఉరకలేసింది. ఆధునిక ఉరుకులు పరుగుల జీవితంలో యాంత్రికమైన మనిషిని తిరిగి ప్రకృతికి మరింత చేరువ చేసే అద్భుతమైన వేడుకగా బతుకమ్మ నిలిచింది. పూలను పూజించి, వాటిని భక్తితో నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా ప్రకృతితో మనకున్న పేగుబంధాన్ని, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను ఈ పండుగ మరోసారి ప్రపంచానికి చాటు చెబుతోంది.

కలకాలం నిలిచే జ్ఞాపకం...

అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సిరుల పంటలు పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరులతో వర్ధిల్లిపోవాలని కోరుకుంటూ బతుకమ్మ సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా కోలాహలంగా జరిగాయి. సద్దుల బతుకమ్మ ముగింపు సందర్భంగా జలవనరుల వద్ద మహిళలు చేసిన పూజలు, నిమజ్జన కార్యక్రమాలు ఉద్విగ్నభరితంగా సాగాయి. తెలంగాణ సాంస్కృతిక ఆత్మకు ప్రతిరూపంగా నిలిచిన ఈ బతుకమ్మ సంబురాలు కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా, తెలుగు ప్రజల ఐక్యతకు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలుస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరకాలం పదిలంగా నిలిచిపోతాయి.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు మృతి

హైదరాబాద్, అక్టోబర్ 18 : స్కూటీపై వెళ్తున్న అన్నాచెల్లెళ్లను కారు ఢీ కొనడంతో వారిద్దరూ మృత్యువాత పడ్డారు. మరో చిన్నారికి గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్ నగర శివారులోని పెద్ద అంబర్ పేట వద్ద చోటు చేసుకుంది. పెద్ద అంబర్ పేట చెందిన నవీన్.. శంషాబాద్లో ఉంటున్న తన చెల్లి రేఖను దసరా పండగ కోసం ఇంటికి తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాదుడే బాదుడు

- పండగ పూట ఛార్జీల బాదుడు..ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్ నగర్ నుంచి ఎంజీబీఎస్కు రూ. 220 ఉన్న టికెట్ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజా పాలన? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్చార్జ్ విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్చార్జ్ని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

కలలకు పుట్టినిల్లు తెలంగాణ

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 18 : కళలకు పుట్టినిల్లు తెలంగాణ అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఆదివారం ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ ఉత్సవ వేడుకల్లో గవర్నర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణలోని సోదర సోదరీమణులకు, దేశ విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సుసంపన్న సాంస్కృతిక వారసత్వానికి, నారీ శక్తికి, ప్రకృతి పట్ల మనకున్న ప్రగాఢమైన భక్తికి సజీవ ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. రంగురంగుల పూలతో అలంకరించే బతుకమ్మ మన ఉనికికి ఆధారమైన మానవునికి, ప్రకృతికి మధ్య గల విడదీయరాని బంధాన్ని గుర్తుచేస్తుందని ఆయన వివరించారు. తరతరాలుగా ఈ అమూల్యమైన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్న తల్లులు, సోదరీమణుల సృజనాత్మకత, అంకితభావం ఎంతో ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. పూలను దైవ స్వరూపంగా భావించి పూజించే ఈ విశిష్ట పండుగ ప్రకృతిని గౌరవించడమే మానవ జీవిత భవిష్యత్తు అని సమాజానికి చాటిచెబుతుందని ఆయన తెలిపారు. ఎల్ నినో వంటి ప్రపంచ వాతావరణ సవాళ్లు, ప్రకృతి వైపరీత్యాలు ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో ప్రకృతి పట్ల మన బాధ్యత మరింత పెరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైందని, ఇది మనకు ఒక స్పష్టమైన హెచ్చరిక అని ఆయన గుర్తుచేశారు.

ప్రకృతి సమతుల్యతలో వచ్చిన ఈ మార్పును గమనించకుండా సహజ వనరులను విచక్షణారహితంగా వినియోగిస్తే తీవ్రమైన జల సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. బతుకమ్మ పండుగ వేళ ప్రకృతిని, దాని అత్యంత విలువైన వనరైన నీటిని సంరక్షించుకోవడమే నిజమైన దైవారాధన అని ఆయన ఉద్ఘాటించారు. నీటి సంరక్షణను కేవలం ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే పరిగణించకుండా, ప్రతి పౌరుడు తన ప్రథమ కర్తవ్యంగా స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నీటి ఎద్దడి తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా, తక్షణమే నీటి వృధాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన కోరారు. వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్), చెరువుల పరిరక్షణ, భూగర్భ జలాల పునర్భరణ ప్రస్తుత కాలానికి అత్యంత ఆవశ్యకమని ఆయన నొక్కిచెప్పారు. ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పద్ధతుల్లో తగిన మార్పులు తీసుకురావాలని ఆయన రైతు సోదరులను ప్రత్యేకంగా అభ్యర్థించారు.

అధిక నీరు అవసరమయ్యే పంటల స్థానంలో తక్కువ నీటితో పండే, స్థానిక వాతావరణానికి అనుకూలమైన పంటలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన రైతులకు సూచించారు. బతుకమ్మ పండుగ యొక్క అంతఃసూత్రాన్ని ఆచరిస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని, రాబోయే తరాల సురక్షితమైన, సమృద్ధికరమైన భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళా సాధికారత, సామాజిక సామరస్యం, ప్రకృతి ప్రేమను ప్రోత్సహించే ఈ మహత్తర సందర్భంలో ప్రజలందరికీ బతుకమ్మ, నవరాత్రి, విజయదశమి పండుగల శుభాకాంక్షలు అందజేశారు. గౌరీ దేవి కటాక్షంతో తెలంగాణలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆయన ప్రార్థించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క పండుగ యొక్క విశిష్టత పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, జర్మనీ కాన్సుల్ జనరల్ అమితా దేశాయ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ ఐఏఎస్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, టి ఎస్ ఎస్ చైర్మన్ వెన్నెల గద్దర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, టి ఎస్ ఎస్ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ మంగతాయారు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సినీ నటులు విజయ్ దేవరకొండ రష్మిక, కళాబృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు బెస్ట్ సైంటిస్ట్ అవార్డు

వరంగల్, అక్టోబర్ 18: కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు ప్రతిష్ఠాత్మక 'సైంటిఫిక్ లారెల్స్ బెస్ట్ సైంటిస్ట్ అవార్డు' లభించింది. ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధనలు, బోధన, విద్యా పరిపాలన రంగాల్లో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. కేయూలో డిగ్రీ, బనారస్ యూనివర్సిటీలో ఎం. ఫార్మసీ పూర్తి చేసిన సమ్మయ్య.. 2003లో కేయూలో కాంట్రాక్ట్ లెక్చరర్గా ప్రస్థానం ప్రారంభించి ప్రిన్సిపాల్, బీవోఎస్ చైర్పర్సన్, డీన్ గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఇప్పటివరకు 77 పరిశోధనా పత్రాలు ప్రచురించడంతో పాటు 4 ప్రాజెక్టులు పూర్తి చేశారు. 105 మంది ఎం.ఫార్మసీ, 13 మంది పీహెచ్ డీ స్కాలర్లకు మార్గదర్శకత్వం వహించారు. సమ్మయ్యకు ఈ అవార్డు దక్కడంపై వర్సిటీ వర్గాలు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కోత ఏంది.. రేవంత్?

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోతపై కవిత ఫైర్

జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలి?

లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తం

హైదరాబాద్, మనం ప్రతినిధి : నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి కవిత మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని ఆమె ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు.

ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఏపీ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందని కవిత ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

జర్మనీ ఉద్యోగాల పేరిట టామ్కామ్ భారీ మోసానికి పాల్పడింది?

70 మంది నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు

బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి?..సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా హరీశ్రావు మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసిందని ఆరోపించారు. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్కామ్ బ్యాచ్ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ మోసానికి పాల్పడిన టోమ్కామ్, ఫెయిర్ స్టీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

భూగోళానికి జ్వరం

పసిఫిక్ జలాలపై
అసాధారణ ఉష్ణ కల్లోలం
తూర్పు గాలుల బలహీనతతో
మేఘాల గమనంలో మార్పులు
రుతుపవనాల రాకలో
అనిశ్చిత అలజడి
వర్షపాతం లో హెచ్చుతగ్గులు
చెరువుల్లో ఇంకుతున్న జలజాడలు
పొలాల నిండా
ఎండిపోయిన ఆశలు
రైతు బతుకుపై
కరువు సంతకం చేస్తోంది

ప్రకృతి సమతూకంపై
సముద్రం లిఖించే
సెగల అక్షరమే
ఎల్ నినో
అడవులనిండా పచ్చని ఊపిరి
నదుల నిండా
జీవ జలాల పరవళ్ళు కావాలి
నేల గుండెల్లో
విత్తనాల భద్రత
ప్రకృతి సమతుల్యతే
మనిషి మనుగడకు హామీ .

- మండాది గోపీనాథ్
9885045344

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

భారతదేశం గర్వించదగ్గ కవి

'సినిమా హాలు నిర్మా ణం కోసం నేను స్థలం కొన్నరోడ్డులో పేరు మోసిన మైకా కంపెనీలన్నీ వున్నా యి. చుట్టు ప్రక్కలున్న ఇళ్ళన్నీ సంపన్నులవే. ఆ ఇళ్ళ మధ్యలో థియేటర్ కట్టాలంటే వాళ్ళు అడ్డుపడతారని నాకు తెలుసు. అప్పట్లో గూడూరు మున్సిపల్ కమీష నర్‌గా వున్న గుంటూరు శేషేంద్ర శర్మగారిని కలిసి నా ఆందోళన వారికి చెప్పాను. శర్మగారు మున్సి పల్ పర్మిషన్‌తో పాటు అవసరమైన మిగతా పర్మి షన్‌లు కూడా వారి పలుకుబడితో నాకు ఇప్పిం చారు'.

సుప్రసిద్ధకవి గుంటూరు శేషేంద్రశర్మ కొన్నాళ్ళు గూడూరు పురపాలక సంఘ కమీషనర్‌గాపనిచేశారని ఇంతకుముందే చెప్పాను. వారు భారతదేశం గర్వించదగ్గ కవి.సంస్కృతాంధ్ర భాషల్లోనే కాక ఆంగ్లంలో కూడా అద్భుత నైపుణ్యంగల సాహితీవేత్త.

వారి నోటినుండి జాలు వారే ప్రతిపదంలోనూ కవిత్వం పరవళ్ళు దొక్కు తుంది. శర్మగారు అతి చిన్న వయసులోనే వాల్మీకి రామాయణాన్ని గురించి 'షోడసి' అన్న పేరుతో చాలా వ్యాసాలు రాశారు. వారి అభిమానులు చాలామంది శర్మగారిని 'యుగకవి'గా పేర్కొం టారు. విశ్వనాథ వారిలాగే ఎవరికి తలవంచని కవి శేషేంద్ర. ఆయన

రస్తా నా రంగస్థలం

కనుకనే కొందరు నన్ను కవి అంటారు
భవనాలను మింగాలి,
జనాలను మాలగా వేసుకోవాలి
రస్తాను రంగస్థలం చేసుకోవాలి
ఎంత రోడ్ల అనుభవం,
ఎంత జనుల క్యూ అనుభవం
గడిస్తాడో అంత సంపద అది
ఒక మనిషి కవిగా జన్మ ఎత్తడానికి -
ఎన్ని దేశాల్లో తీర్థయాత్రలు చేస్తాడో
అంత విస్తార కావ్యానుభవం గడిస్తాడు

కవి, కవి ఎత్తు -
ఈ విస్తృత సంపద రూపాంతరమే!
ఈ అనుభవం మనిషిని రసాలుగా మార్చి
జనుల్లోకి ప్రవహింప జేస్తుంది.
భవనాంతరాల్లోకి పోయి శయ్యాంతరాలకు
శరీరం అర్పించి
'అదే స్వర్గంగా భావించేవాడు
బ్రహ్మాండమైన నదిలా
ప్రవహించే మానవ జీవనంలో
జలకమాడే హిరణ్య సంపద కోల్పోతాడు
భవనంలో ఎంత లోతుకుపోతే
అంత నష్టం సంభవిస్తుంది మనిషికి-

కవి అంత చిన్న కవి అవుతాడు అకవి అవుతాడు
కవి ఏమిటి గోలీ మారో! మనిషి ప్రధానం!
సామాన్యుల సుఖదుఃఖాలకు
ఎంత శిరస్సు వంచుతాడో మనిషి
అంత ఎదుగుతాడు కవితా శిఖరంగా -

-శేషేంద్ర

నేను కవిని అనే మాటను గోలీతో కాల్చు
నాకు గర్వం నేను మనిషిని అని
నేను క్యూలో నుల్చుని అనుభవిస్తాను జీవితాన్ని
నేను ముందుకుపోను నా ముందు
నుల్చున్న మనిషిని వెనక్కి తోసి-
పోస్టుకార్డు క్యూలో ముందున్న
మనిషి ముందుకు పోతేనే
నా మనస్సుకు హాయి - నేను జనంలో నడుస్తాను

దౌర్జన్యంగా ఒకడు మరొకడ్ని కొడుతుంటే
నాలో ఒక అగ్నిపర్వతం ఘుర్ఘర
ధ్వని చేస్తూ ఉంటుంది
ఒక్కసారి అగ్నిచ్ఛటల ఝంఝను విసురుతుంది
ఎంత క్యూ గత జీవితం అనుభవిస్తానో
ఎంత ఎక్కువగా నా కాళ్ళని రోడ్లకు అప్పగిస్తానో
అంత మానవీయ సంపద ఆర్జించి గర్విస్తాను

నా 'మల్లెమాల రామాయణం' చదివి మళ్ళీ పుట్టాడు వాల్మీకి మల్లెమాలగా అని తన అభిప్రాయాన్ని రాతపూర్వకంగా వెలి బుచ్చారు. వారు ఈనాడు మన మధ్య లేకపోయినా వారి రచనలు కవితా ప్రియులందరి హృదయా లలో గుబాళిస్తూనే వుంటాయి.

నేను వారి మరణ సందర్భంగా... అలవోకగా
నీవు కలము దూసితివేని/ కడలి తరంగముల్ జడసి ఆగు!/ కలను సైతము నీవు గళము విప్పితివేని వేద నాదమ్ములు విస్తుబోవు!/ శిరమెత్తి నింగిని ఉరిమి చూసితి వేని/ చుక్క లక్షరములై చుట్టు మూగు!/ చిరునవ్వుతో నీవు చేయి నూపితివేని/ రసరమ్య భావముల్ రాసులీను!/ పెక్కులేటికి చివరగా ఒక్కమాట/ సుకవిజన చంద్ర/ శేషేంద్ర, సుగుణ సాంద్ర!...

చెవికి నోరూర జేయు నీ కవిత వినిన/ చివురు లామని వీడి నీ చెంత జేరు!/ కవికి గర్వము ముంజేతి కంకణమని/ ఉర్వి నెవరికి తలవంచకుండ బ్రతికి/ స్వర్గమందున గల కవి చక్రవర్తి/ విశ్వనాథను కలయంగ వెడలినావు! అని నివాళులర్పించాను.

'ఇదీ నా కథ' నుంచి
- మల్లెమాల సుందరరామి రెడ్డి
రేపు గుంటూరు శేషేంద్ర శర్మ శత జయంతి

సూక్ష్మరూప జీవనవ్యక్తీకరణలే 'తటిల్లతలు'

ఇప్పటివరకు తెలుగు సాహిత్యాన్ని ఎందరో భిన్న మైన కవులు విభిన్న కవితా రీతులైన మినీకవితలు, లఘు కవితలు, నానీలు, మొగ్గలు, రెక్కలు, హైకూలు లాంటి ప్రక్రియలతో సుసపన్నం చేశారు. ఇంకా కొంతమంది కవులు ఈ ప్రక్రియల్లో కవితల్ని రాస్తూ కవిత్వ సంపుటాలను వెలువరిస్తూనే ఉన్నారు. అయితే! ఈ మధ్యనే ప్రముఖకవి, కథకులు కటుకోజ్వల ఆనందాచారి గారు 'తటిల్లతలు'శీర్షికతో మెరుపుకవితలసంపుటిని ఆంగ్లానువాదంతో వెలువరించి మన మనసుల్లో మెరిపించారు. ఆనందాచారి కవిగా, కథకునిగా, పాటల రచయితగా, చిత్రకారునిగా నైపుణ్యం కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

ఈ గ్రంధంలోని కవితావాక్యాలు ఏవో అలవోకగా ఉబుసుకుపోక రాసినవి కావు. తన చుట్టూ ఉన్న సామాజిక స్థితిగతుల్ని, మానవ నైజాన్ని ఆకళింపుచేసుకొని అల్లిన కవితా మాలలు. ఇంకా తన వ్యక్తిగత అనుభవసారపు కమ్మెచ్చులోంచి సాగతీసిన ఈ అర్థవంతమైన వాక్యాల తీగల్ని, మన జీవితాలకు కూడా అన్వయించుకొదగిన జీవిత సత్యాలు. నిత్యజీవితంలో ఆయన మనసులో తటిల్లన మెరిసిన ఆలోచనల్ని కవితాక్షరాల్లోకి అనువదించి ఎలా మెరిపించారో చూడండి. 'చదరంగంలో/పావులు కదిపినట్టు/ తెలివి గల ఎత్తులు వేస్తే/ఆట మాత్రమే గెలుస్తాం/ జీవితంలో అలా గెలవలేం!' అంటారు.

చదరంగపు ఆటలో తెలివిగల ఎత్తులతో ఆట గెలవొచ్చేమో కానీ, జీవితపు ఆటలో గెలవాలంటే అందివచ్చిన అవకాశాల్ని వివేకంతో ఆడి గెలవా లనే జీవిత సత్యాన్ని తెలిపే వాక్యాలివి.

నిజానికి ఈ తటిల్లతలకు అర్థతాత్పర్యాల్ని విప్పి చెప్పే అవసరం లేదు. చదవగానే పాఠకుల గుండెల్లోకి దూసుకుపోయే వాక్యనిర్మాణం ఈ తటిల్లతలల్లో ఉంది. ఆ వాక్యాల గాఢత మనసుల్లో చేరిఆలోచింపచేస్తది. ఈ 105 తటిల్లతలన్నీ సాదాసీదా వ్యవహారిక బాషలో చాలా ట్రాన్స్ పరెంట్‌గా ఎటువంటి సంక్లిష్టత లేకుండా రాసిన జ్ఞానగుళికలు. చూడండి ఎంత సింపుల్ గా చావు పుట్టుకల గురించి రాస్తారో ..ఏడుస్తూ పుడతాం/ ఏడుస్తూ చనిపోతాం/కానీ మధ్యలోనే ఈ అసంబద్ధ ఆరాట పోరాటాలు/అర్థంలేని స్వార్థ పూరిత ఆడంబరాలు ఎందుకు?' అని ఈ ఆధునిక మానవుల్ని ప్రశ్నిస్తున్నట్లుగా ఉంటాయి ఈ వాక్యాలు.



ఇందులోచాలాసార్లు జీవితాన్ని నిర్వచిస్తుంటాడు. 'జీవితం/ కవిత్వంలా/ ఎడిటింగ్‌కి వీలవట్లేదు.. అంటాడు. మరోచోట..నీ ఊహలకన్న మిన్నయినవి/ జరుగుతున్నాయి కవీ..?/ జగత్తుకన్నా కవిత్వం/ అబ్బురపరచ లేదు'. అంటూ కవిత్వమైనా.. కళలనైనా సవరించు కోవచ్చు కానీ, జీవితాన్ని అలా ఎడిట్ చేసుకోలే మని తేల్చి చెబుతాడు. బతుకు పోరాటం/ మాటనేర్పింది/పుస్తకం/ఏం మాట్లాడాలో నేర్పు తుంది.రెండూ మనిషిని ఆవిష్కరిస్తాయి అంటాడు. మనుషులమధ్య పెరుగుతున్న దూరాన్ని గురించి చూడండి..

'నువ్వొకసారి/వచ్చి స్పర్శించిపో/మందులు నయం చేయనిది/నీ చేయి చేస్తుంది/ మనుషుల ఇమ్యూనిటి/కలిసిన తనంలోనే ఉంది' ఈనాటి ఆధునికయుగంలో మనుషుల మధ్య పెరుగు తున్న దూరాల్ని, మానవ సంబంధాల వెలితిని ఈ క్రింది చిక్కనైన వాక్యాల్లో చక్కగా వర్ణిస్తాడు. మను షులు కలుసుకుంటూ కష్టసుఖాల్ని కలబోసు కుంటూ సాంత్వన పొందాలంటాడు. కలయిక లోనే బడలిక తగ్గుంతుందని అర్థం స్ఫురించే వాక్యాలివి.

'వేలఏండ్ల గమనంలో/ఏం నేర్చుకున్నాం మనం/ ఒక మనిషితో మనిషిలా/వ్యవహరించలేక పోతున్నాం' ముఖ్యంగా పై కవితలో ఉత్తమ జ్ఞానాన్ని పొందడం గురించి చెబుతూ.. ఏండ్ల నుంచి నేర్చుకుంటున్నా మన ఆలోచనా విధా నంలో గాని,మనస్తత్వాల్లో గాని మార్పు రాలేదనే వ్యంగ్యం కనిపిస్తుంది. 'ఏదైనా ఒకటి చెప్పు/పనేదయినా చేయి/ లేదంటే రాస్తూనే ఉండు/నివ్వు సజీవంగా ఉన్నం దుకు గుర్తులవి'అంటాడు. రైతు ఆత్మహత్యల మీద గుండె బరువెక్కే వాక్యాలు 'భూమికి శ్రమనల్లిన/కలనేత ఇతడు/ కలలపంటపై/చితిగా మారుతున్నాడు' భూమిని చెమట చుక్కలదారాలతో సేద్యం చేసే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దొరకక చేసిన అప్పులు తీర్చలేక తన పంటనే చితిగా చేసుకొని ప్రాణత్యాగం చేసుకుంటున్న హృదయవిదారక దృశ్యాన్ని మన కళ్ళల్లో దృశ్య మానం చేస్తాడు.

ఆనందాచారిలో ఒక ప్రేమ కవికూడా ఉన్నాడ నేందుకు ఆయన రాసిన ప్రేమాన్విత తటిల్లతలు చూడండి.. 'నీకోసం/ ఎదురు చూపులో/ కాలం కరిగి తేనేం/ వేచిచూసే కనుల దాహం/ నిముష నిముషం పెరిగితేనేం/మధురమైన తలపోతలన్నీ/ మనసు కడుపున నిండుతున్నాయి.. ప్రేమ నిండిన కళ్లతో ఎదురుచూస్తే కాలమే తెలియదు.గంటలు నిముషాల్లా కళ్ళముందే కరిగిపోయినా కనుల దాహం తీరదు ఆహా ఏమి భావన. ఎదురు చూపుల్లో ఉన్న మధుర మైన బాధనిఎంత అద్భుతంగాఆవిష్కరించారో ఈప్రేమ కవితలో.

ఈ సంపుటినిండా "Quotable quotes" లాంటి అద్భుతమైన వాక్యాలు ఉన్నాయి.'శత్రువు, మిత్రుడు అని/పేర్లు పెడతాం/కానీ .. అది తెలుసుకోవడం/అంత సులువేం కాదు.

ఇంత అర్థవంతమైన ఆలోచనాత్మకమైన తటిల్లతలతో అంతే అద్భుతమైన శ్రీనివాస్‌గౌడ్ గారి ఆంగ్లానువాదంతో వెలువరించిన ఆనందా చారి గారికీ శుభాకాంక్షలతో...

-ప్రొ. బాణాల శ్రీనివాసరావు
9440471423

ప్రతిభా శాలి 'రఘు వర్మ'

బహుముఖ ప్రజ్ఞాశాలి, మితభాషి,ప్రముఖ కవి,రచయిత, అనువాదకుడు రఘువర్మ (అసలు పేరు తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ) 6.10.2026 సాయంత్రం తన కలాన్ని, గళాన్ని, కుంచెను వదిలి వెళ్ళిపోయాడు. కానీ కాలం రాకముందే కడతేర్చరావే కాలమా అని గొప్పమరణం గురించి. కాళోజి రామేశ్వరరావు అన్నట్లు రఘువర్మ గారు ఆకస్మికంగా వెళ్లిపోయి ఆత్మీయులకు, కుటుంబీకులకు, స్నేహితులకు ముఖ్యంగా తెలుగు సాహిత్య లోకానికి తీరని బాధను మిగిల్చాడు.

రఘువర్మ ఉస్మానియా యూనివర్సిటీలో కుందుర్తి ఆంజనేయులుపై ఎంఫిల్,పీహెచ్‌డి చేశాడు. రఘువర్మ మృదుస్వభావి. ఎవరిని ఏనాడు మాట వరసకైనా మనసు నొప్పించలేదు. ఈ ఛాయలన్నీ ఆయన రచనల్లో మనం చూడవచ్చు. ఇతను హృదయ జలధి,కవిత్వం వింత భాష, మూడో కంటిచూపు, మేఘ రాగరంజని మొదలగు వచన కవిత సంపుటాలు వెలువరించాడు. అనువాద రంగంలో రఘువర్మ గారు విశేషమైన కృషి చేశాడు. కాళిదాసు కావ్యాలు.. రవీంద్రుని గీతాంజలి, షేక్స్పియర్ మొదలగు వారి రచనలను సులభశైలిలో అనువదించారు. 2021లో కాళిదాసు మేఘసందేశం, 2022లో ఋతుసంహారం, 2023లో రవీంద్రుని గీతాంజలి భర్తృహరి నీతి శతకాలను సంస్కృతం నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. కాళిదాసు కావ్యాలను సహజంగా సరళంగా అనువదించారు. రఘువర్మ మరణంతెలుగు సాహిత్య లోకం గొప్ప అనువాదకున్ని కోల్పోయింది.

రఘువర్మ కృషిని గుర్తించి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అనువాద రంగంలో రామవరపు శాంత సుందరి అవార్డును ప్రదానం చేసింది. అదే విధంగా 2025వ సంవత్సరంలో కీర్తి పురస్కారాన్ని అందజేసి సత్కరించింది.రఘువర్మ గొప్ప చిత్రకారుడు. అతని పుస్తకాలకు తానే స్వయంగా అర్థవంతమైన ముఖచిత్రాలు గీసుకున్నాడు. తెలుగు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్టులైన కొందరి పుస్తకాలకు తాను చిత్రాలు గీసిచ్చాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భారతీయ కవులు రచయితల ముఖ చిత్రాలు జీవం ఉట్టిపడేట్టు గీశాడు.రవీంద్రుడు మన కండ్ల ముందు ఉన్నాడా అన్నట్లు చిత్రాన్ని గీసేవాడు.

రఘువర్మ మంచి గాయకుడు. లలిత గీతాలను, తెలుగు, హిందీ పాత సినిమా పాటలను మూల గాయకులు పాడినట్లే ట్రాక్ మీద పాడేవారు. అతడు పాడుతుంటే రసజ్ఞత ఉట్టిపడేది.

చివరిదశలో దాదాపు 15 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గురుకుల కళాశాలలో కాంట్రాక్టు తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం చేశాడు. ఆదిలాబాద్‌లో దాదాపు దశాబ్ది కాలం పాటు విధులు నిర్వహిస్తున్న కాలంలో ఆదిలాబాద్ కవి మిత్రులతో సఖ్యతగా ఉంటూ ప్రతి సాహిత్య సభకు హాజరయ్యేవాడు. ఉదారి నాగదాసు స్మారక కవితా ఉత్సవానికి, ఉగాది కవి సమ్మేళనాలకు తప్ప కుండా పాల్గొనేవారు.

చివరికి జగిత్యాలలో అన్నదమ్ములతో కలిసి ఉంటూ వారే తన ప్రపంచ మనుకొని జీవితంలో చెదిరిన స్వప్నాలను కవితలుగా రాసుకుంటూ చిత్రాలుగా గీసుకుంటూ పాటలుగా పాడుకుంటూ గడిపాడు. చివరిదాకా తాను సంగీత సాహిత్య చిత్రలేఖన ప్రపంచంలోనే బతికిన గొప్పకళాజీవి. మంచి వ్యక్తిత్వానికి నమూనా మన రఘువర్మ మన మధ్య లేకపోవడం బాధా కరం.

- డా. ఉదారి నారాయణ
9441513666

జాతీయ సమగ్రతా సాహిత్యానికి పూల బాటలు

డా.టి.రాధాకృష్ణమాచార్యులు భారత రాజ్యాంగం గుర్తించిన 24 భారతీయ భాషలకు చెందిన 105 మంది ప్రసిద్ధ సాహిత్యకారుల పరిచయాలను 'భారతీయ సాహితీ కిరణాలు' పేరుతో పుస్తకాన్ని రూపొందించారు. భారత జాతీయ స్థాయిలో గత వంద సంవత్సరాలలో సాహిత్యంలో వచ్చిన పెను మార్పులను చేర్పులను సందర్భానుసారంగా విశ్లేషిస్తూ ఒక ప్రాజెక్ట్‌ను ఎంచుకొని సాహిత్య కారుల దృక్పథాలను, రచనలను వారి పురస్కారాలు, కాలానుగుణ శైలుల మార్పులు ఈ గ్రంథంలో పొందుపరిచారు. అదే ఉత్సాహంతో వర్తమాన, వర్ధమాన కవుల పరిచయం చేశారు. అలా ఈ పుస్తకాన్ని జాతీయ సమైక్యతా భూమికలో భారతీయ భాషాసాహిత్యాల పరిమళంగా డా.టి.ఆర్.కె. చార్యులు రూపుదిద్దారు. దీనితో జాతీయవాద గ్రంథాల పఠనావశ్యకతను తెలిపారు. రచయిత కృషి, ఎంచుకున్న ప్రాజెక్ట్‌కు న్యాయం చేయాలన్న దృఢదీక్ష ఈ పుస్తకం చదివితే కనిపిస్తుంది. యూనివర్శిటీలు, సాహిత్య సంస్థలు చేసే సాహిత్యోద్యమాన్ని జాతీయ సాహితీ వేత్తల పరిచయం చేయడంలో టి.ఆర్.కె.చార్యులు కృషి గొప్పది.

డా. టి.ఆర్. కె. చార్యులు హైదరాబాద్ లోని డా. జయసూర్య హోమియో కాలేజీలో వైద్య శాస్త్రం చదివారు. వైద్యసేవతో పాటు ఆయన సాహిత్య జీవితం ఎదిగింది. ఇంజనీర్లు, వైద్యులు, ఇతర రంగాల వారు తెలుగు సాహిత్యంలోకి రావడం వల్ల వారి కొత్త సాహిత్య పదజాలం తెలుగులో ప్రవేశించి, ఆయా భాషలు జవజీవాలతో కొత్తశక్తిని తెచ్చుకొంటాయని, ఈ గ్రంథానికి సుదీర్ఘ ముందుమాట రాసిన ప్రొఫెసర్ డా. దార్ల వెంకటేశ్వరరావు గారు అన్నారు. అనితర సాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారని ముందు మాట రాసిన మరో రచయిత జి. పరశురామారావు అభిప్రాయం.

ఈ గ్రంథంలో105 మంది జాతీయ సాహిత్యకారుల పరిచయాలు భారత దేశం మ్యాప్ లో జాతీయ రయితల ఫోటోలను చేర్చిన ముఖచిత్రం అందంగా అర్థవంతంగా ఉంది. 105 మంది రచయితలో 54 మంది పురుషులు, 51 మంది మహిళా రచయితల పరిచయాలు, దాదాపు సగ భాగం మహిళా రచయితలను చేర్చడం యాదృచ్చికమే అయినా స్త్రీవాద ధోరణికి సాక్ష్యంగా ఉంది. ఈ గ్రంథంలోని వ్యాసాలు సాహిత్య పరిశోధక సూచిగా ఉపకరిస్తాయి. జాతీయ వాదం, జాతీయ దృక్పథాల నడకను నల్లేరు మీది నడకలా రచయిత ఈ గ్రంథ రచన ద్వారా సాధించిన ఈ పుస్తకంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి, డా. ఎన్. గోపి వంటి తెలుగు కవుల పరిచయాలతో పాటు తమిళ తొలి జ్ఞానపీఠ పురస్కారం 1975లో పొందిన అఖిలన్ గూర్చి రాస్తూ, సామాజిక వివక్షతపై సంధించిన బాణాలు వీరి రచనల వాస్తవిక,సృజనాత్మక శైలి,



భారతీయ సాహితీ కిరణాలు
వెల: రూ. 450/- దొరుకు చోటు:
డా.టి.రాధాకృష్ణమాచార్యులు
జానకీ రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.402, రోడ్ నెం.2
గాయత్రి పురం కాలనీ
కొత్తపేట, హైదరాబాద్.
నవోదయ బుక్ హౌజ్ కాచిగూడ, హైదరా బాద్

మానవజీవితం లోని లోతైన వాస్తవాలను ఆవిష్కరిస్తాయని చెప్పారు. ఇక తాత్వికతతో ఆలోచించి రచనలు చేసే గుల్జార్ జాతీయ సాంస్కృతిక చిహ్నమని అంటారు.హైదరాబాద్ ఉర్దూ రచయిత్రి పద్మశ్రీ జిలానీబానో గూర్చి ఎంతో చక్కగా ఆమెను హైదరాబాద్ గుండె గొంతుక, వతన్ కా విరాసత్, పాత బస్తీ పరిమళమని వర్ణించారు. ఒడిస్సా రచయిత్రి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ప్రతిభా రాయ్ గూర్చి విశేషంగా పరిచయం చేశారు. ఆమె మహాభారతాన్ని వస్తువుగా తీసు కొని స్త్రీవాద దృక్పథంతో యజ్ఞసేని నవల రాశారు. ఈమె రచనలు కుల మత ప్రసక్తిలేని మతం, న్యాయం పక్షాన ఉంటాయి. ధిక్కార స్వరంతో సాగుతాయి. లిపిలేని గ్రామీణ ఒడిస్సా భాష కోసలి జానపద సాహిత్య కారుడు, లోక్ కభీ రత్న, తెలుగు వేమన లాగా పోల్చదగిన గాయకుడైన హల్దార్ నాగ్ పరిచయం గుబాళించింది. సుప్రసిద్ధ హిందీ కవయిత్రి శ్రీమతి సుభద్రా చౌహాన్ స్వాతం త్రోద్యమ జీవితం, సాహిత్య ప్రస్థానం గూర్చి చక్కటి పరిచయం చేశారు. జ్ఞానపీఠ గ్రహీత, సుప్రసిద్ధ ఉర్దూ కవి, సినీ గీత రచయిత, విద్యావేత్త అఖ్లాక్ మహమ్మద్ పరిచయం ఉర్దూ సాహిత్యంలో ఆయన చేసిన కృషిని గొప్పగా వివరించారు.

మానవీయ కవిత్వానికి చిరునామాగా మాజీప్రధాని ఎ.బి. వాజ పేయిని హిందీ కవిగా పరిచయం చేశారు. సుప్రసిద్ధ సంస్కృతకవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అంధుడైన రామభద్రా చార్య పరిచయం కూడా చక్కగా ఉంది. తమిళ స్త్రీవాద రచయిత్రి అంబై కలంతో ప్రఖ్యాతినొందిన చంద్రప్రభ సీతారమణ లక్ష్మీ గారి పరిచయం చేశారు. అమృతాపీతం,రస్కిన్ బాండ్ పరిచయం, స్త్రీవాద ఉర్దూ సాహిత్య రచ యిత్రి ఇస్మాత్ చుగ్మాయ్ సాహిత్య దృక్కోణాన్ని చక్కగా వివరించారు. హైదరాబాదీ సుప్రసిద్ధ ఆంగ్ల కవియిత్రి , కవికోకిల, జాతీయ స్వాతంత్రోద్యమనేత,మాజీ గవర్నర్ సరోజినీనాయుడి గూర్చి చక్కటి సాహిత్య వ్యాసం అందించారు. తాను నివసించిన ఆబిడ్స్‌లోని నివాసాన్ని గోల్డెన్ త్రిషోల్ (బంగారు వాకిలి) ను అదే పేరుతో కవితా సంకలనంగా వేశారు. 19 ఏండ్ల వయస్సులో సామాజిక కట్టుబాట్లకు ఎదురొడ్డి, కులాంతర వివాహం గోవిందరాజులు నాయుడితో జరిగింది. వీరి కుమారుడే ప్రఖ్యాత్ హోమియో వైద్యులు డా.జయసూర్యగారు. ఆమె రాసిన ఇన్ ది బజార్ ఆఫ్ హైదరాబాద్ అనే కవితను డా.టి. ఆర్. కె. చార్యులు చక్కగా ఆసక్తికర తెలుగు సేత చేశారు.

ఈ పుస్తకం చదివితేనే తనివి తీరేలా గ్రంథ రచన చేశారు. ఇది జాతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేసే సాహితీవేత్తలకు,సిద్ధాంత వ్యాసాలు రాసే వారికి, జాతీయ వాదులకు, పరిశోదకులకు, పోటీ పరీక్షలు రాసే వారికి ఉపయుక్తమైన గ్రంథంగా మలిచిన డా. టి. రాధాకృష్ణమాచార్యులు అభినందనీయులు.

- సంకేపల్లి నాగేంద్రశర్మ
8074826371

సాహిత్యంపై తెన్నేటి చెరగని సంతకం

తెలుగులో ప్రముఖ కవులు, రచయితలలో ఒకరు తెన్నేటి సూరి. అభ్యుదయ కవి. నవలాకారుడు, అనువాదకుడు. తన భావజాలాన్ని ఆవిష్కరించడానికి ఆయన కథ, వ్యాసం, కవిత, గేయం,నాటకం,నవల,అన్ని సాహిత్య ప్రక్రియ లను ప్రజల గుండె తలుపులను తట్టే సాధ నాలుగా వాడుకున్నాడాయన. అలనాటి మేటి పత్రికలు భారతి, ఆంధ్ర పత్రికల్లో సహాయ సంపాదకునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తన సాహితీ క్షేత్రాన్నిసుసంపన్నం చేశారు.

తెన్నేటి సూరి పేరుతో మొట్టమొదట స్ఫురించేది ఆయన చారిత్రక నవల. ఛంఘిజ్ ఖాన్. 12, 13 శతాబ్దాలలో మంగోల్లో జన్మ స్థలంగా, ఎడారిలో ఒక మహా సామ్రాజ్యాన్నే నిర్మించిన విజేత చంఘిజ్‌ఖాన్. అది కత్తి మీద సాములాంటి రచనలో చరిత్రలో జరిగిన సంఘటనలను వక్రీకరించకుండా, హెన్రీ హావర్త్ దంపతులు రచించిన మంగోల్ చరిత్రను ఆధారంగా చేసుకొని, లోతుగా అధ్యయనం చేసి, చేయి తిరిగిన నవలాకారునిగా అద్భుత రచనతనదైన శైలిలో రచిం చారు. ఆ ప్రచురణ విశేష ప్రజాదరణ పొందింది. తెన్నేటి సూరి చెంఘిజ్ ఖాన్‌ను తొలిసారిగా ఆంధ్రపత్రిక, 1950 సెప్టెంబరు నుంచి ధారావాహికంగా ప్రచురింప బడింది. సెప్టెంబరు 1998) రేడియో నాటకంగా శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుసరించి ప్రసారం చేశారు. ఆంధ్ర పత్రికలో ఆయన వ్రాసిన ధారా వాహికను నవలా రూపంలో విశాలాంధ్ర వారు ప్రచురించారు. 1956 లో ప్రచురించబడిన ఒక నవల ఎనిమిది పునర్ముద్రణలు జరుపుకోవడం రచయిత గొప్పతనమే.

తెన్నేటి సూరి భారతి, ఆంధ్ర పత్రికలలో 1945-1957 లలో పత్రికా రచయితగా పనిచేశాడు. సూరి 1911లో కృష్ణా జిల్లా తెన్నేరులో వెంకట లక్ష్మమ్మ, తండ్రి తిరుమలరావు దంపతులకు జన్మించాడు. పుట్టిన ఊళ్లోనే ప్రాథమిక విద్య పూర్తిచేసి, పై చదువులకి బందరు వెళ్లాడు. అక్కడే సాహిత్య రచనా వ్యాసం గానికి అంకురార్పణ జరిగింది. కొందరు పత్రికాధిపతులతో పరిచయం ఏర్పడింది. వారి మద్దతుతో ఓ ప్రెస్‌లో ఉద్యోగం లభించింది.

1940 దశకంలో స్వాంతంత్ర ఉద్యమం ఎగిసి పడుతున్న సమయంలో, తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనలో, భుస్వామ్య వ్యవస్థలో,అణచివేతల నేపథ్యంలో చెలరేగిన రైతాంగ పోరాటం చోటుచేసుకున్న తరుణంలో,తన ఇంట్లో అందరూ కాంగ్రెస్ వాదులుగానే ఉన్నా, నిరంకుశత్వం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝళిపించడం తక్షణ కర్తవ్యమని భావించారయన. ఇతర పత్రికల రచనలకు భిన్నంగా, తమ కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా రచన ప్రారంభించాడు. తాను పనిచేసే ప్రెస్‌నే ఒక సాహిత్య వేదికగా, ఒక చర్చా వేదికగా మలుచు కున్నారు.

ప్రెస్‌లో పని చేస్తూనే ఆయా పత్రికలకి వ్యాసాలు రాయడంమొదలు పెట్టాడు. మహిళా చైతనం కోసం పాటలు రాసాడు. ఫాసిజాన్ని ఖండించాడు. పిల్లల కోసం వారి బాణీల్లో పాటలు, బాల గేయాల రాసేవాడు. 'గొడ్డకాడ' అనే నాటకం కూడా రాసి ప్రదర్శించాడు. తెలంగాణ రైతాంగ పోరాటం గురించి ఆంధ్ర ప్రాంతంలో సానుభూతి సంపాదించడం కోసం పాటలు రాసాడు. పని చేస్తున్న ప్రెస్సు మూత పడ్డాక ఆంధ్రపత్రికలో చేరాడు. రచయితగా మన్ననలను పొందాడు. ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధం సంపాదక బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహించాడు.

ప్రజానాట్య మండలికి ఎన్నో పాటలు రాసి వారికి అందిం చగా, సూరి రాసిన పాటల్ని బుర్రకథల్లో, ఇతర ప్రదర్శన కళా రూపాల్లో ఉపయోగించి, కళాకారులు ఎన్నో పాటలు, కళా రూపాల ద్వారా ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేశారు. సూరి తెలంగాణ రైతాంగ పోరాటంలో ఎంతో ప్రభావితుడయ్యాడు. కలంతోనే కాకుండా గళంతో పాడే పాటల రచయితగా తెలంగాణ పోరాటానికి నోటి పాటలను కంపోజ్ చేసేవాడు. ఆంధ్ర పత్రిక నైజాంలోకి ప్రవేశించేది కాదు. కానీ నోటి పాటలు నిరాఘాటంగా వెళ్ళి వ్యాప్తి పొందేవి. ఆయన పాటలు ప్రజల నోళ్ళలో చిర కాలం నిలిచాయి. సూరి 1958 అక్టోబరు 16న ఈ లోకాన్ని వదిలి వెళ్ళినా, ఆయన పాడిన పాటలు, కూర్చిన బాణీలు నిత్య ఆయ

త్వరలో మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీ
ప్రారంభోత్సవం చేస్తాం

మంథని, రామగిరి,కమాన్ పూర్ ముత్తారం మండలాలకు సంబంధించి 43 అంగన్వాడీలకు 5కోట్ల 16 లక్షలతో నూతన భవనాలు

రాష్ట్ర ప్రజలందరికీ,మంథని ప్రాంత ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు

మహిళా సోదరిమణులు పాడి పరిశ్రమల వైపు ముందుకెళ్లాలి

ఫ్యాక్టరీ ద్వారా 300మంది నుండి 400 మందికి ఉపాధి

ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలి: మంత్రి శ్రీధర్ బాబు

ఎల్ నినో కారణంగా వనరులను పొదుపుగా వాడండి

మంథని అక్టోబర్18 (మనం న్యూస్): త్వరలోనే మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తామని రాష్ట్ర మంత్రి దుద్దిల్ల.శ్రీధర్ బాబు తెలిపారు.ఆదివారంమంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అలీఫ్,డిఆర్డిఏ/మెప్మా/సిఎస్ఆర్ ద్వారా మంథని మున్సిపల్ పరిధిలో కుట్టు మిషన్లు ఏర్పాటు చేసి 600 మందికి ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన వారికి శ్రీధర్ బాబు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.మంథని

నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 3040 మందికి కుట్టు మిషన్ ఉచిత కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.శిక్షణ పొందిన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు కూడా అందజేశామన్నారు.రూ.కోటి రూపాయలు విలువచేసే 302 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగామంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూమంథని నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ,విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.అందరూ సుఖసంతోషాలతో,పాడి పంటలతో,చల్లగా ఉండాలని ఆ భగవంతుని కోరారు.ప్రత్యేకంగా మరి ఈ ప్రాంతంలో నేను గెలిచిన మొదటి సంవత్సరం నుంచి కుట్టు మిషన్లకు సంబంధించిన శిక్షణ ఇప్పియడం జరిగిందన్నారు.దాదాపు ప్రతి గ్రామంలో కొంతమందిని ఎంపిక చేసుకుని ఈరోజు క్యాంపు,ఎస్సీఆర్పి మరి నేను కూడా వారితోపాటు నా సొంత నిధులతో కుట్టుమిషన్ లకు సంబంధించిన మరికొన్ని సంస్థలతో మాట్లాడి కుట్టు మిషన్లను ఏర్పాటు చేసుకొని 394 మందికి ఉచిత కుట్టు శిక్షణ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు.చాలామంది కుట్టుమిషన్ లకు సంబంధించిన శిక్షణ తీసుకున్నారనీ,తీసుకున్న వారికి రాబోయే కాలంలో వారికి ఉపాధి ఇవ్వాలని ఒక చిన్న గార్మెంట్ ఫ్యాక్టరీని మూడు నుంచి నాలుగు వందల మందికి డిసెంబర్ నెల మాసంలో వారందరికీ కూడా ఉపాధి ఇచ్చే కార్యక్రమం మంథని సంబంధించిన కేంద్రంలో ఏర్పాటు చేస్తామన్నారు.నవంబర్ ఫస్ట్ నుంచి పనులు ఏర్పాటు చేస్తామని, ఫ్యాక్టరీని నెలకొల్పే వారితో మాట్లాడడం జరిగిందన్నారు ఫ్రీ ట్రైనింగ్ నవంబర్ ఫస్ట్ నుంచి ఎంపిక చేసి వారందరికీ ఫ్రీ ట్రైనింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామనీ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మంథని,రామగిరి, ముత్తారం,కమాన్ పూర్,పాలకుర్తిలోని గ్రామాలకు సంబంధించి 84 వివో భవనాలు,84 మంజూరైనవని,రెండు సంవత్సరాలలో ఒక్కొక్క భవనానికి 10లక్షల రూపాయల చొప్పున ఎనిమిది కోట్ల 40లక్షల రూపాయలు భవన నిర్మాణలు,403అంగన్వాడి భవనాలు మంజూరు చేర్పించడం జరిగిందనీ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఒక్కొక్క అంగన్వాడీ కేంద్రానికి 12లక్షల రూపాయలు చొప్పున మంజూరైనవని మంథని నియోజకవర్గంను ముందుకు తీసుక వెళ్తున్నామన్నారు.కమాన్ పూర్ మండలంలో 10,ముత్తారం మంథనిలో 18,రామగిరిలో18, పాలకుర్తిలో4,భవనాలను మంజూరు చేయించడంజరిగిందన్నారు.మంథని మండలంలో కూడా10 అంగన్వాడీ కేంద్రాలు,కమాన్ పూర్ లో6, ముత్తారంలో 6,రామగిరిలో 14, పాలకుర్తిలో భవనాలు మంజూరైనవని ఆయన తెలిపారు. మంథనిలో పాడి పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రతి లబ్ధిదారులు రెండు గేదెలను పెంచుకొని 10నుండి 30మందిని కలుపుకొని ఒక డైరీ యూనిట్ ను ఏర్పాటు చేసుకొని ముందు సాగాలన్నారు. పాడి లబ్ధిదారులను ఏర్పాటు చేసుకుని వారిని ముల్కనూరు డైరీకి 15 రోజుల ట్రైనింగ్ కు పంపడం జరుగుతుందన్నారు.ఓ ప్రయత్నం చేసే దిశలో మనం ముందుకు వెళ్తా ఉన్నాం...జనవరి మాసం నుంచి ఈ కార్యక్రమం కార్యచరణ తీసుకోవడం జరుగుతుందని,ప్రత్యేకించి మహిళాలకు సంబంధించి మరొక 20,30,40 మందిని కలుపుకుని గ్రూప్ లను తయారు చేసే కార్యక్రమం చేపట్టాలని ఆయన కోరారు.శ్రీపాద కోఆపరేటివ్ డైరీ యూనిట్ ను పెట్టినం, కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన తర్వాత దాన్ని గత ప్రభుత్వం దాన్ని ముగించడం జరిగిందని.ఈరోజు కల్యాణ లక్ష్మితో పాటు అదేవిధంగా అలీపుకు సంబంధించి వారి చేతుల మీదుగా ట్రైనింగ్ పొందిన మహిళాలకు సర్టిఫికెట్ ఇచ్చే కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.త్వరలో డిసెంబర్ మాసంలో ఒక చిన్న ఫ్యాక్టరీని ప్రారంభోత్సవంచేస్తామన్నారు.దేశవ్యాప్తంగా ఎల్ నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా చాలా దేశాలు సంబంధించిన ఎల్ నినో ప్రభావం ఉందని,దాంట్లో మన రాష్ట్రం కూడా ఒకటనీ,దానివల్ల నీటికి సంబంధించిన ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు నీటిని కొద్దిగా మిశ్రమంగా పొదుపుగా, వాడుకొని జాగ్రత్తలు పడాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.గ్రామ సర్పంచులకి,చైర్మన్,కౌన్సిలర్లకి మా గ్రామానికి సంబంధించిన బాధ్యత తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గాని,ఎస్సారెస్పీ నుంచి గాని నీళ్ల ఇచ్చే కార్యక్రమం చేసి ఎక్కడ కూడా పంటకి ఇబ్బంది లేకుండా చేశామని,కరెంటు పొదుపుగా ఉపయోగించుకునే ప్రయత్నం చేద్దామని,ఎవరు ఎన్ని రాజకీయాలు చేసిన ప్రభుత్వంగా మా అధికారులు కానీ,మేము గాని ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం మాపై ఉందన్నారు.ఈరోజు

కంటిన్యూజెన్సీ ప్లాన్ ఏర్పాటు చేసుకొని అధికారులు ముందుకు నడవాలని ముఖ్యమంత్రి చెప్పడం జరిగిందనీ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఈరోజు మనకు సంబంధించి కరెంట్ గాని, మంచినీటికి సంబంధించి గాని, ఉపాధి పరంగా గాని, జూన్ మాసం వరకు ప్రజలందరూ కొద్దిగా పొదుపుతో జాగ్రత్తతో ముందుకు నడిచే ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అభివృద్ధివైపు పయనిస్తామన్నారు.దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా రాష్ట్ర పరంగా ఏదైతే ఎఫెక్ట్ వచ్చిందో ప్రకృతి పరంగా దాని అధిగమించే ప్రయత్నం మనం అందరం కలిసి చేద్దామని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.

ఈ కార్యక్రమంలో చైర్మన్లు,కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,మండల కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

కొండాపూర్ లో బతుకమ్మ ఘాట్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, అక్టోబర్ 18 (మనం న్యూస్): చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ ను రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ అంటే కేవలం పూల పండుగ కాదు, ఇది మన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ అని అన్నారు. తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను ఆడి పాడుతారు. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ' అని అన్నారు. ఎల్ నినో, వర్షాలు, ఆరుతడి వ్యవసాయం, వాతావరణం గురించి మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కొద్దిగా తగ్గే అవకాశం ఉంది. రైతులు వర్షాలపై ఆధారపడకుండా జాగ్రత్తగా ఉండాలి. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడాలి. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి'₹ అని సూచించారు. 'రైతులు వరి పంటనే కాకుండా ఆరుతడి పంటలు వేయాలి. ఆరుతడి పంటలకు తక్కువ నీరు సరిపోతుంది, ఎక్కువ లాభం వస్తుంది. ఎల్ నినో ఉన్నా కూడా ఆరుతడి పంటల వల్ల నష్టం ఉండదు. ప్రభుత్వం ఆరుతడి పంటల రైతులకు అండగా ఉంటుంది' అని భరోసా ఇచ్చారు.

దీపావళికి ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు - మంత్రి హామీ

'దీపావళి పండుగ నాటికి మండలంలోని ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు మంజూరు చేస్తాం. గ్రామాల్లో రాత్రి వేళల్లో చీకటి ఉండకుండా, ప్రజల భద్రత కోసం, పండుగ వెలుగుల కోసం ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్, చిగురు మామిడిసింగిల్ విండో చైర్మన్ చిట్టి మల్ల రవీందర్, ఉప సర్పంచ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లయినా తమ్మచెరువు సుందరీకరణకు తట్టెడు మట్టి పోయలే

- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

మంథని అక్టోబర్18(మనం న్యూస్): మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆయన సోదరుడికి మట్టి దోపకంపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ ప్రజల మనోభావాలు,ఆకలి మీద లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు.ఆదివారం మంథని పట్టణంలోని తమ్మిచెరువును సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు.అనేక ఏండ్లుగా మన పూర్వీకుల కాలం నుంచి తమ్మి చెరువులో బతుకమ్మలను ఆంపే ఆనవాయితీ ఉండేదని తెలిపారు. ఈ చెరువును ఆనాడు తాము సుందరీకరణ చేశామని,అయితే పనులు ఎక్కడైతే ఆగిపోయాయోమూడేళ్లు అయినా పనులు అక్కడే ఉన్నాయని,సారుకు మంత్రి పదవి వచ్చినా తట్టెడు మట్టి పోయలేదని ఎద్దేవా చేశారు.తాము ఏనాడు ఓట్ల కోసం రాజకీయం కోసం మాట్లాడమని తమ మాటలకు తమ్మిచెరువు నిలువెత్తు సాక్ష్యమని చెప్పారు.ఆనాడు తమ్మి చెరువును అద్భుతంగా తీర్చిదిద్ది బోటింగ్,స్కాక్స్ పాయింట్, రింగ్రోడ్ను ప్రతిపాదన చేశామని, 70శాతం పనులు పూర్తి కాగా ప్రభుత్వం మారిపోవడంతో అక్కడే ఆగిపోయాయని,మూడేళ్లయినా ముందుకు సాగలేదని విమర్శించారు.ఈనాడు కమీషన్ల కోసం రోడ్లు చేస్తున్నారని,ఈ చెరువు పనులకు కమీషన్లు ముట్టకపోవడంతోనే పనులు చేస్తలేరని బావిస్తున్నట్లు చెప్పారు.ఒకవేళ కమీషన్లు ముట్టితే ఎన్నికలకు ముందు చేస్తారు కావచ్చని అన్నారు.మంథనిలో ఉన్న చెరువుల్లో కావాలనే మట్టి తీసి పెద్దగా ఉన్న చెరువులను చిన్నగా చేశారని,ఇందుకు రావుల చెరువు నిదర్శనమన్నారు.మంథనిలో గొప్పగా అభివృద్ధి జరుగుతాందని వచ్చి పోయేటోళ్లు అనుకునేలా రోడ్ల పనులు చేస్తున్నరే తప్ప చదువుకున్న యువకులు,మహిళల కోసం దుద్దళ్ల శ్రీధర్ బాబు ఆలోచన చేయడం లేదన్నారు.తమ్మిచెరువుకు ఒక ప్రత్యేక ఉందని,అనేక జీవరాశులు ఇక్కడే ఉంటాయని,సాయంకాలం అనేక మంది సేద తీరుతూ ప్రకృతిని తిలకిస్తుంటారని,అలాంటి వారికి నిరాశే మిగిలిందన్నారు.ఓట్లప్పుడే పనులు చేస్తమనుకోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. 40ఏండ్లుగా అధికారం ఇస్తూ నాలుగు నాలుగు సార్లు మంత్రి పదవులు ఇప్పిస్తే నాలుగు పనులు చేయకపోవడం సిగ్గు చేటన్నారు.ఏదో పెద్దస్థాయిలో ఉన్నారని మంచిగా అభివృద్ధి చేస్తరనే మున్సిపాలిటిని పెద్ద మెజార్టీతో అప్పజెప్తే పాలకవర్గం కూడా ఏమీ చేయడంలేదని, నాయకత్వం లాగే పాలకవర్గ కూడా వ్యవహరిస్తోందని,వాళ్లు మట్టి దోపిడి చేస్తుంటే పాలకవర్గం చెత్త దోపిడి చేస్తోందని ఆరోపించారు.ప్రజల పక్షాల ప్రతి సమస్యను దృష్టికి తీసుకువస్తామని, తమపై తన కుటుంబం గురించి మాట్లాడితే మేము మీ కుటుంబం మీద మాట్లాడుతామని,ఎస్సీ ఎస్టీ వాళ్లతో తిట్టిపిస్తూ భయభ్రాంతులకు గురి చేసినా ఆగమన్నారు. తమ్మిచెరువు వద్ద బతుకమ్మ ఘాట్లు ఏర్పాటు చేసి బోటింగ్ పెట్టాలని ఆలోచన చేశామని,కానీ మూడేళ్లుగా మీరేం చేశారో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.రోడ్ల పనులకు కమీషన్లు ఇస్తున్నరు కనుకనే ఆ పనులకే ప్రాముఖ్యత ఉందని,కమీషన్ల కోసం ఎన్ని ధ్వంసం చేస్తన్నరో ప్రజలు ఆలోచన చేయాలన్నారు.మంథని రామగుండం రోడ్డు విస్తరణ ఉందని తెలిసినా ఆనాడు లైట్లు ఏర్పాటు చేశారని,ఈనాడు మళ్లీ విస్తరణ పేరుతో ఆ లైట్లను తొలగించారని అన్నారు.ఈ లైట్ల ఏర్పాటుకు కోట్ల రూపాయలు వెచ్చించారని, కమీషన్ల కోసం లైట్లు వేసిండ్లు కమీషన్లు ముట్టినంక లైట్లు తీసేసిండ్లని,మళ్లీ కొత్త లైట్ల కోసం కమీషన్లు తీసుకుంటారని ఆయన అన్నారు.మీ నాయకుడిని నమ్మి ప్రజలు అవకాశం ఇస్తే మూడేళ్లయినా తమ్మి చెరువు గురించి ఆలోచన చేయలేదని, అయ్యగారి చెరువుకు సుందరీకరణ ఎందుకో సమాధానం చెప్పాలన్నారు.మూడేళ్లుగా తమ్మిచెరువు చీకటిగా ఉండటం సమాజానికే అవమానమని ఆయన అన్నారు.ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే కళ్లు తెరిచి మంథని ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన వెంట స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

వైభవంగా దుర్గామాత పూజ



మంథని అక్టోబర్18(మనం న్యూస్): మంథని డిపో కార్మికుల సహకారంతో ప్రతి సంవత్సరం మంథని డిపో ప్రాంగణంలో దుర్గామాత గుడి వద్ద దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డిపో అధికారులు సిబ్బంది నాయకులు కలిసి పెద్ద ఎత్తున దుర్గ మాత దేవి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ దుర్గామాత పూజా కార్యక్రమంలో భారీ సంఖ్యలో మంథని డిపో కార్మికులు, అధికారులు సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈపూజా కార్యక్రమంలో మంథని డిపో మేనేజర్ జ్ఞానేశ్వర్, ఎస్.టిఐవర్జిలాల్, అసిస్టెంట్ మెకానిక్ ఫోర్ మెన్ వెంకటేశ్వర్లు, మంథని డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, మునీర్,రమేష్, గ్యారేజ్ సెక్రెటరీ కృష్ణ, శ్రీనివాస్,విజయ్,మెకానిక్ విజయ్, కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ సెక్రెటరీ గంధం రమేష్, రాజబాబు,సెక్యూరిటీ కానిస్టేబుల్ రాకేష్, నందిసాగర్. మంత్రిపోచయ్య, వెంకటస్వామి, సతీష్, ఏడిసిలు ఎన్.అంజయ్య, ఎం.రాములు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భావజాలాన్ని విస్తరించాలి

జగిత్యాల, అక్టోబర్ 18(మనం న్యూస్): జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రబుద్ధ ఇంటర్నేషనల్, డిక్కీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా. బాబాసాహెబ్ అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యూత్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు ఎలుక కమలాకర్ మాట్లాడుతూ డా. అంబేద్కర్ కొద్దిమందికి మాత్రమే పరిమితం కాదని, దేశంలోని ప్రతి ఒక్కరికీ ఆయన ఆదర్శప్రాయుడని ప్రజలకు తెలియజేసేందుకు ఈ అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేద, బలహీన వర్గాల ప్రజలకు సమాన హక్కులు, చదువును అందించడానికి ఆయన రాజ్యాంగం ద్వారా చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ప్రతిరోజూ ఆయనను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

డిక్కీ జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ

డా. బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం అనే మహోన్నత విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్ గారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప దూరదృష్టి నాయకుడు ఆయన అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు విద్య ద్వారా ముందుకు రావాలని ఆయన ఎప్పటికప్పుడు ప్రోత్సహించారని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు మరియు ఆలోచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు ప్రతి ఆదివారం ఈ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ గురించి మరింతగా తెలుసుకోవడానికి ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహిళల హక్కుల పరిరక్షణ కోసం అంబేద్కర్ గారు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. సమాజంలో సమానత్వం, సోదరభావం నెలకొల్పడం ద్వారా అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయాలని కోరారు. యువత అంబేద్కర్ బాటలో నడిచి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ శక్తి ఎడిటర్ అనంతుల కాంతారావు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి కంటి అంజయ్య, క్రిస్టియన్ సంఘం జిల్లా అధ్యక్షులు ముద్దమల్ల ప్రవీణ్ కుమార్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిత్తూరి ప్రభాకర్, బక్కురి రాజశేఖర్, ధూమాల గంగ రామ్, కండ్ల లక్ష్మణ్, రుద్ర మనోహర్, దాసన్న కమలాకర్, కట్ట శ్రీనివాస్, గుడిసెల అశోక్ రాజ్, బొల్లం ప్రభాకర్, దాసరి లచ్చయ్య, దాసరి రవి, సుంకరి బలరాం, అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గే దుర్గతి నాశని

విజయవాడ,అక్టోబర్,18,(మనం ప్రతినిధి): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైనున్న జగజ్జనని దుర్గమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఆదివారం అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అష్టమి నాడు దుర్గాదేవిగా భక్తులను సాక్షాత్కారిస్తుంది జగదంబ. దుర్గముడనే రాక్షసుడిని సంహరించినందున దుర్గ అని పేరొచ్చింది. దుర్గతులను నివారించే మహాశక్తి స్వరూపంగా భక్తులు దుర్గాదేవిని కొలుస్తారు.

అమ్మవారికి ఓడిబియ్యం సమర్పణ

జగిత్యాల అక్టోబర్ 18(మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ గాయత్రీ దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి. ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గాయత్రీ దుర్గాదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఓడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి కృపాకటాక్షాలు లభించాలని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

బాధిత కుటుంబాలకు డా. పిడమర్తి పరామర్శ

హైదరాబాద్, మనం ప్రతినిధి : సత్తుపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆదివారం పర్యటించారు. ఈ మేరకు తల్లాడ కల్లూరు పెనుబల్లి సత్తుపల్లి వేంసూర్ 5 మండలాల్లో పర్యటించి పలు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. వారికి అండగా ఉంటామని డాక్టర్ పిడమర్తి రవి హామీ ఇచ్చారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న సీపీ

వర్ధల్, అక్టోబర్18(మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేతం నాచగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ దర్శించుకునిప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది ఆమెకు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాశస్త్యం, చారిత్రక విశిష్టత గురించి వివరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ నాచారం పోలీస్ ఔట్ పోస్ట్ ను సందర్శించి అక్కడి పనితీరును, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ సేవలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు,గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ రవిరాజు,గౌరారం ఎస్ఐ ఆరోగ్యం పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రి పొన్నం ప్రభాకర్

సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గౌరమ్మను ప్రార్థించాలనీ మహిళలను కోరిన మంత్రి

సిద్దిపేట అక్టోబర్ 18 (మనం ప్రతినిధి): సద్దుల బతుకమ్మ సంబరాలు ఆదివారం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరమ్మను పూజిస్తూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకోవాలని కోరారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ఆందోళన ఉందని, మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ వ్యవసాయానికి అవసరమైన సమృద్ధి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని గౌరమ్మను ప్రార్థించాలని సూచించారు. బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ తమ కుటుంబ సభ్యుల శ్రేయస్సును కోరుకునే మహిళలు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కూడా ప్రార్థించాలని అన్నారు. రంగురంగుల పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు, ఆడపడుచులు అందరూ కలిసి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు, మహిళలు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గా మాత అవతారంలో శ్రీ విద్యాధరి అమ్మవారు

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి హరీష్ రావు దంపతులు



వర్ధల్, అక్టోబర్ 18(మనం న్యూస్): అమ్మవారిని దర్శించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రసిద్ధ వర్ధల్ శంభుగిరి కొండలపై వెలసిన శ్రీ విద్యాధరి అమ్మవారు శ్రీ దుర్గామాత అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. తెల్లవారు జామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు అమ్మవారికి విశేషాభిషేకం, గణపతి పూజ, సుప్రభాతం, గిరి ప్రదక్షణ, అలంకారం, పంచ హారతులు, చతుషష్టి పచార పూజ, రాజోపచార పూజలు, చండీ హోమం తదితర పూజలతో పాటు ప్రత్యేకంగా అలంకరించారు. దుష్ట శిక్షణ శిష్ట రక్షణలో భాగంగా శ్రీ దుర్గా దేవి భక్తులను కాపాడుకోగా, ఈ పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని సిద్ధాంతి చంద్రశేఖర శర్మ పేర్కొన్నారు. కాగా ఈ పర్వదినాల్లో భాగంగా మాజీ మంత్రి హరీష్ రావు, శ్రీనిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, వారికి అర్చకులు వేద ఆశీర్వచనం ఇవ్వడంతో పాటు శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, సిద్ధాంతి చంద్రశేఖర శర్మ నేతృత్వంలో ఆలయ అర్చకులు వారిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా, క్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి. కాగా క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో ఘనంగా పూల పండుగ

- సద్దుల బతుకమ్మ వేడుకలకు వేలాదిగా తరలివచ్చిన మహిళలు
- జానపద గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో మార్మోగిన సాకి చెరువు కట్ట
- ప్రత్యేక ఆకర్షణగా రచ్చ రవి బృందం ప్రదర్శనలు
- విజేతలకు రూ.50 వేల నగదు బహుమతులు, పట్టు చీరల ప్రదానం

పటాన్ చెరు, అక్టోబర్ 18 (మనం న్యూస్) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు పటాన్ చెరులో అంబరాన్నంటాయి. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడపడుచుల అపురూప పండుగకు సాకి చెరువు కట్ట వేదికగా నిలిచింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు పూల సోయగాలు, జానపద గీతాలు, మహిళల కోలాహలం మధ్య కన్నుల పండువగా సాగాయి. వేలాదిమంది మహిళలు రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకొని తరలిరావడంతో సాకి చెరువు కట్ట తెలంగాణ సంస్కృతి వైభవానికి నిలువుటద్దంగా మారింది. ప్రముఖ జానపద, సంగీత గాయకుల బృందాలు ఆలపించిన బతుకమ్మ పాటలకు మహిళలు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.

రచ్చ రవి బృందం ప్రదర్శనలతో సందడే సందడి

ప్రముఖ నటుడు, హాస్య కళాకారుడు రచ్చ రవి నేతృత్వంలోని బృందం నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వినోదభరిత ప్రదర్శనలు, కళాకారుల సందడి ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. కాజిపల్లి భరత్ అధ్వర్యంలో బతుకమ్మ పాటలు, జానపద సంగీతం, కళాకారుల ప్రదర్శనలతో సాకి చెరువు పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

విజేతలకు రూ.50 వేల నగదు బహుమతులు.. పట్టు చీరల పంపిణీ

సంప్రదాయబద్ధంగా, సృజనాత్మకంగా బతుకమ్మలను అలంకరించి తీసుకొచ్చిన మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉత్తమ బతుకమ్మల పోటీలు నిర్వహించారు. విజేతలకు మొత్తం రూ.50 వేల నగదు బహుమతులతో పాటు పట్టు చీరలను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.20,000 నగదు, పట్టు చీర, ద్వితీయ బహుమతి రూ.15,000 నగదు, పట్టు చీర, తృతీయ బహుమతి రూ.10,000 నగదు, పట్టు చీరతో పాటు 15 మంది మహిళలకు కన్సోలేషన్ బహుమతులతో పాటు పట్టు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళలు, ఇతర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ బలమైన పునాది

- బాలు ముదిరాజ్

గజ్వేల్ అక్టోబర్ 18 మనం న్యూస్: సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం బీజీ వెంకటాపూర్ గ్రామంలో బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ఆడపడుచులకు ఆత్మగౌరానికి ప్రతీక గ్రామ సర్పంచ్ పరమేశ్వర్ ముదిరాజ్ ,ఉపసర్పంచ్ బాబు ముదిరాజ్ పాలకవర్గ సభ్యులు అన్నారు.తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని ఇది తెలంగాణ ప్రజల జీవనం విధానానికి ప్రతిబింబమని పేర్కొన్నారు తొమ్మిది రోజులపాటు తంగేడు గునుగు బంతి చామంతి తదితర రంగురంగుల పూల తోటి బతుకమ్మలను పేర్చి ఆడపడుచులు ఆడి పాడే వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ఐక్యత స్పష్టంగా కనిపిస్తున్నాయని వివరించారు బతుకమ్మలో ఉపయోగించే పూలకు ఔషధ గుణాలు ఉండటంతో పాటు ప్రకృతితో మమేకమై జీవించాలని సందేశాన్ని ఈ పండుగ దిస్తుందని తెలిపారు ప్రకృతి ఆధారించడంలో తెలంగాణ సాంస్కృతిలో అంతర్భాగమని బతుకమ్మలను మహిళనే తయారు చేసి పూజించడం మహిళా మణులు విదర్శనమని పేర్కొన్నారు.

దసరా వేళ పారిశుధ్య కార్మికులకు రాజ్‌కుమార్ కానుకలు

ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్తంగి డివిజన్ కార్మికులకు దసరా కానుకల పంపిణీ

మహిళలకు గద్వాల్ చీరలు, పురుషులకు రేమండ్స్ బట్టలు, రూ.500 నగదు అందజేత

పటాన్‌చెరు, అక్టోబర్ 18 (మనం న్యూస్): సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని ఆర్కే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కాల్వగడ్డ రాజ్‌కుమార్ అన్నారు. పండుగల సమయంలో శ్రమజీవుల కుటుంబాల్లోనూ ఆనందం వెల్లివిరియాలనే ఉద్దేశంతో పారిశుధ్య కార్మికులకు దసరా కానుకలు అందజేయడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ఆదివారం పటాన్చెరు పరిధిలోని వెలిమెలలోని తన నివాసంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ముత్తంగి డివిజన్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కాల్వగడ్డ రాజ్‌కుమార్ దసరా కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులకు గద్వాల్ చీరలు, పురుష కార్మికులకు రేమండ్స్ వస్త్రాలతో పాటు ప్రతి ఒక్కరికీ రూ.500 నగదును అందజేశారు. పండుగ వేళ కార్మికుల కుటుంబాల్లో సంతోషం నింపాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పారిశుధ్య కార్మికుల సేవలకు గుర్తింపునివ్వాలి

ఈ సందర్భంగా కాల్వగడ్డ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఎండ, వానను లెక్కచేయకుండా వీధులు, రహదారులు, కాలనీలను శుభ్రంగా ఉంచడంలో వారి కృషి ఎంతో గొప్పదని కొనియాడారు.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సేవలకు గౌరవం ఇవ్వడం, వారి కష్టాల్లో తోడుగా నిలవడం సామాజిక బాధ్యతగా భావించి ఈ దసరా కానుకలను అందజేసినట్లు వివరించారు.

కార్మికులకు ' ఆర్కే ఫౌండేషన్ ' అండగా ఉంటుంది

సమాజ అభివృద్ధిలో శ్రమజీవుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్న రాజ్‌కుమార్, పారిశుధ్య కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన వంతు సహకారం అందించేందుకు ఆర్కే ఫౌండేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా పేదలు, కార్మికులకు అండగా నిలవడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సర్పంచ్ విక్రంగౌడ్ ఆధ్వర్యంలో వైభవంగా బతుకమ్మ వేడుకలు

- నందిగామ గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- ప్రముఖ గాయని మంగ్లీ, జంగిరెడ్డి ఆటపాటలతో సందడి

పటాన్‌చెరు, అక్టోబర్ 18 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక సర్పంచ్ ఎల్లగొని విక్రంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ప్రముఖ గాయని మంగ్లీ, జంగిరెడ్డి పాల్గొని తమ ఆటపాటలతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాడిన పాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రముఖ గాయని మంగ్లీ పాటలకు మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు.



మంగ్లీతో ఫొటోలు దిగేందుకు మహిళలు, యువకులు ఆసక్తి చూపడంతో సంబరాల ప్రాంగణం సందడిగా మారింది. మహిళలు బతుకమ్మలతో సౌకర్యవంతంగా నడిచేందుకు గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న హనుమాన్ మందిరం నుంచి చెరువు కట్ట వరకు గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశారు.

వేడుకల్లో పాల్గొనే మహిళలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ సర్పంచ్ విక్రంగౌడ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం మహిళలు బతుకమ్మలతో చెరువు వద్దకు చేరుకుని సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేసి, పూల పండుగకు వీడ్కోలు పలికారు.

గ్రామ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే లక్ష్యం: సర్పంచ్ ఎల్లగొని విక్రంగౌడ్

ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్లగొని విక్రంగౌడ్ మాట్లాడుతూ, నందిగామ గ్రామ ప్రజలందరినీ ఒకచోట చేర్చి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

తరతరాలుగా వస్తున్న పండుగల వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

గ్రామంలోని మహిళలు, యువత, పెద్దలు అందరూ కలిసికట్టుగా పండుగల్లో పాల్గొని ఆనందంగా గడిపేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో ఉండాలని, ప్రతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నదే తన ఆకాంక్ష అని సర్పంచ్ విక్రంగౌడ్ స్పష్టం చేశారు. ఈ బతుకమ్మ వేడుకల్లో పటాన్చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, స్థానిక ఉపసర్పంచ్ గోరేమియా, గ్రామ నాయకులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తొలి విడత నామినేషన్ ముగిసింది

28న పోలింగ్, 30న ఫలితాలు

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః పురపాలక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఘట్టం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారంతో పూర్తయింది. చివరి రోజైన ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటల సమయానికి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద వరుసలో ఉన్న అభ్యర్థులందరి పత్రాలను అధికారులు స్వీకరించారు.

అంతిమ గడువు ముగియడంతో అన్ని ప్రధాన పార్టీల మద్దతుదారులు, స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు సమర్పించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం అక్టోబర్ 19న అధికారులు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులకు అక్టోబర్ 21న మధ్యాహ్నం 3:00 గంటల వరకు అవకాశం కల్పించారు.

అదే రోజు సాయంత్రం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అక్టోబర్ 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 30వ తేదీన ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు.

రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలలో (13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు) మొత్తం 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయి.

నామినేషన్ల స్వీకరణ పూర్తవడంతో అభ్యర్థుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్బన్ స్థానిక పోరు ముగిసిన వెంటనే, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన తదుపరి దశల పోలింగ్ ప్రక్రియ వరుసగా ప్రారంభం కానుంది.

మన బతుకమ్మ – మన చెరువు – మన బాధ్యత

- సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి

ములుగు, అక్టోబర్ 18(మనంన్యూస్)ః తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మన ఆడబిడ్డల అతి పెద్ద పండుగ బతుకమ్మ పండుగ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి క్షీరసాగర్ గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. క్షీరసాగర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, మన గ్రామంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి చెందిన అనంత కుంటను బతుకమ్మ నిమజ్జనానికి అనువుగా తీర్చిదిద్దడం జరిగింది. కుంటలోని చెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి, మోటార్ల ద్వారా నీటిని నింపి, గ్రామంలోని ఆడబిడ్డలు, మహిళలు సంతోషంగా మరియు సౌకర్యవంతంగా బతుకమ్మ నిమజ్జనం చేసుకునేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

రామాలయం మరియు శివాలయం ప్రాంగణాల్లో బతుకమ్మ సంబరాల కోసం డీజే సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలందరూ తమ బతుకమ్మలను ఈ ప్రాంగణాల్లో ఆడుతూ, పాడుతూ, ఆనందంగా జరుపుకోవాలని కోరారు. గ్రామంలోని అన్ని కులాలు, మతాలు, వర్గాల ప్రజలు ఒకే చోట చేరి, ఐకమత్యంతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మనమందరం కలిసి పండుగలు జరుపుకున్నప్పుడే మన మధ్య సోదరభావం, పరస్పర గౌరవం, సామాజిక ఐక్యత మరింత బలపడతాయి. మన గ్రామం ఐకమత్యానికి, సామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలవాలన్నారు. మన సంప్రదాయాలను కాపాడుకుంటూ, మన సంస్కృతిని భావితరాలకు అందిస్తూ, ఈ బతుకమ్మ పండుగను అందరం కలిసి ఒకే వేదికపై ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

రాష్ట్రంలో రూ. 2,500 కోట్లతో ఆలయాల అభివృద్ధి

గోదావరి పుష్కరాల పరివాహక ప్రాంతాల భక్తి క్షేత్రాలకు రూ. 2,000 కోట్లు

భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ. 276 కోట్లు

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి రూ. 354 కోట్లు మంజూరు

రూ. 90 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణం

రూ. 44 కోట్లతో ఏన్కూర్ నుండి నాచారం వరకు రోడ్డు అభివృద్ధికి భూమి పూజ చేసిన డిప్యూటీ సీఎం

ఖమ్మం, అక్టోబర్.18(మనం బ్యూరో): ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం. ఆర్థిక, విద్యుత్, ప్రణాళికా శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం డిప్యూటీ సీఎం, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి ఏన్కూరు నుండి నాచారం వరకు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఆపదమొక్కులవాడు, అడిగిన కోరికలు తీర్చే అద్భుత వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారి రవాణా సౌకర్యార్థం బీటీ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ రహదారి నిర్మాణంతో భక్తుల రాకపోకలతో పాటు స్థానికంగా హోటళ్లు, వ్యాపారాలు పెరిగి ఆదాయ వనరులు పెంపొందుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి దాదాపు రూ. 2,500 కోట్లు వెచ్చిస్తోందన్నారు. గోదావరి పుష్కరాల నాటికి నదీ పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధి కోసం రూ. 2,000 కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. చారిత్రక భద్రాచల దేవస్థాన సమగ్ర అభివృద్ధికి రూ. 276 కోట్లు కేటాయించి నిధులు మంజూరు చేశామని, పిల్లల అక్షరాభ్యాస క్షేత్రమైన బాసర దేవాలయ అభివృద్ధికి రూ. 354 కోట్లు కేటాయించామన్నారు. తెలంగాణలో కోటి 15 లక్షల కుటుంబాలు వుండగా , అందులో కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 71 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామన్నారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత

విద్యుత్ అందిస్తూ, 53 లక్షల కుటుంబాలకు కరెంట్ బిల్లుల భారం తగ్గించామని డిప్యూటీ సీఎం అన్నారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, ఏటా రూ. 20 కోట్లు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందిస్తు, 5 సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల లక్ష్యంగా పెట్టుకున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, దీనికోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించిందన్నారు.

ప్రతి ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండవ విడత తో మొత్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం వేడివేడి అల్పాహారం ఇడ్లీ, పూరీ, ఉప్మా, పాలు/రాగి జావ అందిస్తున్నామన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో పోటీపడేలా ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల వర్షభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయని, వచ్చే ఏడాది జూలై వరకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున, ప్రజలు, రైతులు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకోవాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. నీటి సంరక్షణపై గ్రామీణ ప్రాంతాల్లో కళా బృందాలు, అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వచ్చే నెల నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణలో పుట్టిన ప్రతి కుటుంబానికి ధీమానిచ్చేలా ఇందిరమ్మ భీమా పథకం ను ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని, ప్రజలందరికీ దసరా, నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు మిగిల్చినప్పటికీ, కష్టకాలంలో కూడా ఆర్థిక సర్దుబాటు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక హామీలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ వంటి అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అందిస్తున్నామని తెలిపారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు తమ ఓట్లను విధిగా నమోదు చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతోందని, ప్రజలంతా ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రాంత అభివృద్ధిలో రహదారుల నిర్మాణం అత్యంత కీలకమని, రహదారులు మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని అన్నారు. మారుమూల గ్రామాల వరకు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, ఏ ప్రాంతంలోనైనా రోడ్డు వసతి మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్నారు. ఇది పోలీసింగ్ సేవల నిర్వహణకు, శాంతిభద్రతల పరిరక్షణకు, బందోబస్తు చర్యలకు ఎంతో సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రాంత ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, పెద్దవత్తున అభివృద్ధి చేయాలని జిల్లా వాసిగా, అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం కృషి చేస్తున్నారన్నారు. గుడికి రోడ్లు వేయాలని, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా రూ. 43 కోట్లు మంజూరు చేసి, ఏన్కూరు నుంచి నాచారం మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు నిధులు కేటాయించిన ఘనత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. ఏన్కూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఐటిఐ, గోడౌన్ల మంజూరుతో పాటు ఈ ప్రాంతానికి కావలసిన రోడ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. నాచారం నుండి జూలూరుపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని, ఈ రోడ్డు నిర్మాణం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఖమ్మం జిల్లాలోని దాదాపు 10 మండలాలకు లింక్ కలుగుతుందని, 7 నుండి 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని, రోడ్డు మంజూరుకు డిప్యూటీ సీఎం కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 3.38 కోట్ల బ్యాంక్ లింకేజీ ఋణ చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు.

అంతకుముందు డిప్యూటీ సీఎం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, టీజీవిన్పిడిసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, సిఈ సురేందర్, ఎస్ఈ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అజ్మీరా సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి నాటు తుపాకీ స్వాధీనం 6 గురు అరెస్ట్

దమ్మపేట, అక్టోబర్ 18(మనం న్యూస్): నమ్మదగిన సమాచారం మేరకు దమ్మపేట మండలొ కొడిశలగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి కృష్ణ ఇంటిలో అటవీ జంతువుల వేటకు ఉపయోగించే మారణా యుధాలు మరియు గంజాయి నిల్వ ఉన్నదని తెలియగా, దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సిబ్బంది జె భద్రయ్య, ఏ పార్వతి, పీ రాజరమేష్, ఈ కాంతారావు, డి నరేష్ కుమార్ లు కలిసి ఆ ఇంటిలో సోదాలు నిర్వహించారు.సోదాల్లో ఇంటిలో రెండు బ్యాగుల్లో బ్రౌన్ కలర్ కవర్లలో చుట్టబడిన 3 కట్టల గంజాయి,వేటకు ఉపయోగించే సామగ్రి, ఒక నాటు తుపాకీ లభించాయి. ఇంటి బయట ఉన్న మోటార్ సైకిల్ ట్యాంక్ కవర్ లో కూడా ఒక గంజాయి కట్ట లభించింది. మొత్తం సుమారు 4 నుండి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.ఈ సంఘటనపై దమ్మపేట మండల ఎంపీడీవో కి లిఖితపూర్వక సమాచారం ఇచ్చి,ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను పంచులుగా నియమించి నేర అంగీకార స్వాధీన పంచనామా నిర్వహించారు.ఈ సందర్భంగా అటవీ అధికారుల అదుపులో ఉన్న 6 గురు వ్యక్తులను విచారించగా వారు పెనుబల్లి నాగ (23) కొడిశాలగూడెం పెనుబల్లి రవి(21) కొడిశలగూడెం,తాటి సాయి కృష్ణ ,(23) ఎర్రగుంపు పెనుబల్లి శ్రీను,(28) కుడిశలగూడెం,తాటి నవీన్,(25) పాతగంగారం, సప్పిడి సమ్మయ్య ,(29) గార్ల పేట,వీరందరూ తాము కూలీ పనుల ద్వారా వచ్చే ఆదాయం సరిపోక,చింతూరు,డొంకరాయి, సీలేరు,ప్రాంతాల నుండి తక్కువ ధరకు గంజాయి తెచ్చి, స్థానికంగా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు,కొంత గంజాయిని సేవిస్తున్నట్లు అంగీకరించారు.వీరి వద్ద నుండి చిల్లగుంపు,కు చెందిన సున్నం మునేంద్ర,కు చెందిన పల్సర్ మోటార్ సైకిల్ నెం.(టీ జీ 28 బి 6782)స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పెనుబల్లి శ్రీను ,వద్ద నుండి నాటు తుపాకీ -పొడవు 35 సి ఎం బ్యారెల్ 55 సి ఎం, తో పాటు మందుగుండు సామగ్రి, ఇనుప ముక్కలు, నల్ల పౌడర్, కత్తి,టార్చ్ లైట్, సౌండ్ బాక్స్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సేవించిన మత్తులో అడవిలో జంతువులను వేటాడి మాంసం తింటున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి 5 సెల్ ఫోన్లు ,స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు గంజాయి సుమారు 4 కిలోలు(4 ప్యాకెట్లు)నాటు తుపాకీ 1వేట సామగ్రి కిట్ - 1పల్సర్ మోటార్ సైకిల్ -1 సెల్ ఫోన్లు ,5.నిందితులపై తగు చర్యలు నిమిత్తం దమ్మపేట పోలీసులకు హ్యాండ్ వర్ చేయడం జరిగినదిఅని దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలియజేశారు.

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సేవలు అభినందనీయం

- **తొలి దశలోనే క్యాన్సర్ను పూర్తిగా జయించవచ్చు!**
- **ఉచిత మెగా వైద్య శిబిరంను ప్రారంభించిన చైర్పర్సన్ సామినేని సుజాత రామనామం**

మధిర ,అక్టోబర్ 18 (మనం న్యూస్): :ప్రాణాంతక మహమ్మారి బారిన పడకుండా పేద, మధ్యతరగతి ప్రజలను కాపాడటమే ధ్యేయంగా హైదరాబాద్కు చెందిన ప్రఖ్యాత బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అద్భుతమైన సేవలు అందిస్తోందని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత కొనియాడారు.స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మధిర రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో బసవతారకం ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత,సీనియర్ వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, క్యాంప్ ఇంచార్జ్ గూడూరు సత్యనారాయణతో కలిసి ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ, ఆర్థిక స్థోమత లేక మెరుగైన వైద్యానికి దూరంగా ఉంటున్న గ్రామీణ, పట్టణ ప్రాంత పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను నేరుగా చేరువ చేయాలనే గొప్ప లక్ష్యంతోనే బసవతారకం

ఆసుపత్రి ఈ ఉచిత శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. క్యాన్సర్ను తొలి దశలోనే పసిగట్టి, సకాలంలో వైద్యం అందిస్తే ఈ వ్యాధిని పూర్తిగా జయించవచ్చునని ఆమె తెలిపారు.సమాజంలో క్యాన్సు పూర్తిస్థాయి అవగాహన కల్పించడంతో పాటు, అత్యాధునిక నిర్ధారణ పరీక్షలను సామాన్యుడి ముందుకు తీసుకురావడమే ఈ వైద్య శిబిరం ప్రధాన ఉద్దేశమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించి ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మధిర రిక్రియేషన్ క్లబ్లో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం ప్రజల నుండి వచ్చిన విశేష స్పందనతో విజయవంతంగా ముగిసింది.ఈ శిబిరంలో స్థానిక ప్రజలు పాల్గొని, నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని, తగిన వైద్య సలహాలు పొందారు.ఈ కార్యక్రమంలో రిక్రియేషన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చావా రామకృష్ణ,గడ్డం శ్రీనివాసరావు,ములకలపల్లి మోహన్ రావు,తదితరులు పాల్గొన్నారు.

వైరా అభివృద్ధి పనులపై భట్టి విక్రమార్క సమీక్ష

వైరా, అక్టోబర్ 18(మనం న్యూస్): నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి, కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. ప్రధానంగా వైరా రింగ్రోడ్ సెంటర్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, మండల సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటు, వైరా రిజర్వాయర్ పర్యాటక అభివృద్ధిపై సమీక్షించారు. అలాగే వైరా నుంచి రెడ్డిగూడెం మీదుగా తల్లాడకు వెళ్లే రహదారిని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేయడం, మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, ఆధునిక వాణిజ్య వసతులు, పర్యాటక అవకాశాలు, మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమాలోచనలు జరిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, తహసీల్దార్ సురేష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవా ప్రయాణంలో లయన్స్ 25 అవార్డుల పంట

- **ఖమ్మం రీజియన్లో అగ్రగామిగా లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం...**
- **సమష్టి కృషితోనే ఘన విజయం: క్లబ్ ప్రతినిధులు**

భద్రాచలం, అక్టోబరు 18 (మనం న్యూస్): నిరంతర ప్రజాసేవ, నిరుపేదల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. నల్గొండలోని లక్ష్మీ గార్డెన్స్లో అట్టహాసంగా జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ 320ఇ 'ఎక్సెల్' వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో భద్రాచలం క్లబ్ ఏకంగా 25 అవార్డులను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. 2025-2026 సంవత్సరానికి గాను అందించిన విశిష్ట సేవలకు గాను ఖమ్మం రీజియన్ పరిధిలోనే అత్యధిక అవార్డులు సాధించిన క్లబ్గా నిలిచి విశేష ప్రశంసలు అందుకుంది.

అవార్డుల వివరాలు:

క్లబ్ సభ్యులు వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబరిచి వ్యక్తిగత, ప్రత్యేక అవార్డులను అందుకున్నారు. ఉత్తమ ప్రత్యేక అవార్డు.. లయన్ ఏగి సూర్యనారాయణ

ఉత్తమ జోనల్ చైర్మన్... లయన్ కురిచేటి శ్రీనివాస్ ఉత్తమ అధ్యక్షురాలు: లయన్ పి. కమలా రాజేశ్వర్ ఉత్తమ కార్యదర్శి: లయన్ మోర్తాల సిద్ధారెడ్డి ఉత్తమ కోశాధికారి: లయన్ యడ్లపల్లి రామారావు మీల్స్ ఆన్ వీల్స్' విశిష్ట సేవా పురస్కారాలు.. లయన్ మోర్తాల సిద్ధారెడ్డి, లయన్ పవన్ గుడికందుల, లయన్ అనుగోజి నరసింహాచారి.ఉత్తమ ప్రతిభా సేవా పురస్కారాలు: లయన్ భీమవరపు వెంకటరెడ్డి, లయన్ పి. దేశప్ప, లయన్ జి. శివశంకర్, లయన్ చావ లక్ష్మీ నారాయణ.

బాధ్యతను మరింత పెంచాయి:

ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, సభ్యుల సమష్టి కృషి, సేవా నిరతికి ఈ 25 అవార్డులు నిదర్శనమని పేర్కొన్నారు. ఆకలి తీర్చే 'మీల్స్ ఆన్ వీల్స్', పేదలకు అండగా నిలవడం, విద్య, వైద్య శిబిరాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల నిర్వహణతో క్లబ్ ముందుకు సాగుతోందని తెలిపారు. అవార్డులు తమ బాధ్యతను మరింత పెంచాయని, ముమ్ముందు భద్రాచలం పరిసర ప్రాంతాల్లో మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ వేడుకల్లో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఏగి సూర్యనారాయణ, కురిచేటి శ్రీనివాస్, పి. కమలా రాజశేఖర్, మోర్తాల సిద్ధారెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి, పి. దేశప్ప, పవన్ గుడికందుల, అనుగోజి నరసింహాచారితో పాటు పలువురు లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.క్లబ్ ఘన విజయం సాధించడం పట్ల స్థానిక ప్రముఖులు, సభ్యుల కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.

పురాతన దేవాలయాల పూర్వ వైభవానికి కృషి

- **దేవాలయాల ఉనికిని కాపాడుతున్న భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు: ఎమ్మెల్యే జారె**

దమ్మపేట, అక్టోబర్ 18(మనం న్యూస్):దమ్మపేట మండలం గుర్వాయిగూడెం పెద్దగొల్లగూడెం చిన్నగొల్లగూడెం గ్రామాల సమీపంలో దుర్గం గట్టు మీద కాకతీయుల కాలం నాటి పురాతన దేవాలయాల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, తెలిపారు రెండవ ప్రతాపరుద్రుడి కాలంలో కాకతీయ సామ్రాజ్యంతో అనుబంధం కలిగిన చారిత్రక నేపథ్యం ఉన్న శంకరగిరి దుర్గ మల్లేశ్వర స్వామి దేవాలయం వనదేవత కనకదుర్గమ్మ అమ్మవారి

దేవాలయాలు ఎంతో ప్రాచీనమైనవని పేర్కొన్నారు కాలక్రమేణా ఆదరణ తగ్గినప్పటికీ పరిసర గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ దేవాలయాల ఉనికిని కాపాడుతూ వస్తుండటం అభినందనీయమన్నారు పురాతన దేవాలయాలు మన చరిత్రకు సంస్కృతికి ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకలని వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు ఇన్నేళ్లుగా దేవాలయాలను పరిరక్షిస్తున్న భక్తులకు స్థానిక గ్రామాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ప్రజల ఆకాంక్ష మేరకు ఎమ్మెల్యేగా తన బాధ్యతను నిర్వర్తిస్తూ ఈ పురాతన దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గుర్వాయిగూడెం సర్పంచ్ ఈశ్వర ప్రగడ నాగభూషణం, పెద్దగొల్లగూడెం సర్పంచ్ యాట్ల రాందాసు,రావుల సహదేవుడు, గుర్రం మల్ల య్య, రావుల అప్పారావు,యాట్ల మంగరావు పాశం ప్రసాద్, మచ్చల వెంకటేష్, నారం మురళీ, పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ ఆస్తులపై కన్ను పడిందా?

- **గోశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా?**
- **ఆలయ ఆస్తులను కాపాడాలి.. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన తప్పదు!**
- **ఆలయ ఆస్తుల వివరాలపై సమగ్ర విచారణ చేపట్టాలని భక్తులు, స్థానికుల డిమాండ్**

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 18(మనం న్యూస్): హెడ్ ఆఫీస్ సమీపంలోని సాయిబాబా ఆలయానికి సంబంధించిన ఆస్తుల వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆలయానికి సంబంధించిన సుమారు 500 గజాల స్థలంతో పాటు, గోశాల పేరుతో వినియోగిస్తున్న స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ స్థానికులు, సాయిబాబా భక్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఆలయానికి చెందిన స్థలాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, దానిని వ్యక్తిగత ఆస్తిగా మార్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఆలయ స్థలం కబ్జాకు ప్రయత్నాలా?

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా ఆలయానికి సంబంధించిన గోశాల స్థలాన్ని ఒక వ్యక్తి తన పేరు మీద నమోదు చేయించుకుని, అక్కడ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో వివిధ పత్రాల ద్వారా స్థలాన్ని తన పేరు మీదకు మార్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి అధికారులు వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

భక్తుల అభ్యంతరాలు పట్టించుకోవడం లేదా?

ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు ఈ వ్యవహారంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికీ, తమ ఆందోళనలను సంబంధిత వ్యక్తి పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఆలయానికి చెందిన స్థలం ఆలయానికే చెందాలని, గోశాల స్థలాన్ని ఇతర ప్రయోజనాలకు వినియోగించకూడదని భక్తులు స్పష్టం చేస్తున్నారు. ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్న దేవాలయ ఆస్తులను వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సహించేది లేదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

గత హత్య ఘటనపైనా సమగ్ర విచారణ జరగాలి!

ఇదే సాయిబాబా ఆలయానికి సంబంధించి గతంలో జరిగిన హత్య ఘటనపై కూడా స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఆ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, కేసు దర్యాప్తు పురోగతి, బాధ్యులుగా ఎవరిని గుర్తించారనే అంశాలపై సంబంధిత పోలీసు అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి నిర్ధారణలేని ఆరోపణలు చేయకుండా, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

అధికారులు స్పందించాలి..
ఆలయ ఆస్తులను పరిరక్షించాలి!

సాయిబాబా ఆలయానికి సంబంధించిన ఆస్తుల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని, గోశాల స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు స్థలానికి సంబంధించిన పాత రికార్డులు, యాజమాన్య

పత్రాలు, తాజా రిజిస్ట్రేషన్ లేదా మ్యుటేషన్ వివరాలను సమగ్రంగా తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఆలయ ఆస్తుల విషయంలో అక్రమాలకు తావుండకూడదు. భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలకు అడ్డుకట్ట వేయాలి. ఆరోపణలపై అధికారులు తక్షణమే స్పందించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. ఆలయ ఆస్తులను పరిరక్షించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు, సాయిబాబా భక్తులు హెచ్చరిస్తున్నారు.

గిరి 'జన' వైద్యులు అక్కా చెల్లెలు

డాక్టర్ సీటు సాధించాలంటే ఇంట్లో ఉన్నత చదువులు చదివినవారుండి ఆర్థికంగా బాగా ఉన్నవారై ఉంటేనే సాధ్యమన్నది ఒకప్పుడు. ఇప్పుడు అ ఆ లు రాని అమ్మా నాన్నలకు వృత్తి పనుల్లో ఆసరవుతూ పేదరికాన్ని సవాలు చేస్తూ సర్కార్ బడిలో చదివి ఉచిత డాక్టర్ సీటు సాధించడం యువతరానికి ఆదర్శం. మారుమూల గ్రామాల నుండి అందునా వంటింటికే పరిమితమవుతారన్న మహిళలు ఉన్నత చదువుల్లో రాణించడం మహిళా చైతన్యానికి నిదర్శనం.

- పేదరికాన్ని జయించిన పట్టుదల
- వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు తోడు
- కూలీ పనులు చేస్తూ పై చదువులు
- అయినా ఎంబిబిఎస్ లో ఫ్రీ సీట్లు సాధించిన అఖిల, నివేజిత
- పేదలు, వెనుకబాటుగా మిగిలిన తమ వర్గానికి సేవలందిస్తామంటున్న బోతున్న డాక్టర్లు
- అఖిల, నివేజితల పట్టుదలను చూసి చెరో రూ 50 వేలు ఆర్థిక సహాయం అందించిన హరీష్ రావు

సిద్దిపేట అక్టోబర్ 18 (మనం ప్రతినిధి)ః సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పలుగుతాండ మారుమూల గ్రామానికి చెందిన వడిత్య అఖిల (20), వడిత్య నివేజిత (19) పట్టుదలతో పేదరికాన్ని సవాలు చేస్తూ సర్కార్ బడిలో చదివి ఎంబిబిఎస్ ఉచిత సీట్లను సాధించుకున్నారు. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహాయపడుతూ చదువు ఫీసుల కోసం అవసరమైతే కూలి పని చేసి డబ్బు జమ చేసుకున్న పరిస్థితులు వీరివి. అనుకున్నది సాధించాలన్న పట్టుదల ఒకరితో మరొకరు తగ్గకుండా చదువుల్లో పోటీ తత్వంతో లక్ష్యం చేరాలన్న ఇద్దరి సంకల్పం అక్కాచెల్లెళ్లను ఉన్నత శిఖరాలకు చేర్చింది. అతి చిన్న వయసులో వైద్య చదువుకు అర్హత సాధించి పెట్టింది. దీని వెనుక 'అక్కాచెల్లెళ్ల కఠోర దీక్ష, దృఢ సంకల్పం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వారి పేదరికం చదువులకు పెట్టుబడిగా నిలిచాయి'. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పలుగు తండా గ్రామానికి చెందిన వడిత్య నివేజిత 19, వడిత్య అఖిల 20 సర్కార్ బడిలో చదివి ఎంబిబిఎస్ ఉచిత సీటు సాధించడం మామూలు విషయం కాదు. పేదరికంలో పుట్టి పలుగుతాండ గ్రామంలోని యాదు నాయక్, పాపి బాయి దంపతుల బిడ్డలు ఈ ఇరువురు అక్క చెల్లెళ్లు అఖిల, నివేజితలు. వీరికి ఒక అన్న, ఒక అక్క ఉండగా అక్క వివాహమైంది. ఎకరంన్నర భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న చిన్న రైతు కుటుంబం వీరిది. పని లేనప్పుడు ఇతరులకు కూలి పనులకు కూడా వెళ్తారు. అఖిల, నివేజితలు పూర్తిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. ఇద్దరికీ మెడిసిన్ ఫ్రీ సీట్లు అఖిల 5 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ ఇశ్నాపూర్ గురుకుల పాఠశాలలో చదివింది. ఇంటర్ సిద్దిపేట టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ లో పూర్తిచేసి మెడిసిన్ కు ప్రిపేర్ అయింది. నివేజిత జహీరాబాద్ లోని టీఎస్ ఆర్ జె సి లో ఇంటర్ వరకు చదివి మెడిసిన్ కు ప్రిపేర్ అయింది. ఇద్దరు ఈసారి మెడిసిన్ లో ఫ్రీ సీట్లు సాధించారు. అఖిల నల్గొండ జిల్లా నకిరేకల్ లోని బిడిఎస్ కామినేని లో ఎంబిబిఎస్ సీట్ సాధించగా నివేజిత సంగారెడ్డి జిల్లా పటాన్చెరులోని టి ఆర్ ఆర్ లో మెడికల్ సీటు సాధించుకుంది. హరీష్ రావు ఆర్థిక సహాయం పేదరికంలో పుట్టి పట్టుదలతో అక్క చెల్లెలు ఇద్దరు మెడిసిన్ సీట్లు సాధించడం సంతోషంగా ఉందని హరీష్ రావు పేర్కొన్నారు. అక్క చెల్లెలు ఇద్దరు తమ కుటుంబంతో హరీష్ రావు ను కలిసి తమ పరిస్థితులను వివరించారు. వెంటనే స్పందించిన హరీష్ రావు మెడిసిన్ చదువుకు తన వంతు సహకారం అందిస్తానని అప్పటికప్పుడు ఒక్కొక్కరికి రూ 50 వేల చొప్పున ఇద్దరికీ కలిపి లక్ష రూపాయలు అందించారు. మరింత పట్టుదల తో మెడిసిన్ లో మరింత ప్రతిభను సాధించి పేదల కోసం నిస్వార్థంగా పనిచేసి మంచి గుర్తింపు పొందాలని హరీష్ రావు అఖిల, నివేజితరులకు సూచించారు.

ఏటూరునాగారంలో కన్నులపండువగా
సద్దుల బతుకమ్మ వేడుకలు

ఏటూర్ నాగారం, అక్టోబర్ 18, మనం ప్రతినిధి: ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలు, ఉత్సాహాల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమ్మరి శ్రీలత మరియు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమ్మరి లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు రంగురంగుల విరబూసిన పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, మహిళలు మరియు చిన్నారులతో కలిసి పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు. ఊరంతా పండుగ వాతావరణం సంతరించుకోగా, సర్పంచ్ కాకులమ్మరి శ్రీలత మరియు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమ్మరి లక్ష్మణ్ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రేటర్ హైదరాబాద్ ఉప్పల్ పట్టణంలోని అర్జున్ హైట్స్ లో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకుంటున్న మహిళల దృశ్యం
- హైదరాబాద్, మనం ప్రతినిధి

'విశ్వగురు'గా భారత్.. యువతతోనే సాధ్యం

- సనాతన ధర్మమే ప్రపంచ మానవాళికి శిరోధార్యం
- యువతలో దైవభక్తి, దేశభక్తి ఉండాలి
- ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం
- హాజరైన సేవక్స్, ఉప్పల్‌నగర్ కార్యకారిణి, సూర్యానగర్, విజయపురి కాలనీ, లక్ష్మారెడ్డి బస్తీ ప్రముఖులు

హైదరాబాద్, మనం ప్రతినిధి : సనాతన ధర్మమే ప్రపంచ మానవాళికి శిరోధార్యం.. దైవభక్తి, దేశభక్తితో భారత్‌ను 'విశ్వగురు'గా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్.. యువతతోనే సాధ్యం అని స్పష్టం చేసింది. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న యువతలో ఉండే అపారమైన నమ్మకమే దేశాన్ని ప్రపంచ పటంలో అగ్ర స్థానంలో నిలుపుతుందని అభిప్రాయ పడింది. ఈ విజయదశమితో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 102 వసంతాలను పూర్తి చేసుకొంది. ఇందులో బాగంగా విజయదశమి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ఎస్ఎస్ ఉప్పల్ నగర్, ఉప్పల్ భాగ్ ఆధ్వర్యంలో సూర్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో అత్యంత ఘనంగా విజయదశమి ఉత్సవము నిర్వహించారు. ఈ ఉత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడికంటి శ్రీనివాస్ ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, సనాతన ధర్మ ప్రచారకులు, ముఖ్య వక్తగా డాక్టర్ కుమారస్వామి గుళ్లపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోడికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ... మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయానికి ప్రతీకవిజయదశమి అని, దేశం ప్రస్తుత కాలంలోని పరిస్థితులలో విజయదశమితో పాటు హైందవ పండుగలన్ని చరిత్రతో పాటు హిందుత్వ విశిష్టత, సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దైవ భక్తి, దేశ భక్తి ఉన్న యువతలో తల్లిదండ్రులు, అక్క చెల్లెళ్లు, కూతుళ్ల పట్ల అపారమైన ప్రేమ కలిగి ఉంటారని చెప్పారు. వారు అటు దేశాన్ని, ఇటు సంఘం పట్ల నిత్యం సేవకులుగా ఉంటారన్నారు. నేడు జరుపుకొంటున్న విజయదశమి ఉత్సవమునకు ఎంతో విశిష్టత ఉందన్నారు. సెక్యూలర్ పేరుతో 'విశ్వగురు'గా ఎదుగుతున్న భారత్ పట్ల నేడు కొందరు విషం చిమ్ముతున్న తీరును వారు ఎండగట్టారు. దేశం.. ప్రస్తుత కాలంలోని పరిస్థితులలో యువత, పౌరులు ఆర్ఎస్ఎస్‌తో కలిసి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవాలని, దేశాన్ని, ధర్మాన్ని ఆర్ఎస్ఎస్ మాత్రమే కాపాడగలదని విశ్వసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా డాక్టర్ కుమారస్వామి గుళ్లపల్లి మాట్లాడుతూ... విజయదశమి అనగానే మనకు అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే అద్భుతమైన పండుగ గుర్తుకు వస్తుంది. విజయదశమి ప్రస్తావనలో దాగివున్న పౌరాణిక నేపథ్యంతో పాటు, సనాతన ధర్మం, లలితా సహస్రనామాలలో దాగివున్న శాస్త్ర విజ్ఞానం, భారతీయ జ్ఞాన పరంపర విజ్ఞానాన్ని నేడు యువతకు ఎలా అన్వయించాలో ఆయన తెలిపారు. ఇది కేవలం ఒక ఆచారం కాదు మానవాళికి నిత్యం ఆచరణీయమైన ఒక గొప్ప జీవన తత్వశాస్త్రం అందులో దాగివున్న పౌరాణిక నేపథ్యంతో పాటు, సనాతన ధర్మం, లలితా సహస్రనామాన్ని పఠించడం వల్ల నాడీ వ్యవస్థలో మార్పులు (న్యూరోలాజికల్ సిస్టం), మెదడు తరంగాలలో మార్పు (బ్రెయిన్ వేవ్ ఆల్టరేషన్) చోటుచేసుకుంటాయి. దీనివల్ల ఒత్తిడిని కలిగించే బీటా తరంగాలు (బీటా వేవ్స్) తగ్గి, కార్టెక్స్ అనే హార్మోన్ విడుదలయ్యి మనస్సు ప్రశాంతంగా, స్థిరంగా ఉంటుందని మరియు భారతీయ జ్ఞాన పరంపర అయినా వేద విజ్ఞానం కేవలం ఆధ్యాత్మిక విజ్ఞానమే కాకుండా వేదంలో సైన్స్ , ప్రకృతి, సంగీతం, శాస్త్ర విద్య మొదలగు విషయాలు దాగివున్న విషయాన్ని నేడు యువతకు ఎలా అన్వయించాలో తెలిపారు. అలాగే దేశ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ పాత్ర, భారతీయ తత్వము, ప్రపంచ మానవాళికి సనాతన ధర్మమే శిరోధార్యమని,దేశ యువత దైవభక్తితో పాటు దేశభక్తిని కలిగి ఉండటం అనివార్యమని, అప్పుడే (భారత్)దేశం 'విశ్వగురు' స్థానాన్ని అధిగమిస్తుందని ఉద్ఘాటించారు. అలాగే ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా సంఘం తీసుకున్న పంచ పరివర్తన అంశాలు పర్యావరణం, కుటుంబ వ్యవస్థ, స్వదేశీ, సామాజిక సామరస్యం, పౌర నియమాలు నేడు ప్రజాజీవితానికి అత్యంత అవసరమని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్-ఉప్పల్ నగర్ కార్యకారిణి, లక్ష్మారెడ్డి బస్తీ ప్రముఖులు, సూర్యానగర్, విజయపురి కాలనీ వాసులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఆర్ఎస్ఎస్ అవిర్భావం, విశిష్టత..

భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను పరిరక్షించటం తమ ఆశయంగా ఈ సంస్థ ఉద్ఘాటించింది. ఆర్ఎస్ఎస్ ఒకవైపు హిందూ జాతీయవాద భావనతో దేశ సమగ్రతకు కృషి చేస్తూనే.. మరోవైపు భారతదేశ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక దిశను శాసించగల అత్యంత శక్తివంతమైన సంస్థగా నిలుస్తోందన్నారు. భారతీయ హిందూ సమాజాన్ని భారతీయ సంస్కృతిని, పౌర సమాజం యొక్క విలువలను సమర్థించే ఆదర్శాలను ప్రోత్సహిస్తు.. హిందూ సమాజాన్ని 'బలోపేతం చేయడానికి' హిందుత్వ భావజాలాన్ని వ్యాప్తి చేస్తుందని గుర్తు చేశారు. ఇక, దేశంలో ఎక్కడ భూకంపాలు, వరదలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా 'సేవా భారతి' ద్వారా ఆర్.ఎస్.ఎస్ స్వయంసేవకులు ముందుండి సహాయక చర్యలు చేపడతారన్నారు. మొదట ఒక ప్రముఖ హిందూ జాతీయవాద సంస్థగా ఎదిగిన ఆర్ఎస్ఎస్.. నేడు అనేక అనుబంధ సంస్థలకు దారితీసింది. దాని సైద్ధాంతిక విశ్వాసాలను వ్యాప్తి చేయడానికి అనేక పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, క్లబ్బును స్థాపించింది. అలా హిందూ జాతీయవాద ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ చారిత్రాత్మకంగా ప్రధాన పాత్ర పోషించింది. నేటితో ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 102 ఏళ్లు పూర్తి చేసుకుని 2026 విజయదశమి వేడుకలను బస్తీలు, నగరాలు, తాలుకాలు, పట్టణాలలో సైతం ఘనంగా నిర్వహించింది. ఇక, ఆర్ఎస్ఎస్, దీని అనుభంద సంస్థలన్నింటినీ కలిపి సంఘ్ పరివార్ అని పిలుస్తారు. భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, వనవాసి కళ్యాణ ఆశ్రమం, స్వదేశీ జాగరణ మంచ్, ప్రజ్ఞా ప్రవాహ్, ఇతిహాస సంకలన సమితి, విద్యా భారతి, సంస్కార భారతి, సంస్కృత భారతి, అధివక్తా పరిషత్, పూర్వ సైనిక పరిషత్, భారతీయ జనతా పార్టీ, విశ్వ హిందూ పరిషత్, రాష్ట్ర సేవికా సమితి వీటిలో ముఖ్యమైనవి. ఆర్ఎస్ఎస్ తోపాటు ఈ సంస్థలన్నింటికి చాలా పెద్ద సంఖ్యలో సభ్యులున్నారు.

ముప్పనపల్లిలో వైభవంగా బతుకమ్మ వేడుకలు

- పూల పండుగకు తరలివచ్చిన మహిళలు.. రంగురంగుల బతుకమ్మలతో సందడి

ముప్పనపల్లి, అక్టోబరు 18 (మనం న్యూస్): కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలు ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వివిధ రకాల స్థానిక పూలను సేకరించి మహిళలు ఎంతో అందంగా, ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం బతుకమ్మలను ఒకచోట ఏర్పాటు చేసి, వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలు, మహిళల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు సైతం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. సంప్రదాయ పూల పండుగైన బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ముప్పనపల్లిలో జరిగిన బతుకమ్మ వేడుకల ఫొటోలు స్థానికంగా ఆకట్టుకున్నాయి.

సూపర్ ఎల్నినో ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి
- ఎల్నినో పరిస్థితులపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఉన్నతాధికారులతో సమీక్షించిన ప్రత్యేక అధికారి

ఖమ్మం, అక్టోబర్ 18(మనం న్యూస్): సూపర్ ఎల్నినో ప్రభావం ఎదుర్కొనేందుకు రానున్న 8 నెలల్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, త్రాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత ఏడాది వర్షపాతంతో పోల్చి ప్రస్తుత ఏడాది మండలాల వారీగా వర్షపాత వివరాలను పరిశీలించాలని, లోటు వర్షపాతం నమోదైన మండలాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న మండలాలను గుర్తించి, రానున్న రోజుల్లో వాటి పరిస్థితిపై క్రమం తప్పకుండా అంచనాలు రూపొందించాలని, ఈ వివరాలను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. సూపర్ ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న 8 నెలలకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, అవసరమైన సహకారం కోసం ప్రభుత్వానికి నివేదించాలని తెలిపారు. సమీక్షలో చర్చించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేయనున్నట్లు అన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు:

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో 5 మీటర్లు, ఎర్రుపాలెం మండలంలో 6.5 మీటర్లు, ఏన్కూరు, సత్తుపల్లి మండలాల్లో 5 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దమ్మపేట, అశ్వారావుపేట, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో 10 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు పేర్కొన్నారు. భూగర్భ జలాలను పరిరక్షించేందుకు అనధికారికంగా బోర్లు వేయడం, నీటిని తోడుకోవడాన్ని నియంత్రించాలని, వ్యవసాయ బోర్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎల్నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల వల్ల పంపులు, మోటార్లు, ట్రాన్స్ఫార్మర్లు, డీటీఆర్లపై భారం పెరిగే అవకాశం ఉన్నందున ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) రైతు వేదికల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామాల వారీగా మూడు ఫేజ్ల విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే ప్రకటించాలని తెలిపారు. త్రాగునీటి అవసరాల కోసం మినహా కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వకూడదని, బోర్లు వేసే వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని, వాల్టా చట్టాన్ని తహసీల్దార్లు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఖరీఫ్లో వరి సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో తగ్గలేదని ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రబీ సీజన్లో వరి సాగు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపట్టకూడదని, రబీకి కాలువల ద్వారా నీటిని విడుదల చేయబోమని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా కూడా ఆశించిన స్థాయిలో అందక పోయే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని, రైతులు నష్టపోకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి

అనధికారిక విద్యుత్ కనెక్షన్ల కారణంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు (డీటీఆర్లు) అధిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని, వాటిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించడం వల్ల కూడా విద్యుత్ వ్యవస్థపై అదనపు భారం పడుతోందని, అటువంటి పరిస్థితులను నియంత్రించాలని తెలిపారు. డీటీఆర్లలో సమస్యలు తలెత్తిన వెంటనే మరమ్మతులు చేపట్టి, తక్కువ ఓల్టేజీ సమస్యలు రాకుండా చూడాలని, పంటలు విద్యుత్ కొరత వల్ల ఎండిపోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. డీటీఆర్ల మరమ్మతులు, సామర్థ్య విస్తరణ పనులను సమాంతరంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా మూడు ఫేజ్ల విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని, ఫీడర్ల లో తక్కువ ఓల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పశువులకు నీరు, పశుగ్రాసం

వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ప్రత్యేక అధికారి సూచించారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు నిర్మించేందుకు వీబీ జి రాంజీ పథకాన్ని వినియోగించుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఖమ్మం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సింగరేణి, కామేపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని, మిగిలిన 16 మండలాల్లో లోటు వర్షపాతం ఉందని వివరించారు. జిల్లాలో 10 మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, 7 మండలాలను సాధారణ కరువు మండలాలుగా గుర్తించినట్లు వివరించారు.

భూగర్భ జలాల పరిస్థితి

ఖమ్మం జిల్లాలో సెప్టెంబర్ 2026 నాటికి భూగర్భ జలమట్టం 3.56 మీటర్లుగా నమోదైందని, గత ఏడాది ఇదే సమయంలో 2 మీటర్లుగా ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 2026లో భూగర్భ జల మట్టం 5.02 మీటర్లుగా ఉండగా, సెప్టెంబర్లో కురిసిన తుపాను వర్షాల కారణంగా మెరుగుదల కనిపించిందని వివరించారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5.82 లక్షల ఎకరాలు కాగా, ఇందులో 2.41 లక్షల ఎకరాల్లో వరి, 2.35 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతున్నట్లు తెలిపారు. కల్లూరు, పెనుబల్లి, నేలకొండపల్లి, కూసుమంచి, తల్లాడ, వేంసూరు, వైరా, సత్తుపల్లి, తిరుమలాయపాలెం, ముదిగొండ 10 మండలాల్లో 83 శాతం వరి విస్తీర్ణం ఉన్నట్లు వివరించారు. సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా అనేక చెరువులను నింపినట్లు తెలిపారు. కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వైరా ప్రాంతాలు సీతారామ సాగర్ రాజీవ్ లింక్ కెనాల్ పరిధిలో ఉన్నట్లు వివరించారు. గోదావరి జలాల ద్వారా మొత్తం 110 చెరువులకు నీరు అందించగా, వాటిలో 101 చెరువులు పూర్తిగా, 2 చెరువులు 50 శాతం, 7 చెరువులు 75 శాతం నిండినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 244 చెరువుల్లో 125 చెరువులు 75 నుండి 100 శాతం, 49 చెరువులు 50 నుండి 75 శాతం, 35 చెరువులు 50 శాతం, మరో 35 చెరువులు 25 నుండి 50 శాతం నిండినట్లు వివరించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా మరిన్ని చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలేరు పరిధిలో పెండింగ్లో ఉన్న చెరువులను నింపేందుకు నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉందని వివరించారు.

ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్లోని నీరు 84 రోజులకు సరిపోతుందని వివరించారు. ప్రస్తుత పంటలకు ఒకటి లేదా రెండు తడులు అందించడంతో పాటు వచ్చే వర్షాకాలం వరకు త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే నాగార్జున సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్కు 3 సార్లు, వైరా/లంకాసాగర్ ప్రాజెక్టును ఒకసారి నింపాల్సిన అవసరం ఉందని తెలిపారు.

పాలేరు రిజర్వాయర్కు రానున్న 8 నెలల త్రాగునీరు అవసరాల కోసం 4.5 టీఎంసీల నీరు అవసరమని వివరించారు. గత ఏడాది 271 డీటీఆర్లకు మరమ్మతులు చేపట్టగా, ఈ ఏడాది ఇప్పటివరకు 341 డీటీఆర్లకు మరమ్మతులు చేసినట్లు వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 26.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్టోబర్ 2026లో భూగర్భ జలమట్టం 7.76 మీటర్లుగా ఉండగా, అక్టోబర్ 2025లో 5.08 మీటర్లుగా నమోదైందని గత ఏడాదితో పోలిస్తే 2.68 మీటర్ల మేర తగ్గుదల నమోదైందని వివరించారు.

తాలిపేరు ప్రాజెక్టు ద్వారా 24,700 ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. దుమ్ముగూడెం వద్ద 1 మీటరు ఎత్తులో ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తే 1 టీఎంసీ వరకు నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని వివరించారు.

ప్రస్తుతం ఉద్యాన పంటలు ఎండిపోయే పరిస్థితి లేదని, ఖరీఫ్లోనూ పెద్దగా ఇబ్బందులు లేవని తెలిపారు. రానున్న రోజుల్లో వర్షాధార పంటలు, పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని వివరించారు. గత ఏడాది 175 డీటీఆర్లకు, ఈ ఏడాది 214 డీటీఆర్లకు మరమ్మతులు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్, భూగర్భజల, విద్యుత్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువరాజ్ సింగ్ 19 ఏళ్ల రికార్డు బ్రేక్.. 6 బంతుల్లోనే నమన్ ధీర్ విధ్వంసం

భారత్, వెస్టిండీస్ మధ్య బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాడు నమన్ ధీర్ అద్భుత ప్రదర్శనతో టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ 19 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. ఈ సిరీస్ రద్దవడంతో స్వదేశంలో వరుసగా 12 సిరీస్‌లు గెలిచిన భారత్ నాలుగేళ్ల విజయాల పరంపరకు అడ్డుకట్ట పడింది. వర్షం తగ్గిన తర్వాత చిన్నస్వామి స్టేడియంలోని అద్భుతమైన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా మ్యాచ్‌ను వెంటనే 9 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన వెస్టిండీస్ బౌలింగ్ ఎంచుకోగా, కేవలం 7.4 ఓవర్ల పాటు మాత్రమే ఆట సాధ్యమైంది. ఈ తక్కువ సమయంలోనే భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ఇషాన్ కిషన్ కేవలం 10 బంతుల్లో 2 సిక్సర్లతో 30 పరుగులు చేయగా, నమన్ ధీర్ కేవలం 6 బంతుల్లోనే 3 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 పరుగులు బాదాడు. దీంతో భారత్ 5 వికెట్ల నష్టానికి 118 పరుగులు సాధించింది.

ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో నమన్ ధీర్.. 2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై ఇషాన్ కిషన్, దినేష్ కార్తీక్ వంటి వారి పేరిట ఉన్న రికార్డులను వెనక్కి నెట్టాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం 5 లేదా అంతకంటే ఎక్కువ బంతులు ఆడిన భారత బ్యాటర్ల జాబితాలో నమన్ ధీర్ ఇప్పుడు నంబర్-వన్ స్థానానికి చేరుకున్నాడు. అంతకుముందు ఈ రికార్డు ఉమ్మడిగా యువరాజ్ సింగ్ (2007లో ఇంగ్లండ్‌పై 16 బంతుల్లో 362.5 స్ట్రైక్ రేట్‌తో 58 పరుగులు), దినేష్ కార్తీక్ (2018లో బంగ్లాదేశ్‌పై నిదాహస్ ట్రోఫీ ఫైనల్‌లో 8 బంతుల్లో 362.5 స్ట్రైక్ రేట్‌తో 29 పరుగులు) పేరిట ఉండేది. ఇప్పుడు టెస్టు హోదా ఉన్న దేశాల్లో కనీసం 6 బంతులు ఆడి 400 లేదా అంతకంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించిన సెలెక్టెడ్ బ్యాటర్ల జాబితాలో నమన్ ధీర్ చోటు సంపాదించుకున్నాడు.

బ్యాడ్మింటన్‌లో బోణీ

సెమీస్‌లో మానసి జోడీ • భారత్‌కు పతకం ఖాయం

ఆసియా పారా క్రీడలు ఆరంభానికి ముందే భారత్‌కు పతకం ఖాయమైంది. పారా షట్లర్ల జోడీ మానసి జోషి, తులసిమతి మురుగేశన్ సెమీస్ చేరారు. ఆసియా పారా క్రీడలు ఆదివారం ప్రారంభం కానుండగా.. కొన్ని క్రీడల్లో గ్రూప్ మ్యాచ్‌లు ఇప్పటికే మొదలయ్యాయి. శనివారం పారా బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో మానసి, తులసిమతి ద్వయం 21-10, 21-17తో యుమెయ్ లియు, టాంగ్‌టాంగ్ (చైనా) జంటను ఓడించి దేశానికి పతకం ఖాయం చేసింది. టోక్యో పారాలింపిక్స్ విజేత కృష్ణ నగర్ వరుసగా రెండో విజయం అందుకున్నాడు. పురుషుల సింగిల్స్‌లో అతడు క్వార్టర్స్ బెర్తు ఖాయం చేసుకున్నాడు. కృష్ణ 21-13, 21-15తో సుభాన్ (ఇండోనేసియా)ను చిత్తు చేసి, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. నితేశ్ కుమార్ 21-6, 21-7తో చామ్‌నాన్వెట్ (థాయ్‌లాండ్)పై, ప్రమోద్ భగత్ 21-17, 21-16తో షియాంగ్ (చైనా)పై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో నిత్య శ్రీ 21-18, 21-13తో లిన్ షాంగ్‌బావొ (చైనా)ను ఓడించింది. సింగిల్స్‌లో మానసి 3-21, 3-21తో షినో (జపాన్) చేతిలో చిత్తయింది. పురుషుల డబుల్స్‌లో సూర్యకాంత్, నవీన్ జోడీ 21-7, 21-19తో మింగ్‌పన్ లి, షియాంగ్ లిచువాన్ (చైనా) జంటపై పైచేయి సాధించింది.

శ్రేయస్ అయ్యర్‌కు ఇంపాక్ట్ ప్లేయర్ అవార్డు

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అదరగొట్టాడు. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ ఆకట్టుకున్న అతడికి టీమ్ మేనేజ్‌మెంట్ అరుదైన గుర్తింపునిచ్చింది. ఐదు టీ20ల సిరీస్‌లో అత్యంత ప్రభావవంతమైన ఆటగాడిగా నిలిచిన శ్రేయస్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' మెడల్‌ను అందించింది. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ ఆదివారం విడుదల చేసింది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వెస్టిండీస్‌తో సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ బ్యాట్‌తో పరుగుల వరద పారించాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 181 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో నిలిచాడు. 45.25 సగటుతో పాటు 205.68 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధించాడు. లఖ్‌నవూ వేదికగా జరిగిన తొలి టీ20లోనే శ్రేయస్ తన తొలి అంతర్జాతీయ టీ20 సెంచరీని నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు సాధించిన ఏడో భారత పురుష క్రికెటర్‌గా అరుదైన ఘనత అందుకున్నాడు.సిరీస్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో టీమిండియా ట్రైనింగ్ అసిస్టెంట్ నువాన్ సేనవిరత్నే.. శ్రేయస్‌కు మెడల్‌ను అందించాడు. మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు చేసిన కొద్దిమంది భారత ఆటగాళ్లలో శ్రేయస్ ఒకడని, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో జట్టు ముందుండి నడిపించాడని ఈ సందర్భంగా ప్రశంసించాడు.

ఈ వీడియోను బీసీసీఐ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది. వర్షం, పరుగులు, డ్రెస్సింగ్ రూమ్ సందడి.. ఇలా సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ చుట్టూ జరిగిన విశేషాలను వీడియోలో చూపించింది. ఇదిలా ఉంటే, భారత్-వెస్టిండీస్ ఐదు టీ20ల సిరీస్ సమం అయిన సంగతి తెలిసిందే.

చిన్నతనంలో ఎదుర్కొన్న అనుభవాలే వాస్తవాన్నేర్పించాయి

సన్నీ లియోన్ ఎమోషనల్

బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ సన్నీలియోన్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు చేస్తూ దూసుకెళ్తున్న ఈ భామ.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన కెరీర్ తొలినాళ్ల కష్టాలు, చిన్ననాటి ఆర్థిక సమస్యల గురించి మాట్లాడుతూ.. జీవితంలో సక్సెస్ సాధించడానికి ఎలాంటి షార్ట్‌కట్‌లు ఉండవని, కేవలం కష్టపడటం వల్ల మాత్రమే అనుకున్నది సాధించగలమని ఆమె స్పష్టం చేశారు. చిన్న వయసులోనే తాను ఎదుర్కొన్న అనుభవాలే తనకు ఈ వాస్తవాన్నేర్పించాయని తెలిపారు. చిన్నతనంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నానని, సమాజంలో రకరకాల విమర్శలను భరించానని సన్నీలియోన్ గుర్తుచేసుకున్నారు.కేవలం 7, 8 ఏళ్ల వయసులోనే తాను డబ్బు సంపాదించడం కోసం చిన్నచిన్న పనులు చేయడం మొదలుపెట్టినట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లి వస్తువులు అమ్మడం, మంచును శుభ్రం చేయడం, పలు స్టాళ్లు పెట్టడం లాంటి ఎన్నో పనులు చేశానని తెలిపారు. అంత చిన్నవయసులో కష్టపడినా పెద్దగా డబ్బులు వచ్చేవి కాదని, కేవలం ఒక చాక్‌లెట్ లేదా క్యాండీ కొనుక్కునేంత మాత్రమే దొరికేవని ఆమె చెప్పారు. అయినప్పటికీ, కష్టపడి పనిచేస్తేనే ఫలితం ఉంటుందనే నమ్మకం అప్పుడే తనలో బలపడిందని అన్నారు. జీవితంలో గడ్డు పరిస్థితులు ఎదురైనప్పుడు గతంలో ఎన్నడూ ఊహించని కొన్ని కఠిన నిర్ణయాలు కూడా తీసుకోవాల్సి వచ్చిందని ఆమె ఎమోషనల్ అయ్యారు.

ఆ సినిమాతో నా కల నెరవేరింది: పూర్ణ

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి పూర్ణ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో ఆమె చేసిన డ్యాన్స్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇంతటి భారీ ప్రాజెక్టులో తనకు అవకాశం ఇచ్చిన దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్, నిర్మాత కళానిధి మారన్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌కు ఆమె ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు.''రజనీకాంత్‌తో కలిసి స్క్రీన్ పంచుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. నాకు ఆ అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఏళ్ల తరబడి ఆయనకు వీరాభిమానిని. ఆయన నటించిన 'పడయప్ప' (తెలుగులో నరసింహ) నాకు ఎంతో ఇష్టమైన సినిమా. జైలర్ 2 వంటి భారీ ప్రాజెక్టులో ఇంత మంచి పాట చేసే అవకాశం వస్తుందని అనుకోలేదు. ప్రేక్షకుల స్పందన చూసి.. వారికి కతజ్ఞతలు చెప్పేందుకు సినిమా విడుదల కోసం ఇన్నిరోజులు ఎదురుచూశాను. మన కష్టం, పని పట్ల ఉన్న అంకితభావానికి ఎప్పటికైనా తగిన ఫలితం దక్కుతుందని అందరూ అంటుంటారు. ఇప్పుడు నాకు అలాంటి ఫలితమే దక్కింది'' అని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. ఇక, 'జైలర్ 2'లో వచ్చే 'అల బోలెలో' అనే ప్రత్యేక పాటలో ఆమె నర్తించిన విషయం తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా వసూళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రూ.37.10 కోట్లు రాబట్టిన ఈ చిత్రం.. శనివారం రూ.47.80 కోట్ల (నెట్) వసూళ్లు సాధించింది. దీంతో భారత్‌లో ఈ సినిమా నెట్ వసూళ్లు రూ.100 కోట్లు దాటాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా కేవలం మూడు రోజుల్లోనే రూ.317.15 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించి రికార్డుల దిశగా దూసుకుపోతోంది.

'వారణాసి' పోస్ట్‌పోన్ కాలేదట.. ఆ రోజే థియేటర్లలోకి మహేష్-జక్కన్న మూవీ!

సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న గ్లోబల్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' గురించి సోషల్ మీడియాలో ఏ చిన్న వార్త వచ్చినా క్షణాల్లో వైరల్ అయిపోతుంది. అయితే గత రెండు రోజులుగా ఈ ప్రాజెక్ట్ వాయిదా పడిందంటూ, అనుకున్న సమయానికి థియేటర్లలోకి రావడం లేదంటూ నెట్టింట విపరీతమైన ప్రచారం జరిగింది. దీంతో మహేష్ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా అందుతున్న సమాచారంతో ఆ రూమర్లన్నింటికీ ఒక్క దెబ్బతో తెరపడింది.సినిమా వాయిదా పడిందంటూ వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర యూనిట్ సన్నిహిత వర్గాలు కుండబద్దలు కొట్టాయి. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారమంతా కేవలం పుకార్లేనని స్పష్టం చేశాయి. అసలైన ట్విస్ట్ ఏంటంటే.. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే పూర్తి కావడం విశేషం. ప్రస్తుతం భారీ స్థాయిలో హై-ఎండ్ సీజీఐ, ఇతర పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. రాజమౌళి ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో పకడ్బందీగా చెక్కుతున్నారని టాక్. అన్నింటికంటే ముఖ్యంగా ఈ సినిమా కోసం ఎక్స్‌క్లూజివ్ ఐమ్యాక్స్ రిలీజ్ విండోను కూడా మేకర్స్ లాక్ చేసేశారట. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే 2027 ఏప్రిల్ 7న 'వారణాసి' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతోందని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో ఐమ్యాక్స్ స్క్రీన్లను బ్లాక్ చేసుకుని మరీ రంగంలోకి దిగుతున్నారంటే జక్కన్న ప్లానింగ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. రిలీజ్ డేట్‌పై ఈ మాత్రం క్లారిటీ రావడంతో సూపర్ స్టార్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకోవడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా సంబరాలు మొదలెట్టేశారు.

ప్రభాస్ 'స్పిరిట్' మూవీ వాయిదా

కొత్త రిలీజ్ డేట్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'స్పిరిట్'. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ భారీ అప్‌డేట్ బయటకు వచ్చింది. దీని విడుదల తేదీని సందీప్ రెడ్డి వంగా అధికారికంగా ప్రకటించారు. గతంలో ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది (2027) మార్చి 5న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఈ సినిమాను వాయిదా వేస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 2027 అక్టోబర్ 29న దీపావళి పండుగ కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అందులో స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా దర్శకుడు సందీప్ ఈ విశేషాన్ని పంచుకున్నారు. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. గుల్షన్ కుమార్ సమర్పణలో టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై ఈ మూవీని నిర్మిస్తున్నారు. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కషన్ కుమార్, ప్రభాకర్ రెడ్డి వంగా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న ఆదివాసీలు

గ్రామస్థాయి నుంచి ఆదివాసి కమిటీల బలోపేతం.. ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్

నల్లగొండ-- అక్టోబర్ 18 (మనం ప్రతినిధి): ఆదివాసీలు కాంగ్రెస్ పార్టీకి ఎల్లవేళలా వెన్నుదన్నుగా ఉంటారని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో సంఘటన్ సృజన్ లో భాగంగా రాష్ట్రస్థాయి ఆదివాసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీలను బలోపేతం చేసే దిశగా సంఘటన్ సమావేశం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్రంలోని ఆదివాసీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వీరిని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించి 33 జిల్లాలలో జిల్లా కమిటీలను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కమిటీలు కృషి చేస్తాయని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రానున్న హైదరాబాద్- రంగారెడ్డి, ఖమ్మం-వరంగల్- హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో సామ దామోదర్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డిల గెలుపు కోసం కృషి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 75 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని విమర్శించారు. బిజెపి మతాల పేరుతో రాజకీయం చేస్తుందని ఆరోపించారు. ఈ రెండు పార్టీల వలన ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పథకాలతో ముందుకు పోతుంటే ప్రతిపక్షాలు గ్లోబల్ ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ బడ్జెట్ 26 వేల కోట్లు ఉండగా ఇప్పుడు 36వేల కోట్లకు చేరిందని అన్నారు. అయినప్పటికీ ఆ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏ అభివృద్ధి చేసినా అది కాంగ్రెస్ ప్రభుత్వం వలనే సాధ్యమైందని అన్నారు. ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి గారితో ఆదివాసి సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన దిశా నిర్దేశకం చేస్తారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆదివాసి వైస్ చైర్మన్ లింగం నాయక్, హనుమంతు నాయక్, మోహన్ ,గణేష్, శ్రీనివాస్, చంద్రకళ, మల్లికార్జున్, మల్లీశ్వరి నాయక్, కోట్య నాయక్, తిరుమల నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘణంగా బతుకమ్మ వేడుకలు

హనుమకొండ, అక్టోబర్ 18(మనంన్యూస్): హనుమకొండ నగరంలోని గోపాల్‌పూర్ ఉషోదయ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించినారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై గంగమ్మ గౌరమ్మ ఉయ్యాలో, ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయచందమామ, చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ, చిత్తు చిత్తు బొమ్మ వాకిట్లో పెట్టి గంగమ్మ అని అడిగింది గౌరమ్మని అడిగింది చల్లంగా చూడని తెలంగాణ సంస్కృతిలో మహిళలు బతుకమ్మను పవిత్రంగా 9రోజులాడి చివరి రోజు అయిన ఈరోజు చిన్న,పెద్ద తేడా లేకుండా బతుకమ్మను ఘనంగా పాటలతో ప్రారంభించి నృత్యాలు చేశారు. ప్రకృతిని పూజించి ప్రకటించి పువ్వులను సేకరించి ప్రకృతి లోనే కలిపి ఏకైక సంస్కృతి తెలంగాణ ఆడపడుచుల అందమైన ఉయ్యాల పాటలతో ఉషోదయ కాలనీ కోలాహలంగా మారింది. శోదయా కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు కోలాటాలతో ప్రకృతి పువ్వులపై పాటలు రూపకంగా తెలంగాణ సంస్కృతిని సాంప్రదాయాలను బతుకమ్మల చుట్టూ ప్రత్యక్షంగా తిరుగుతూ పాటలతో అందరిని మంత్రముగ్ధులను చేశారు చిన్న పిల్లలు కోలాహాలతో ఆనందంగా ఉత్సాహంగా ఉల్లాసంగా బతుకమ్మ వేడుకలలో పాల్గొని చివరి రోజు ఘనంగా ముగించారు.



బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భరత్

తిరుమలగిరి, అక్టోబర్ 18 (మనం న్యూస్): మున్సిపాలిటీ భూక్య భరత్ భారతీయ జనతా యువమోర్చా (బిజెవైఎం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన సహకరించిన బీజేపీ నాయకత్వానికి, బిజెవైఎం నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. యువతను సంఘటితం చేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, యువత అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని పేర్కొన్నారు. పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెడుతూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని భరత్ తెలిపారు.

జిల్లా జనరల్ సెక్రెటరీగా రౌతు కళ్యాణ్ నియామకం

కోదాడ, అక్టోబర్ 18(మనం న్యూస్): బిజెపి సూర్యాపేట జిల్లా జనరల్ సెక్రెటరీగా నియామకమైన రౌతు కళ్యాణ్ కు బిజెపి రాష్ట్ర నాయకులు నల్లా వికాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వికాస్ రెడ్డి మాట్లాడుతూ రౌతు కళ్యాణ్ కోదాడ నియోజకవర్గం లో బిజెపి పార్టీ అభివృద్ధిలో ఎనలేని కృషి చేశారని ఆయన కృషికి ఫలితమే ఈనాడు ఈ పదవి అని అన్నారు. రాబోయే రోజులలో మరెన్నో పదవులు పొందాలని బిజెపి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.

కూటమి అభ్యర్థుల నామినేషన్లు

కళ్యాణదుర్గం అక్టోబర్ 18 మనం న్యూస్: కళ్యాణదుర్గం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి బుట్టా లక్ష్మి తిమ్మరాజుతో పాటు 32 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్లు సమర్పించారు.
అంతకుముందు పట్టణంలోని వాల్మీకి సర్కిల్లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరాగా, అక్కడి నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కూటమి శ్రేణుల ఉత్సాహం, నినాదాలతో పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది.

ప్రజల భద్రతకు పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ

సూర్యాపేట, అక్టోబర్ 18 (మనం ప్రతినిధి)ః సూర్యాపేట జిల్లా ప్రజలందరూ దసరా పండుగను సంతోషంగా, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ సూచించారు.పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. పండుగ వేళ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. బెట్టింగ్లు, జూదం, గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, పండుగలను సంప్రదాయబద్ధంగా, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు.
దసరా సెలవుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని పేర్కొన్నారు. ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లేవారు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇంటి భద్రత కోసం సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పండుగ కోసం స్వగ్రామాలకు వచ్చే యువత గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, ఎలాంటి గొడవలకు తావివ్వకూడదని ఎస్పీ సూచించారు. దసరా సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ప్రమాదకర ప్రాంతాల్లో ఆడుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అత్యవసర సమయంలో సంప్రదించండి.డయల్ 112 సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్: 8712686026, 8712686057 లేదా సమీప పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని తెలియజేశారు.

పస్తాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

రూ.1.50 లక్షల వ్యయంతో 10 కెమెరాలు

నాగారం,అక్టోబర్ 18 మనం న్యూస్: మండల పరిధిలోని పస్తాల గ్రామంలో ప్రజల భద్రతను పటిష్టం చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పస్తాల గ్రామ సర్పంచ్ బుక్క శ్రీను గ్రామంలోని పది ముఖ్య కూడళ్ల వద్ద 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ఇందుకోసం రూ.1.50 లక్షలు వేచించినట్లు తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నిత్యం జరిగే కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు వీలు కలుగుతుందని,అలాగే దొంగతనాలు,ఇతర అవాంఛనీయ ఘటనలను నియంత్రించడంతో పాటు,ఏవైనా సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు వాటిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని అన్నారు. గ్రామ ప్రజలకు భద్రత కల్పించే దిశగా ఈ ఏర్పాటు కీలకంగా మారిందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుక్క శ్రీను,ఉపసర్పంచ్ బొజ్జ అశోక్,గ్రామ కార్యదర్శి శివరాత్రి రాజు,వార్డు సభ్యులు, నాయకులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు

- విద్యుత్, సాగునీటి సమస్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణం
- మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 18 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదని, ఏం చేయాలో దిక్కుతోచక చేతులెత్తేసే పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజా సమస్యలను పరిష్కరించడంపై కాకుండా అవినీతి, వాటాల వ్యవహారాలపైనే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు ఎల్నినో కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ...కృష్ణా, గోదావరి జలాలను వినియోగించుకోవడంలో వైఫల్యం
తెలంగాణ నుంచి నీళ్లు పారిపోతుంటే ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందుతోందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటివరకు కృష్ణా నదిలో తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిలో 18 టీఎంసీలు కూడా వినియోగించుకోలేదని పేర్కొన్నారు. కన్నెపల్లి పంపుహౌస్ను ప్రారంభిస్తే చెరువులు నిండేవని, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు నీటితో కళకళలాడేవని గోదావరి నుంచి 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉండేదని అన్నారు.కేసీఆర్ పాలనలో తెలంగాణలో కరువు పరిస్థితులు లేకుండా సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేశామని, కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిందని తెలిపారు.

ఎల్నినోపై ముందస్తు సమాచారం ఉన్నాచర్యలు శూన్యం

ఎల్నినో ప్రభావం ఉండవచ్చని నిపుణులు ఏడాది ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో విఫలమైందని విమర్శించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యుత్ రంగం నిర్వీర్యం

కేసీఆర్ హయాంలో తెలంగాణలో నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యమిచ్చామని, ప్రస్తుతం విద్యుత్, సాగునీటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని జగదీష్ రెడ్డి అన్నారు. యాదాద్రి విద్యుత్ కేంద్రం విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. అధికారుల తప్పిదాలు ఉంటే వెంటనే వివరణ కోరుతూ చర్యలు తీసుకోవచ్చని, అందుకు బదులుగా ఉద్యోగులను బాధ్యులుగా చూపే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.సింగరేణి సంస్థను బద్నాం చేస్తున్నారు.
ప్రైవేటు బొగ్గు సంస్థల నుంచి వచ్చే కమీషన్లకు ఆశపడి సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై జగదీష్ రెడ్డి ఆరోపణలు చేశారు. రాష్ట్ర వనరులను సమర్థంగా వినియోగించకుండా ఇతర రాష్ట్రాలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

చేతకాకపోతే బాధ్యతలు అప్పగించండి

విద్యుత్, సాగునీటి సరఫరాను సమర్థంగా నిర్వహించడం ప్రభుత్వానికి చేతకాకపోతే తమకు బాధ్యతలు అప్పగించాలని, వాటిని ఎలా అందించాలో నిరూపిస్తామని జగదీష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఉద్యోగులు, అన్ని రంగాల ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే గతంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పునరుద్ధరిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కొనసాగుతున్నరవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు

అమలాపురం అక్టోబర్ 18 మనం ప్రతినిధి: అన్నంపాలెం టోల్ ప్లాజా , భట్నవల్లి వై జంక్షన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు నిర్వహించి 4 బస్సులపై కేసులు నమోదుచేసి 9,600 రూపాయలు అపరాధరుసుము విధించామని అదేవిధంగా 216 జాతీయ రహదారిపై అనధికారికంగా నిలుపుదల చేసిన 3 లారీలపై కేసులు నమోదు చేసి 10,800 రూపాయలు అపరాధరుసుము విధించామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లు రహదారి భద్రత నిబంధనలు లోబడి నడుచుకోవాలని అదేవిధంగా జాతీయ రహదారిపై పార్కింగ్ నిషిద్ధమని కఠిన చర్యలు తప్పవని డీ.టీ.ఓ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు సురేష్ కుమార్, కౌశిక్ మరియు వరప్రసాద్ పాల్గొన్నారు.

స్వర్ణకార శంభారావం
వాల్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలగిరి అక్టోబర్ 18 (మనం న్యూస్): తిరుమలగిరి మండలం కేంద్రంలో స్వర్ణకార వృత్తి పరిరక్షణ కోసం ఈనెల 24న న తలపెట్టిన 'స్వర్ణకార శంభారావం' చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభ వాల్ పోస్టర్లను స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు.సందర్భంగా మండల అధ్యక్షులు తల్లోజు శ్రీనివాస చారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షులు వింజమూరు రాఘవాచారి జిల్లా సంఘం అధ్యక్షులు తొగిటి మురళి పిలుపు మేరకు మండలంలోని స్వర్ణకారులు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.
స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెంటనే పాలక మండలిని నియమించాలని,జి.ఓ.ఎం.ఎస్ నెం. 272 ను సవరించి, అమలు పరిచి అక్రమ రికవరీలను అరికట్టాలని,50 సంవత్సరాలు నిండిన స్వర్ణకార వృత్తిదారులకు రూ. 5000/- పింఛన్ ఇవ్వాలని అన్ని బ్యాంకుల అప్రైజర్లకు సీలింగ్ విధానం తొలగించి సమాంతర కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 24 ఎల్.బి. నగర్ లోని సరూర్నగర్ గ్రౌండ్స్ జరిగే బహిరంగ సభను స్వర్ణకార సోదరులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల నాగాచారి, కోశాధికారి కత్తురోజు లక్ష్మాచారి, ఉపాధ్యక్షులు పోలోజు విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి బేతోజు అరుణ్ కుమార్, అలాగే మాజీ అధ్యక్షులు ఈశ్వరా చారి, మల్లికార్జున చారి, యాదగిరి చారి, శ్రీనివాస్ చారి, నరసింహా చారి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులతో రాష్ట్ర సుభిక్షంగా ఉండాలి

- కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్న మంత్రి కొలుసు పార్థసారథి
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో దర్శన ఏర్పాట్లు
- భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మజ్జిగ, పాలు తదితర వసతుల కల్పన.
- సమాచార, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి.

విజయవాడ, 18 అక్టోబర్,(మనం ప్రతినిధి) :ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాని సమాచార, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం శ్రీ దుర్గా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మవారిని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్ర ప్రజలందరు సుభిక్షంగా ఉండాలన్నారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల పవిత్ర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. భక్తులకు సజావుగా దర్శనం కల్పించేందుకు సమన్వయంతో ఏర్పాట్లు.
దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఉత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.
అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీటితో పాటు మజ్జిగ, పాలు తదితర అవసరమైన వసతులు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దసరా మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

అయ్యోరి యానయ్యకు ఘన సన్మానం

మంగపేట,అక్టోబర్ 18,మనం ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన అయ్యోరి యానయ్యను మంగపేట మండలం తిమ్మంపేటలో ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చిన్నపెళ్లి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్బాబు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సురేందర్బాబు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యుడు కొమురం బాలన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బసారీకారి హరికృష్ణ, ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు పుల్లూరి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

- పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

మంగపేట, అక్టోబర్ 18,మనం ప్రతినిధి: కమలాపురం గ్రామానికి చెందిన గాజర్ల ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. విషాద సమయంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో పాటు రాష్ట్ర మంత్రి సీతక్క అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నరసింహారావు, మాజీ జిల్లా కార్యదర్శి తూడి భగవాన్రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడమటిరెడ్డి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, ఎస్సీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి బుజ్జి, గ్రామ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి శశికుమార్, కాంగ్రెస్ నాయకులు ఎండీ మహమ్మద్, గోలి శేఖర్, సదానందం, భూక్య రవి, పోలాకి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపల్లిలో బతుకమ్మ విగ్రహం ఆవిష్కరణ

ములుగు, అక్టోబర్ 18,మనం ప్రతినిధి: సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ములుగు మండలం పత్తిపల్లి గ్రామంలో ఆదివారం బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

గ్రామ సర్పంచ్ ధారావత్ సరిత సారయ్య గ్రామ సమీపంలోని మంచినీళ్ల కుంట వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల భిక్షపతి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యామ్, ఉప సర్పంచ్ పోరిక భద్రూ నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అర్షం రఘుతో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ప్రతి ఆడపడుచు జీవితంలో ఆనందాల పూలు విరియాలి

ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలి
సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

ములుగు, అక్టోబర్ 18,మనం ప్రతినిధి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ బతుకమ్మ పండుగను ఐక్యత, సోదరభావం, ఆత్మీయతతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా బతుకమ్మ పూల పరిమళాలు వెదజల్లాలని, ప్రతి మహిళ జీవితంలో ఆనందాలు విరబూయాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

ప్రజాభవన్లో మంత్రి సీతక్క బతుకమ్మ వేడుకలు

ములుగు, అక్టోబర్ 18, మనం ప్రతినిధి: రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క నివాసమైన ప్రజాభవన్లో ఆదివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి తన బంధుమిత్రులు, వ్యక్తిగత సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూల పండుగను ఆత్మీయుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా వేడుకలు ఆహ్లాదకరంగా సాగాయి.

దుర్గామాత సన్నిధిలో మహా అన్నదానం

- భక్తులకు అన్నప్రసాదం వితరణ చేసిన మంత్రి సీతక్క తల్లిదండ్రులు

ములుగు, అక్టోబర్ 18, మనం ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలోని రామాలయం వద్ద దుర్గామాత సన్నిధిలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి సీతక్క తల్లిదండ్రులు ధనసరి సమ్మక్క, సమ్మయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అంతకుముందు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అన్నదానం గొప్ప మానవీయ సేవ అని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల భిక్షపతి, ములుగు మండల అధ్యక్షుడు ముసినిపల్లి కుమార్గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వేల్పూరి సత్యనారాయణరావు, జిల్లా కార్యదర్శి నూనేటి శ్యామ్, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో జేఏఫ్సీఎం కోర్టు ఏర్పాటు చేయాలి

- కోర్టు సాధన కమిటీ ఏర్పాటు అధ్యక్షుడిగా దాగం ఆదినారాయణ

ఏటూర్ నాగారం, అక్టోబర్ 18, మనం ప్రతినిధి: ఏటూరునాగారం కేంద్రంగా జేఏఫ్సీఎం కోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏటూరునాగారం జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో దాగం ఆదినారాయణ అధ్యక్షతన న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఆరు మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు చేస్తే ఆయా ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలకు సంబంధించిన సుమారు 1,380 క్రిమినల్ కేసులతో పాటు ఎంసీ, డీవీసీ, ఎస్టీసీ, ఎన్ఐ, సివిల్ కేసులు కలిపి దాదాపు 2,000కు పైగా కేసులు ఉన్నాయని సమావేశంలో పేర్కొన్నారు. వీటితో పాటు రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ పరిధిలోని పలు కేసులు కూడా ఏటూరునాగారం కేంద్రంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో జేఏఫ్సీఎం కోర్టు ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రయాణ భారం, ఆర్థిక వ్యయం తగ్గడంతో పాటు న్యాయ సేవలు సులభంగా అందుతాయని వివరించారు. సమావేశంలో న్యాయవాదుల అభిప్రాయాలు, సూచనల మేరకు కార్యాచరణ రూపొందించారు. కోర్టు ఏర్పాటే ప్రధాన లక్ష్యంగా ఏకగ్రీవంగా జేఏఫ్సీఎం కోర్టు సాధన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దాగం ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా కర్నె ప్రణయ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సున్నం రమేష్, కోశాధికారిగా జి. నాగలత, సంయుక్త కార్యదర్శిగా బి.ఎన్. పూర్ణచందర్రావు, మహిళా ప్రతినిధిగా పి. శాంతకుమారిని ఎంపిక చేశారు.జ గౌరవ సలహాదారుగా ఎస్ఆర్ఆర్ కిరణ్కుమార్ వర్మ, ప్రచార కార్యదర్శిగా ఏలూరి రవిప్రసాద్రెడ్డిని నియమించారు. కార్యవర్గ సభ్యులుగా సుగంధపు చిరంజీవి, డి. సుదర్శన్, వాసం నాగరాజు, చిట్టెం లక్ష్మీనారాయణ, పి. భార్గవి, నారా దిలీప్, గొంది శ్రావ్యలను ఎన్నుకున్నారు. సీనియర్ న్యాయవాదులు పూజారి రవికుమార్, పర్వతాల శ్రీనివాస్లను కూడా కమిటీలోకి తీసుకున్నారు. ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటుకు సంబంధించి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, సాధన కోసం సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రక్రియను పరిశీలిస్తున్న లక్ష్మణ్బాబు

ఏటూర్ నాగారం, అక్టోబర్ 18, మనం ప్రతినిధి: పండుగ సెలవులను సైతం పక్కనపెట్టి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మల్లంపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల 100 రోజుల ఇన్చార్జులతో, ములుగు పట్టణంలో పట్టణ ఇన్చార్జులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆన్లైన్ ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి దరఖాస్తుల నమోదు తీరును, వివరాలను పరిశీలించారు. దరఖాస్తుల్లో ఉన్న తప్పులను సరిచేసి, అర్హులైన పట్టభద్రుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఇన్చార్జులు, సిబ్బందికి సూచించారు. గ్రామాలు, వార్డుల వారీగా పర్యటిస్తూ పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఓటరు నమోదుకు నవంబరు 6 తుది గడువు

డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగిన పట్టభద్రులు సంబంధిత నిబంధనల ప్రకారం ఫారం-18 ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని లక్ష్మణ్బాబు సూచించారు. డిగ్రీ ధ్రువపత్రాలతో పాటు అవసరమైన వివరాలను సమర్పించి, తహసీల్దార్ లేదా ఆర్డీవో కార్యాలయాల్లో, ఎన్నికల అధికారిక వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నవంబరు 6లోగా అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

దుగ్గొండి, అక్టోబర్ 18 మనం ప్రతినిధి: దుగ్గొండి మండలం చాపలబండ గ్రామంలో ఆడపడుచుల ఆరాధ్య దైవమైన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ తల్లి విగ్రహం మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, తరతరాలుగా వస్తున్న ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అల్లాడి ప్రభు, దొంతి అవి యుక్త రెడ్డి,సొసైటీ చైర్మన్ తోకల శ్రీనివాస్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి ఏడెల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేశాం

- సీఈసీ మద్దతిచ్చేది లేకుండే
- ఎస్ఈసీ కూడా చోద్యం చూసింది
- బాబుకు ధైర్యం లేదు
- రాష్ట్రంలో ఎన్నికల పేరిట ప్రజాస్వామ్యం ఖూనీ
- కూటమి ప్రభుత్వంపై గవర్నర్కు వైయస్ జగన్ ఫిర్యాదు

విజయవాడ,అక్టోబర్,18,(మనం ప్రతినిధి): ష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తిగా అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా సాగుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి ఆక్షేపించారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల పర్వంలో చోటు చేసుకుంటున్న అంతులేని అక్రమాలపై లోక్భవన్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ను కలిసిన వైయస్ జగన్ ఫిర్యాదు చేశారు. అన్నింటిపై పూర్తి సాక్ష్యాధారాలను ఆయన గవర్నర్కు సమర్పించారు. రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను బెదిరించి నామినేషన్లు కూడా వేయనీయకుండా అడ్డుకున్నారని, పలుచోట్ల రిటర్నింగ్ అధికారుల ఎదుటే నామినేషన్ పత్రాలను చింపేసిన ఘటనలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటూ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మౌనం వహించడం, పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి తొత్తుగా మారి తప్పుడు కేసులు బనాయిస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డిపై జరిగిన దాడి, ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, మద్దిల గురుమూర్తిలపై పెట్టిన అక్రమ కేసులను కూడా ఆయన ప్రస్తావించారు.

వీటన్నింటి నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పారదర్శకత తీసుకు రావడానికి నామినేషన్ల ప్రక్రియను ఆన్లైన్ విధానంలో లేదా సెంట్రలైజ్డ్ విధానంలో స్వీకరించాలని, ఎన్నికల విధుల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని, పోలింగ్ బూతులు, స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సీసీ కెమెరాల నిఘాతో ప్రత్యక్ష ప్రసారం (లైవ్ వెబ్కాస్టింగ్) నిర్వహించాలని గవర్నర్కు విజ్ఞప్తి చేశారు.

సీఈసీ నియామక విధానంలో సంస్కరణలు తీసుకరావాలి

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నియామక విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఎన్నికల కమిషనర్ను అధికారంలో ఉన్న పార్టీలు ఎంపిక చేసే విధానం మారాలన్నారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కలిసి సీఈసీని ఎంపిక చేసే విధానం ఉండాలని సూచించారు. వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయత పెరగాలంటే నియామకాలు నిర్దేశిత విధానం ప్రకారం జరగాలని జగన్ పేర్కొన్నారు. గతంలో సీఈసీ ప్రతిపాదనకు తాము ఒప్పుకోవడం తప్పే అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. గతంలో సీఈసీ నియామకానికి సంబంధించిన విధానానికి తాము మద్దతు ఇచ్చామని, అయితే ఇప్పుడు ఆ మద్దతును ఉపసంహరించుకున్నామని తెలిపారు. తప్పు జరిగిన తర్వాతే తాము కూడా ఈ అంశాన్ని గుర్తించామన్నారు. అందుకే నియామక ప్రక్రియలో మార్పులు తీసుకురావాలని కోరుతున్నట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ నియామకంతో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామక విధానంలోనూ సంస్కరణలు అవసరమని జగన్ అభిప్రాయపడ్డారు.

ఎస్ఈసీ కూడా చోద్యం చూసింది..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేటా ఒకప్పుడు చంద్రబాబు పాలనలో సీఎస్ గా పనిచేశారని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఆయనను తప్పించిందని జగన్ గుర్తు చేశారు. తమ హయాంలో ఎన్నికలు జరిగితే నిమ్మగడ్డ రమేష్ కుమార్ ను అడ్డంపెట్టి అనేక అవరోధాలు సృష్టించారని జగన్ అన్నారు. పుంగనూరు, తిరుపతి, పులివెందులలో ఎందుకు నామినేషన్లను అడ్డుకున్నారని ప్రశ్నించారు. వైసీపీ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కున్న ఘటనలు జరిగాయని, అయినా పోలీసులు, ఎస్ఈసీ చర్యలు తీసుకోవడం లేదన్నారు.

లక్ష్మణ్బాబుకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

ఏటూర్ నాగారం, అక్టోబర్ 18,మనం ప్రతినిధి: సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగలను పురస్కరించుకుని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మణ్బాబు నివాసంలో పండుగ సందడి నెలకొంది. ఏటూరునాగారం సర్పంచ్ శ్రీలతతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్బాబును మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి, శాలువాతో సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తాటి కృష్ణ, ఏటూరునాగారం సింగిల్విండో చైర్మన్ కూనూరు అశోక్గౌడ్, చిట్టిమల్ల సమ్మయ్య, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, ఏటూరునాగారం పట్టణ అధ్యక్షుడు కాజా పాషా, మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ మాజీ చైర్మన్ నూతలకంటి ముకుందం, కోరం నరసింహులు, పూజారి కిషోర్, మాజీ ఎంపీటీసీ మూగల రమేష్, దంతనపల్లి నరేందర్, మూగల రాము, కొలుకుల దేవా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్బాబు మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ, ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా నాయకులు, కార్యకర్తల ఆత్మీయ కలయికతో బీఆర్ఎస్ శ్రేణుల్లో సందడి నెలకొంది.

కూటమి వర్సెస్ వైసీపీ రణరంగంగా మారిన పురపోరు

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. అక్టోబర్ 18 సాయంత్రం 3 గంటలతో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ గడువు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత జరుగుతున్న మొదటి ప్రతిష్టాత్మక పోరు కావడంతో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మరియు విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్సీపీ) మధ్య సింహాసనం కోసం హోరాహోరీ పోరు నెలకుంది. నామినేషన్ల చివరి రోజున ఇరువర్గాల అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో రిటర్నింగ్ అధికారుల (ఆర్ఓ) కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి.

(అమరావతి, పి.మీరాహుస్సేన్ ఖాన్, మనం ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో ఉనికి చాటుకోవడానికి వైసీపీ సర్వశక్తులు ఒడ్డుతుండగా, క్లీన్ స్వీప్ లక్ష్యంతో అధికార కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అయితే ఈ నామినేషన్ల పర్వం ప్రశాంతంగా సాగలేదు. పలు జిల్లాల్లో ఇరు పార్టీల మధ్య ఘర్షణలు, దాడులతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ముఖ్యంగా పుంగనూరు, రాయచోటి, కడప, తిరుపతి వంటి ప్రాంతాలలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. వైసీపీ లోక్సభ పక్షనేత మిథున్రెడ్డి కాన్వాయ్పై, అలాగే మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్రెడ్డి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు దాడులకు దిగాయని నివేదించింది. వైసీపీ ఆరోపణలు: తమ అభ్యర్థులను భయాందోళనకు గురిచేస్తూ, నామినేషన్ పత్రాలను లాక్కొంటూ ఎక్కడా స్వేచ్ఛగా నామినేషన్లు వేయనివ్వడం లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం మరియు రాష్ట్ర ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

నామినేషన్ల గడువును పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ను ఏపీ హైకోర్టు కొట్టివేయడంతో విపక్షానికి చట్టపరంగా ఎదురుదెబ్బ తగిలింది.

ఎన్నికల సంఘం చర్యలు: విపక్షాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఢా, నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అదనపు పోలీసు బలగాలను మోహరించి ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు.

ఎన్నికల తదుపరి షెడ్యూల్

నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది.

అక్టోబర్ 19: నామినేషన్ల పరిశీలన

అక్టోబర్ 21: నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు

అక్టోబర్ 28: పోలింగ్ (జీపీఎంసీ సహా ఇతర స్థానిక సంస్థలకు)

అక్టోబర్ 30: ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాతే ఏయే స్థానాల్లో ఏకగ్రీవాలు అయ్యాయి, ఎక్కడెక్కడ ఇరుపక్షాల మధ్య ప్రత్యక్ష పోరు జరగబోతోందనే పూర్తి స్పష్టత రానుంది. ప్రస్తుతానికి మాత్రం ఏపీ పల్లెల్లో ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది.

రావణుడి పది తలల ప్రతీకాత్మకత



సీతాపహరణతో సహా రావణుని హేయమైన చర్యలు, ఆయనను ఏమాత్రం మార్పులేని రాక్షసుడిగా నిలబెడతాయి. అందరిలాగే రావణుడు కూడా ఒక సంక్లిష్టమైన వ్యక్తి. అతను తన జీవిత ప్రయాణంలో ప్రతికూల లక్షణాలనే కాకుండా, సానుకూల లక్షణాలను కూడా ప్రదర్శించాడు. నిపుణుడైన యోధుడు, రాజకీయవేత్త, రాజు, అలాగే జ్యోతిష్కుడు, ఆయుర్వేద వైద్యుడు అయిన అతను తన రాజ్యాన్ని ఎంతో శ్రద్ధగా చూసుకున్నాడు. అందుకే అక్కడి ప్రజలలో అత్యంత పేదవారు కూడా సుఖంగా ఉండేవారు, ఎన్నడూ దారిద్ర్యంతో బాధపడలేదు. అసాధారణమైన కవి, పండితుడు కూడా అయిన ఆయనకు తరచుగా చిత్రించే పది తలలలో ప్రతి ఒక్కటి ఆరు శాస్త్రాలకు, నాలుగు వేదాలకు ప్రతీక అని ఆయన పరివర్తనకు దేవుడైన శివునికి ప్రసిద్ధ భక్తుడు. కానీ తన ముందున్న వారిలాగే, తన తర్వాత వచ్చిన వారిలాగే, రావణుడు కూడా భోగాభిలాషలో దారి తప్పి, ఆనందాన్ని వెంబడించే క్రమంలో జీవితంలోని అనేక దుర్గుణాలకు లొంగిపోయాడు. ఈ విధంగా, అధికారంపై ఆకలి పెరిగేకొద్దీ, ఆయన పది జ్ఞానాంశాలు అటువంటి అధికారానికి అతుక్కుపోయిన వారి నుండి వెలువడే పది గుణాలకు ప్రతీకలుగా ప్రసిద్ధి చెందాయి. అవేంటంటే, కామ (కామం), క్రోధ (కోపం), మోహ (భ్రమ), లోభం (దురాశ), మద (గర్వం), మాత్సర్య (అసూయ), బుద్ధి (మేధస్సు), మనస్ (మనస్సు), చిత్త (చేయుట), అహంకారం (అహం).

రావణుడి విషయంలో, సీత అతని ఇంద్రియాలకు వస్తువుగా మారింది. కామంతో నియంత్రించబడి, అతను ఆమెను బలవంతంగా అపహరించాడు, ఆమె అతనితో ఉండటానికి నిరాకరించినప్పుడు కోపించాడు. కోపంతో కళ్ళు మూసుకుపోయి, అతను తన తెలివిని పూర్తిగా కోల్పోయాడు. రావణుడంటే తన ఇంద్రియాలను అదుపు చేసుకోలేక, తన నిజమైన ఆధ్యాత్మిక అస్తిత్వానికి భిన్నమైన మార్గంలో పయనించిన వ్యక్తి అని. అందుకే ఇంద్రియ నిగ్రహంతో ఆధ్యాత్మిక పురోగతి వైపు పయనిస్తే, ఇలాంటి పతనాన్ని నిరోధించడం సుసాధ్యం!

- అభిరామి



పాఠకులకు 'విజయదశమి' శుభాకాంక్షలు. దసరా పండుగను 'చెడు మీద మంచి సాధించిన విజయానికి' చిహ్నంగా భావిస్తారు. దసరా మనకు ఇద్దరు వ్యక్తుల గురించి తెలియజెబుతుంది. కొన్ని విషయాల్లో చెడ్డవాళ్ళయిన వీళ్ళిద్దరిలో కూడా మరికొన్ని విశిష్ట లక్షణాలు, అంతులేని మేధోశక్తి ఉన్నాయి. కానీ వారి చెడుప్రవర్తన వారిలోని 'మంచి'ని పూర్తిగా మరుగుపరచి, వాళ్ళను దౌష్ట్యానికి ప్రతీకలుగా మార్చింది.

తనతో తాను పోరాడి ఓడిన యోధుడు

దీని గురించి తెలుసుకుందాం!

మహాజ్ఞాని, కానీ...!

భారతీయ పురాణాల ఆత్మ కేవలం మంచి చెడులకు అతీతమైనది. లోతుగా పరిశీలిస్తే, ప్రతి అడుగులోనూ ఒక ఆసక్తికరమైన కథ ఉంటుంది. రావణుడు ప్రతినాయకుడి పాత్ర పోషించాడు, కానీ ఆయన ఆ పాత్రను ఎందుకు పోషించాడు అనేది చాలా ముఖ్యమైన ప్రశ్న. నిజానికి, మంచి చెడుల సమీకరణంలో సమతుల్యతను తీసుకురావడానికే రావణుడు ఆ పాత్రను పోషించాడు. అందుకే ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో ఆయనను ఇప్పటికీ పూజిస్తుండటంలో ఆశ్చర్యం లేదు.

రావణుడు భారతీయ పురాణాలలోని గొప్ప ఋషులలో ఒకరైన, సప్తఋషులలో ఒకరైన పులస్త్యుని మనవడు, ఆయన విశ్వావసుడనే మహర్షికి, అసురుని తల్లి అయిన కైకశికి జన్మించాడు. అందువల్ల ఆయనను సగం అసురుడు, సగం బ్రాహ్మణుడుగా పరిగణిస్తారు. ప్రాచీన హిందూ ఇతిహాసం రామాయణంలో రావణుడు ప్రధాన ప్రతినాయకుడిగా ప్రసిద్ధి చెందాడు. ఆయనను ఒక రాక్షసుడిగా, లంకకు గొప్ప రాజుగా చిత్రీకరించారు. ఆయన పది తలల రాక్షసుడిగా ప్రసిద్ధి చెందాడు, కానీ రావణుడు పది తలలతో పుట్టలేదనే విషయం చాలా మందికి తెలియదు. రావణుడు వాస్తవానికి శివ భగవానుడికి గొప్ప భక్తుడు, అపారమైన పండితుడు, అద్భుతమైన పరిపాలకుడు, గొప్ప వైణికుడు. ఆయన రావణ సంహిత (జ్యోతిష్య శాస్త్ర గ్రంథం), అర్క ప్రకాశం (సిద్ధ వైద్య గ్రంథం) అనే రెండు పుస్తకాలను రచించాడు. ఆయుర్వేదం, క్షుద్రవిద్యలలో నిష్ణాతుడు. ఆయన తన ఇష్టానుసారం గ్రహ స్థానాలను నియంత్రించగలడని అంటారు. రావణుడు తన సవతి సోదరుడైన కుబేరుడి నుండి గెలుచుకున్న పుష్పకవిమాన్ని (ఎగిరే రథం) కలిగి ఉండేవాడు. ఆయన తంత్ర విద్యలో (భావాల దృశ్య భ్రమలను సృష్టించే శాస్త్రం) ప్రావీణ్యం సంపాదించి, దానిని తన శత్రువులతో జరిగిన యుద్ధాలలో ఉపయోగించాడు.

ఒకసారి రావణుడు కైలాస పర్వతాన్ని ఎత్తడానికి ప్రయత్నించినప్పుడు, శివుడు అతని నుదుటిని పర్వతం కింద నలిపివేశాడు. అప్పుడు రావణుడు శివ స్తుతి గీతాలు ఆలపిస్తూ క్షమించమని వేడుకున్నాడు. రావణుడిపై శివుడు ఎంతగానో సంతోషించి, ప్రచండమైన ఉగ్రతతో, ఆవేశంతో నాట్యం చేయడం ప్రారంభించాడు. ఈ నాట్యాన్నే తాండవం అని, ఆ మంత్రాలనే శివ తాండవ స్తోత్రం అని పిలవడం మొదలుపెట్టారు. విద్యను అభ్యసించడానికి, రావణుడు నర్మదా నదీ తీరంలో శివుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఒక మహా తపస్సు చేశాడు . భగవంతుడిని ప్రసన్నం చేసుకోవాలనే కోరికతో, రావణుడు తన తలను వేరు చేశాడు. అతను అలా చేసిన ప్రతిసారీ, ఆ తల తిరిగి మొలిచేది. ఈ విధంగా పదిసార్లు జరగడంతో, అతను తన తపస్సును కొనసాగించగలిగాడు. అందువల్ల, శివుడు తాను త్యాగం చేసిన పది తలలను రావణుడికి ప్రసాదించాడు. ఈ పది తలల కారణంగానే అతన్ని 'దశముఖ' అని కూడా పిలుస్తారు. రావణుని పది శిరస్సులు ఆరు శాస్త్రాలకు (హిందూ మత పవిత్ర గ్రంథాలైన శ్రుతి, స్మృతి, పురాణ, తంత్ర అనే నాలుగు విభాగాలు), నాలుగు వేదాలకు ప్రతీకగా నిలుస్తాయి. వీటిలో రావణుడు ప్రావీణ్యం సంపాదించి, ఆ కాలంలోని గొప్ప పండితుడిగా, అత్యంత మేధావులలో ఒకడిగా నిలిచాడు. అతడు 64 రకాల జ్ఞానంలో, అన్ని ఆయుధ విద్యలలో నిష్ణాతుడు. ఆయన వేదాలను వాటికి సంబంధించిన సంగీత స్వరాలతో (నోట్లతో) సంకలనం చేసినట్లుగా ప్రసిద్ధి చెందాడు. రావణుడి పది తలలకు మరో వ్యాఖ్యానంగా పది భావోద్వేగాల్ని ఉటంకిస్తారు. ఆ భావోద్వేగాలు: కామం, క్రోధం, మోహం, లోభం, మదం, మాత్సర్యం, అసూయ, మనస్సు, బుద్ధి, చిత్, అహంకారం. ఒకప్పుడు, గొప్ప రాజు మహాబలి ఈ తొమ్మిది భావోద్వేగాలను విడిచిపెట్టి, కేవలం బుద్ధిని మాత్రమే కలిగి ఉండమని రావణుడికి సలహా ఇచ్చాడు. దానికి ఆయన, ఈ అన్ని అంశాలు సమానంగా ముఖ్యమైనవని, అవి ఒక వ్యక్తిని పరిపూర్ణ పురుషుడిగా చేస్తాయని సమర్థించుకున్నాడు. బుద్ధి అనే ఒక తల రావణునివిధిని నియంత్రించగా, ఆయనలోని ఇతర తలలు తన చర్యలను నియంత్రించాయి, ఇది చివరికి ఆయన వినాశనానికి దారితీసింది. రావణుడు చివరికి తన ఇంద్రియాలకు బానిస అయ్యాడు, తన కోరికలను నియంత్రించుకోలేక, తనను, తన వంశాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, యావత్ లంకను బూడిదగా మార్చాడు. తన జీవితంలో తాను పొందిన జ్ఞానాన్ని ఆచరించనందుకు రావణుడు పశ్చాత్తాపపడ్డాడు, ఇది చివరికి రావణుని పతనానికి దారితీసింది.

- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)(ఇంటర్నెట్ కథనాల ఆధారంగా...)

Illustration : Yogesh Jadav

అధికారం, అంధకారం!

అహంకారానికి బలైన బ్రహ్మదేవుని భక్తుడు

హిందూ పురాణాలలో, మహిషాసురుని కథ ఒక ముఖ్యమైన, ప్రతీకాత్మకమైన గాథ, ముఖ్యంగా శాక్తేయంలో.

ఉపపురాణాల ప్రకారం, ఒకప్పుడు రాంభాసురుడు అనే ఒక అసురుడు ఉండేవాడు. అతను శివుడిని ప్రసన్నం చేసుకుని కుమారుడిని పొందడం కోసం అనేక యజ్ఞాలు చేశాడు. అతని ప్రయత్నాలకు సంతోషించిన శివుడు, రాంభాసురుడికి మూడు లోకాలలో అజేయుడు, ప్రసిద్ధి చెందిన కుమారుడిని కనే వరాన్ని ప్రసాదించాడు. అలా ఒక అసుర తండ్రికి, ఒక దున్నపోతు తల్లికి మహిషాసురుడు జన్మించాడు. మహిషాసురుడు శివుని దున్నపోతు అవతారం. అతను ఒక బలవంతుడైన అసురుడిగా, గొప్ప యోధుడిగా, పండితుడిగా ఎదిగాడు. అతని పాలనలో అసురులు వర్ధిల్లారు. మహిషాసురుడు బ్రహ్మదేవునికి గొప్ప భక్తుడు. సంవత్సరాల తపస్సు తర్వాత, బ్రహ్మదేవుడు చివరకు ప్రసన్నుడై అతనికి ఒక వరం ఇచ్చాడు. అధికారంపై మోజుతో, మహిషాసురుడు అమరత్వాన్ని కోరాడు. భూమిపై ఏ 'మనిషి లేదా జంతువు' చేత తాను చంపబడకూడదనేది అతని కోరిక. బ్రహ్మదేవుడు అతని కోరికను మన్నిస్తూ, వరమిచ్చాడు, కానీ ఒక స్త్రీ అతని పతనానికి కారణమవుతుందని చెప్పాడు. అహంకారంతో నిండిన మహిషాసురుడు, స్త్రీలు బలహీనులు, సున్నితమైనవారు, తనకంటే తక్కువవారని నమ్మాడు. అందువల్ల, తనకు హాని కలిగించగల స్త్రీ ఈ ప్రపంచంలో ఎవరూ లేరని అతను భావించాడు. బ్రహ్మదేవుడు మహిషాసురునికి అమరత్వ వరాన్ని ప్రసాదించిన తరువాత, అతను అధికార మదంతో స్వర్గ, నరక, భూలోకాలైన త్రిలోకాలపై దాడి చేశాడు. అతను ఇంద్రుని రాజ్యమైన ఇంద్రలోకాన్ని కూడా ఆక్రమించేంత వరకు వెళ్ళాడు.

మహిషాసురుడు దేవతలపై యుద్ధం చేశాడు, కానీ బ్రహ్మదేవుని వరం వల్ల ఎవరూ అతన్ని ఓడించలేకపోయారు. అందువల్ల దేవతలు సహాయం కోసం విష్ణుమూర్తిని ఆశ్రయించారు. చాలా ఆలోచనల తర్వాత, బ్రహ్మ, విష్ణు , శివుడు అనే త్రిమూర్తులు తమ శక్తులన్నింటినీ ఏకం చేసి, మహిషాసురుడిని ఓడించడానికి ఒక స్త్రీ రూపాన్ని సృష్టించాలని నిర్ణయించుకున్నారు. అలా పర్వతాధిపతి అయిన హిమవంతుని కుమార్తె, పార్వతీ దేవి అవతారమైన దుర్గాదేవి ఉద్భవించింది. దుర్గాదేవి 15 రోజుల పాటు మహిషాసురుడితో పోరాడింది. ఈ సమయంలో అతను వివిధ జంతువుల రూపంలోకి మారుతూ ఆమెను తప్పుదోవ పట్టించాడు. చివరకు అతను దున్నపోతుగా మారినప్పుడు, దుర్గాదేవి తన త్రిశూలంతో అతన్ని పొడిచింది, దాంతో అతని కథ ముగిసింది. మహాలయ రోజున మహిషాసురుడు ఓడిపోయి హతమయ్యాడు.

ఈ గాథకు సంబంధించిన మరో కథనం ప్రకారం, మహిషాసురుడు ఒకసారి తన స్వప్నంలోనే తన మరణానికి కారణం కాబోతున్న దేవిని చూశాడు. ఆ తర్వాత అతను 16 చేతుల భద్రకాళిని పూజించాడు. ప్రసన్నమైన ఆ దేవి మహిషాసురుడి ముందు ప్రత్యక్షమవ్వగా, ఆ కల ద్వారా తన అంతం సమీపించిందని గ్రహించానని అతను ఆమెతో చెప్పాడు. అందుకే, తనను సంహరించి మోక్షాన్ని ప్రసాదించమని అతను ఆ దేవిని కోరాడు. ఆ దేవి అతన్ని ఆశీర్వదించి, తాను అతనికి భౌతిక శరీరం నుండి విముక్తి కలిగించిన తర్వాత, అతను భూమిపై పునర్జన్మ ఎత్తడని, తనలో లీనమవుతాడని చెప్పింది. ఇది అసురుడిగా అతని మూడవ జన్మ అని కూడా దేవి మహిషాసురుడికి తెలియజేసింది. గత కల్పాలలో, ఆమె ఉగ్రచండ, భద్రకాళి రూపంలో అతన్ని సంహరించింది. తన కలలో, గత కల్పంలో తనను సంహరించిన అదే భద్రకాళిని అతను చూశాడు. అందువల్ల, దేవి తన మహిషాసుర మర్దిని రూపంలో, తనకు పూజ జరిగినప్పుడల్లా మహిషాసురుడు ఎల్లప్పుడూ తన ఎడమ పాదం కింద ఉంటాడని, పూజకు అర్హుడని చెప్పింది. దేవి వాహనమైన సింహ రూపంలో ఆమె బరువులో సగభాగాన్ని మోయవలసి వచ్చిన విష్ణుమూర్తికి విముక్తి కలిగించడానికి మహిషాసురుడు జన్మించాడు. అందువల్ల, దేవి తన ఎడమ పాదాన్ని మహిషాసురునిపై, కుడి పాదాన్ని శ్రీహరి రూపమైన సింహంపై ఉంచుతుంది.

మరో కథ ప్రకారం, మహిషాసురుడి గాథ దాదాపు 3000 సంవత్సరాల క్రితం నాటిది. ఆ కాలంలో మహిషాసురుడు ఆర్యుడు కాని రాజు, అతని ప్రజలు మహిషాన్ని పూజించేవారు. ఆర్యావర్త ఉత్తర రాజ్యంలో అనేక ఆర్య రాజులను ఓడించడంతో మహిషాసురుడి శక్తికి హద్దులు లేవు. మహిషాసురుడి చేతిలో చాలా మంది రాజులు ఓడిపోతుండగా, ఆర్యావర్త ఉత్తర భాగాన్ని పాలించడానికి ఒక రాణి వచ్చింది. అప్పటికే ఆ మహారాజు చేతిలో ఓడిపోయిన రాజులు ఆ రాణికి తమ విధేయతను ప్రకటించారు. ఆమె సైన్యం బలంలోనూ, సంఖ్యలోనూ వృద్ధి చెందుతుండగా, మహిషాసురుడికి సరఫరాలు, సైనిక శక్తి తగ్గిపోసాగాయి. ఒక స్త్రీ చేతిలో తాను ఓడిపోలేనని భావించి, తన భార్యగా మారమని రాణి వద్దకు దూతలను పంపాడు. రాణి నిరాకరిస్తూనే ఉంది. ఇంతలో, మహిషాసురుడి సైన్యం రాణి సైన్యం నుండి తమను తాము రక్షించుకోలేనంతగా అలసిపోయినప్పుడు, ఆ రాణి మహిషరాజుపై దాడికి ప్రణాళిక వేసింది. మహిషాసురుడు తానే రాణిని ఓడించగలనని అనుకున్నాడు, కానీ ఆమె తన ఈటెతో అతడిని చంపి, అతని ఛాతీని చీల్చి, తన పెంపుడు సింహానికి ఆహారంగా వేసింది.

- కల్కి

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.